ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 2 సంచిక - 9 జూన్ - 2021 జ్యేష్ఠ పేజీలు 68 వెల రూ. 20



అక్షర యోధులకు జోహార్లు...


సాహితీప్రవంతి





# 'కథ'నాయకుడికి జోహార్లు

కథల మాష్టారుగా, కారా మాష్టారుగా ప్రసిద్ధి చెందిన కాళీపట్నం రామారావు మాష్టారు సాహితీ స్రవంతి ఆవిర్భావానికి ముందు నుంచి మా కార్యక్రమాలకు చేదోడు వాదోడుగా ఉన్నారు. ఎప్పుడు ఏ కార్యక్రమానికి పిలిచినా కాదనకుండా హాజరై, తన అనుభవాలను అభిప్రాయాలను విశ్వాసాలను కథలుగా రచయితలతో పంచుకున్నారు. విశాఖలో జరిగిన కథల పోటీకి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. సాహితీ స్రవంతి ప్రథమ సభకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. 'దర్పణం' సాహిత్య సంచిక వెలువరించినప్పుడు సాహిత్య ప్రయోజనం గురించి వివరించారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన 'సాహిత్యశాలలు' పెట్టినప్పుడు ప్రారంభకులుగా హాజరై, ప్రసంగించి, ఉత్తేజపరిచారు. ఆయన వయసురీత్యా అంతగా బయటకు రాలేని స్థితిలో ఉన్నప్పుడు 2019 నవంబరులో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు తెలకపల్లి రవి నేతృత్వంలో ఒక బృందం శ్రీకాకుళంలోని కథానిలయానికి వెళ్లి, ఆయనకు సత్కారం చేసి, గౌరవించింది. మాష్టారి సదాశయ సాహిత్య మార్గాన్ని సాహితీ స్రవంతి, ప్రస్థానం కొనసాగిస్తాయి.







# సెలవు, కథల మాష్టారూ!

**క**థలు రాసిన వాళ్లు వందల్లో వున్నారు. వారి కథలు వేనవేలుగా కూడా వుండొచ్చు. కాని కథకు తానే చిరునామా అయినవారూ, కథే తన చిరునామాగా కడదాకా బతికిన వారూ కాళీపట్నం రామారావు. కారా మాష్టారు జీవితాన్ని కథ కట్టడం ఎలాగో నేర్పారు. కథే జీవితంగా బతికారు. కథనూ బతికించారు. కాని కథలన్నాక ముగింపు వుంటుందని తెలుసాయనకు. తన యజ్ఞం కథలోలా బీభత్స భయానక ముగింపులా కనిపించినా దాని చాటున జీవిత వాస్తవికత ఏమిటో, వర్గ వైరుధ్యాలేమిటో ఒడిసిపట్టుకున్న ప్రజ్ఞావంతుడు ప్రజాపక్ష సృజనకారుడు. నచ్చిన కథలు చదవడం, నచ్చినట్టు రాయడం మాత్రమే కాదు; తెలుగున వచ్చిన కథలన్నీ సేకరించడం అవసరమన్న కథా ప్రేమికుడూ కారా మాష్టారు. కథ తూర్పు దిక్కును చూడవలసిందేనని ఆయన ఒకసారి అన్నారు. ఆవిధంగానే తెలుగు కథల గురించి ఏ వివరం కావాలన్నా తెలుగువాళ్లు శ్రీకాకుళం దిశగానే చూస్తూ వచ్చారు. అడపాదడపా ఆయన అనుభవాలు పంచుకుంటూనూ వచ్చారు. ప్రగతిశీల ప్రజాభావుకుడైన కారా మాష్టారు పురోగామి సాహిత్య సంస్థలతో కలసి నడుస్తూనే వున్నారు. కథకులను సాహిత్యకారులను ప్రోత్సహిస్తూనే వచ్చారు. సాహితీ స్రవంతి కార్యక్రమాలు ఎన్నిటికో ఆయన ప్రారంభకులు. కొంతకాలం కిందట కథానిలయంలో ప్రత్యేకంగా పెద్దాయన అభినందన కార్యక్రమం జరిపి మా గౌరవం చాటుకున్నాము. ఆయనా ఎంతో అభిమానంగా ఆర్ద్రంగా స్పందించారు.

కారా మాష్టారు తొమ్మిది పదుల వయసులోనూ జీవితం తాలూకూ సత్యాలను అన్వేషించడం, దొరికిన ప్రతి కథనూ కథా నిలయంలో చేర్చడం తప్ప మరో ఆశ ధ్యాస లేకుండా నిర్మలంగా, నిర్మాణాత్మకంగా గడిపారు. తనను ఆరాధించేవారు అసంఖ్యాకంగా వున్నా, అనుసరించేవారు అత్యధికంగా వున్నా, కొన్ని రకాలైన అభిశంసనలూ వచ్చినా ఆహ్వానించారు. నిండుకుండలా నిండైన నిబద్ధ జీవితం గడిపారు. నిరాడంబరతకు నిర్వచనంగా మసలారు. అందుకే ఆయన అక్షరాలా అయ్యవారు అనిపించుకున్నారు. అందుకే ఆయన కన్నుమూత కథలకే వ్యథ. అయితే నిత్యనూతనమైన ప్రతి తెలుగు కథలో ఆయన తొంగిచూస్తూనే వుంటారు. పలకరిస్తూనే ఉంటారు. మన ఉద్వేగంతో ఆయనకు సెలవు చెప్పడమే గాని కథలే నెలవుగా తన స్ఫూర్తి మనతోనే ఉంటుంది. ■


| ప్రధాన సంపాదకుడు | సంపాదకవర్గం | బొమ్మలు |
|---|---|---|
| తెలకపల్లి రవి | కె.సత్యరంజన్ | తుంబలి శివాజి |
| వర్కింగ్ ఎడిటర్ | కెంగార మోహన్ ◆ వొరప్రసాద్ | చిదంబరం |
| సత్యాజీ | మేనేజర్ : కె.లక్ష్మయ్య | |

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు


వారసత్వం - చాగంటి ప్రసాద్ .................5
దీపం - పెమ్మరాజు విజయ రామచంద్ర ....22
డివైడర్ - రత్నాల బాలకృష్ణ .................32
మూట - చెల్లపిళ్ల శ్యామల ................. 44


## కవితలు


సామాన్యుడి మాట - అవనిశ్రీ .......................... 9
రాజద్రోహి - డా.మాటూరి శ్రీనివాస్ ........ 15
పులకించని రాగం ... లోసారి సుధాకర్ ................ 16
నేనెవరిని? ... చిలుకూరి దీవెన ............... 25
శుభ్రత నేస్తాలు - కోరాడ అప్పలరాజు ........... 31
కవి - హరీష్ గౌడ్, వృత్యాసం - లై ................... 36
ఏడు పదులు - రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ........... 39
ఓ నా పెనిమిటి - గవిడి శ్రీనివాస్ .................. 44
సంధ్యా పరిమళం - అవ్వారు శ్రీధర్ బాబు .......... 48
డిజిటల్ లాకర్ - ఆకుల మల్లేశ్వరరావు ........ 52
వెతుకులాట - ఏటూరి నాగేంద్రరావు ........53
మిత్రుల కోసం ... - ఈతకోట సుబ్బారావు....... 56
ఆకలి బండి - ఈ.రాఘవేంద్ర ............ 62
హైకూలు-బి గోవర్ధనరావు, దామరగుంట శంకరయ్య..63


## వ్యాసాలు


సాహిత్య ప్రస్థానం మే 2021 పురస్కారాలు ......... 8
నివాళి : కథలను మనకు వదిలెల్లిన కథాదీపదారి
- గంటేడ గౌరు నాయుడు ....................... 11
ఆయన కథలు నేటివి, రేపటివి కూడా! - లాంగుల్య ... 13
నివాళి : నిబద్ధత, నిర్దుష్టత కెకెఆర్ మార్గం
- తెలకపల్లి రవి ..................................17
మనోధైర్యాన్నిచ్చే కవిత్వం - అమూల్య చందు .......20
హృదయాన్ని తాకే మానవీయ కథలు
- బొడ్డపాటి చంద్రశేఖర్ ............................26
సామాజిక వాస్తవికత, భావావేశపు మేలి కలయిక
- వొరప్రసాద్ ................................. 28
అస్తవ్యస్తతపై గళమెత్తిన కలం - జంధ్యాల రఘుబాబు .....37
సీమ చైతన్యమే జలగండం, జలస్వప్నం - డా.రాధేయ 40
అదృష్ట దీపక్ చిరస్మరణీయుడు-ఆర్ మల్లికార్జునరావు... 46
వర్తమానం : మీడియా- రాజద్రోహం - సుప్రీంకోర్టు బాధ్యత
- తె.ర ...................................... 49
'తపాలా బంట్రోతు' కవిత పుట్టిందిలా
- డా. తంగిరాల వెంకట సుబ్బారావు ...... 54
మనసులను కుదిపే మూడో కన్నీటి చుక్క- జోశ్యుల దీక్ష .. 57
బాల్య స్మృతుల గుచ్ఛం డా. కవితా శ్రీ .................60
డైరీ ... .....................................................64



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

కథ



# వారసత్వం

- చాగంటి ప్రసాద్
90002 06163

**వే**సవి కాలం.. ఎండలు మండి పోతున్నాయి. మే నెల రాకుండానే ఇంత ఎండలా అని జనం అల్లాడిపోతున్నారు. కోర్టుకి ఇంకా సెలవులు ఇవ్వలేదు. కోర్టు ఆవరణమంతా వచ్చే జనం, వెళ్ళే జనంతో హడావుడిగా ఉంది.

కేసులు నెగ్గిన వాళ్ళు ఆనందంగా వెడుతుంటే, ఓడిపోయినవాళ్ళు న్యాయం కోసం పై కోర్టుకి వెళ్ళాలా వద్దా అని బుర్ర బాదుకుంటు ఉసూరుమంటూ వెడుతున్నారు.

"సహజ న్యాయం" అన్న ఒక్క సాకు మీద కేసులు వాయిదాలు పడి కుప్పలు కుప్పలుగా పేరుకు పోతున్నాయి. వాటి కింద ఎక్కడో న్యాయం అన్న 'బ్రహ్మపదార్థం' దాక్కుని ఉంది. మధ్యాహ్నం ఒంటిగంట అయ్యింది. కోర్టు అరుగు మీద ఉన్న కక్షిదారులు ఆతృతగా తమకి అందాల్సిన రేషన్ ఎప్పుడందుతుందా? అని ఎదురుచూసే లబ్ధిదారుల్లా 'న్యాయకోసం' వేచి ఉన్నారు. జడ్జిగారి నోటి నుంచి 'వాయిదా'ల పదాలు విని, ఆర్చుకుపోయిన పెదాల్ని నాలుకలతో తడుపుకుంటూ, మొహాలు వేలాడేసుకొని వెనుదిరుగుతున్నారు.

అప్పుడే కోర్టు కాంపౌండులోకి మాసిపోయిన పొడుగు చేతుల చొక్కా, కాలి మడమలపై వరకు పోయిన ప్యాంటు వేసుకున్న ఐదడుగుల మనిషి అడుగు పెట్టాడు. కురచ క్రాపు, నెత్తిమీద ఉన్న నాలుగు వెంట్రుకలు. నుదుట మీద పడి 'దేశపటంలో కరువు ప్రాంతాల్ని గుర్తులు పెట్టినట్టు' జిడ్డుతో అతుక్కుపోయి ఉన్నాయి. మోచేతికి వేలాడుతున్న చిన్న సంచి, అందులోంచి ఏవో కాగితాలు బయటకు కనబడుతున్నాయి. నెమ్మదిగా కోర్టు అరుగు ఎక్కాడు.

కోర్టు హాలు తలుపు దగ్గర కాపలాగా బల్లమీద కూర్చున్న బంట్రోతుని చేత్తో తట్టి 'యాండి! లాయర్ సూర్య కిరణ్ గారు యాడుంటారండి' అని నెమ్మదిగా అడిగాడు.

'కిరణ్ గారా? ఆయనేందుకయ్యా.. చాలా పేరున్న లాయర్. మాట్లాడాలంటే పది వేలు అడుగుతారు" అన్నాడు, ఎగాదిగా అతని వాలకం చూసి.

కిరణ్ దగ్గర పనిచేసే రామారావు ఆ మాటలు విని ఆగి "ఆయన అందరి దగ్గరా అంత ఫీజు తీసుకోరు. వాళ్ళ ఆర్థిక స్థితిని బట్టి తీసుకుంటారు. నాతో రా!" అని కోర్టు హాలు పక్కన దూరంగా ఉన్న బార్‌రూమ్‌లో ఉన్న సూర్య కిరణ్ శర్మ దగ్గరకు తీసుకెళ్ళి,

"సార్! మీ కోసం ఎవరో వచ్చారు" అని వచ్చినతన్ని చూపించాడు.

కిరణ్ అతని కేసి తిరిగి "ఎవరు మీరు? ఏం కావాలి? ఏదైనా కేసు గురించి వచ్చారా?" అని అడిగాడు.

"కాదండి! మీతో ఓ పాలి మాట్టడాలండి" అని నెమ్మదిగా అన్నాడు.

అతని దగ్గరకి కేసుల నిమిత్తం చాలామంది బీదవాళ్లు వస్తూ ఉంటారు. ఏమి ఇచ్చుకోలేమంటారు. అలా వచ్చిన

వాళ్ళకి అతను శాయశక్తులా ఫీజు పుచ్చుకోకుండా కేసులు వాదిస్తాడు. ధర్మం కాదనిపించిన ఏ కేసూ తీసుకోడు.

"కేసు నిమిత్తం అయితే మా ఆఫీసుకు రండి. మీరెవరో నాకు తెలియదు! మీతో ఏం మాట్లాడతాను?'' టైం చూసుకుంటూ అన్నాడు.

"ఒక ముఖ్యమైన ఇసయం సర్!" అన్నాడతను ప్రాధేయ పూర్వకంగా.

"మీతో ఇడిగా మాట్లాడాలండి. మళ్ళీ అమలాపురం తిరుగు బస్ ఐదు గంటలకు ఉందయ్యా!" అన్నాడు మళ్ళీ.

అతని మాట కాదనలేక సరే అని బయటకు దారి తీశాడు. ఇద్దరూ కోర్టు క్యాంటిన్‌లో కూర్చున్నారు.

"మీ పేరు?" అడిగాడు కిరణ్.

"సంజీవండి! మాది అమలాపురమండి" అన్నాడతను.

అతనిని చూస్తే నీరసంగా కనబడ్డాడు. ఆకలితో ఉన్నట్టు గ్రహించిన కిరణ్ "భోజనం చేశారా? ఏమైనా తింటారా?" "లేదండి ఒటేల్లో సుష్టుగా తినేసానండి" అని తడబడుతూ అన్నాడతను.

"కాస్త టిఫిన్ తినండి, కంగారు లేదు. స్థిమితంగా మాట్లా డండి" అని రెండు ప్లేట్లు ఇడ్లీ తెప్పించాడు.

అతను తినే విధానం చూసి అన్నం తిన్నానని చెప్పింది అబద్ధమేమో అనిపించింది కిరణ్‌కి. జాలి కూడా కలిగింది. కంగారుగా నోట్లో కుక్కుకుని తిన్నప్పుడు గొంతుకి అడ్డం పడిన ఇడ్లీ ముక్క వల్ల దగ్గు వచ్చింది. అక్కడున్న మంచినీళ్ళ గ్లాసు ఇచ్చాడు. గడగడ తాగి చెయ్యి కడుక్కుని నోటిని చొక్కాతో తుడుచుకున్నాడు. టీ కూడా తాగాక, గొంతు సవరించుకుని... సంజీవి చెప్పాల్సిందంతా చెప్పి కిరణ్ మొహంలోకి చూశాడు.

"అదండి ఇసయం!" కాబట్టి తమరు కాదనక దయుంచి మీ ఇల్లు మీరు తీసేసుకోండి బాబు! ఇవిగొండి ఆ ఇంటి కాయితాలు" అని అతని చేతుల్లో పెట్టాడు. కిరణ్ కాగితాలని తిరిగి ఇచ్చేస్తూ...

"చూడు సంజీవి! నువ్వు చెప్పిన విషయాలేవి నాకు తెలియవు. మీరు ఇస్తున్నారు కదాని నేను ఆయాచితంగా ఏదీ తీసుకో లేను. మా అమ్మగారిని ఈ విషయాలన్నీ అడిగి నిర్ధారణ చేసుకున్నాక అప్పుడు ఆలోచిద్దాం. మీరు మీ ఊరు వెళ్ళండి." అని అతని అభ్యర్ధనని తిరస్కరించాడు.

"అయ్యిబాబో! అలా అనకండి సారు! మీకు తెల్దు ఇంటిల్లిపాది ఎంత నరకం అనుబవిత్తన్నామో" అని దీనంగా బతిమాలాడు.

"నీకు మా అడ్రెస్ ఎవరు చెప్పారు?" అని సందేహంగా అడిగాడు కిరణ్.

"మా నాన్ననే ఇవరం అడిగితే సెప్పలేక సెప్పలేక తమరి తండ్రి గారి పేరు సెప్పారండి. సూన్నాణ మాష్టారు గోరని. వూర్లో వాకబు సెత్తే ఒక స్కూల్ మేడమ్ గారు సెప్పారండి. ఆయన మీ తండ్రి గారని తెలిసింది. మీ అమ్మగారు శాంతమ్మ గోరు తెలుసని, మీరు ఈ వూర్లో లాయర్‌గా పని సెత్తున్నారని కూడా సెప్పారండి"

"ఇంతకీ నువ్వేం పని చేస్తువుంటావు?"

"చిన్న కిరాణా కొట్టండి. మొత్తం కుటుంబానికి నా ఆదాయమే ఆదరువండి."

"మరి ఈ ఇల్లు మాకిచ్చేస్తే నువ్వెక్కడుంటావు?" జాలిగా అడిగాడు.

"పర్లేదండి. ఏదో ఒకటి సూసుకుంటామండి. ఈ పాపం కడుక్కునే అవకాశం ఇమ్మనమని మా అయ్య సెప్పాడండి." అని అతడు చెబుతుంటే– ఈ రోజుల్లో సంజీవి లాంటి అమాయక జీవులు కూడా ఉన్నారని తెలిసి, చలించిపోయాడు.

"సర్లే, నాలుగు రోజులు అయ్యాకా రా" అని కాగితాలు తీసుకున్నాడు.

"తమరి ఫోన్ నెంబరు ఇయ్యండయ్యా! వచ్చేముందు ఫోన్ సేసి వత్తాను"

"నువ్వు రానవసరం లేదు. నేనే వస్తాను." అని అతను మొహమాట పడ్డా, జేబులో ఐదు వందల కాగితం పెట్టి పంపా డు. ఆఫీసుకి వచ్చి, "రామారావ్.. ఈ డాక్యుమెంట్స్ నెంబర్‌తో ఈసి తీయించి, లింక్ డాకుమెంట్లకి అప్లై చెయ్యి. ఈసి రాగానే వెంటనే నాకు ఫోన్ చెయ్యి" అని గుమస్తాకి ఇచ్చాడు.

◆ ◆ ◆

దారిలో ఉండగానే రామారావు ఫోన్ చేశాడు.

"సర్, లింక్ డాక్యుమెంటు వారణాసి సూర్యనారాయణ శర్మ గారి పేరు మీద వుందండి" అని చెప్పాడు. సంజీవి చెప్పినది నిజమేనన్న మాట అని ఆలోచనలో పడ్డాడు కిరణ్.

◆ ◆ ◆

కిరణ్ ఇంటికి చేరగానే భార్య మధువని తలుపు తీసింది.

"అమ్మ పడుకుందా?" అని అడిగాడు.

"అవును.. రేపు మీ నాన్న గారి ఆబ్దికం కదా! పెంద్రాళే లేవాలని త్వరగా నిద్రపోయారు"

ఇంటికి వచ్చిన వెంటనే తల్లిని చూసి కాసేపు కబుర్లు చెప్పడం అతనికి అలవాటు. రాత్రంతా నిద్రపట్టక మంచం మీద దొర్లుతూనే ఉన్నాడు. అది గమనించిన మధువని ...

"ఏమండి ఇంకా నిద్రపోలే? పడుకోండి! పొద్దున్నే త్వరగా లేవాలి కూడాను" అంది.

ఆమె చేతిని పట్టుకుని, "మధూ... హఠాత్తుగా కొంత ఆస్తి కలిసి వచ్చిందనుకో.. నీకు కలిగే స్పందన ఏమిటి?" అనడిగాడు.

"ఎవరికైనా ఆనందమే కదా! కానీ అది ఎలా వచ్చిందో అన్న దానిపై కూడా ఆధారపడుతుందండి. అయినా ఇప్పుడు మనం ఆనందంగానే ఉన్నాం కదా! ఒక్కగాని ఒక్క పిల్లాడు మంచి ఉద్యోగంలో ఉన్నాడు. ఇంక మనకి ఆస్తులూ పాస్తులు కొత్తగా వచ్చినా వాటిని కాపలా కాసుకోవడం, దగ్గర వుండి చూసుకోవడం లాంటి బాదరబందీలు అవసరమంటారా?" అంది. ఆత్మీయంగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొని స్పృశించాడు.

"ఇంతకీ ఏమిటి విషయం?" అని అడిగింది.

"ఏం లేదు. ఈ రోజు సంజీవి అనే అతను కలిసాడు" అని జరిగింది చెప్పాడు.

"అవునా? మనకి ఒక ఇల్లు ఉందా?" అని ఆశ్చర్యపడింది.

"అదే ! అమ్మ నాతో ఏనాడూ చెప్పలేదేమిటా అని సందేహం వస్తోంది."

"ఏమై ఉంటుందో మరి! అత్తయ్య గారికి మీ దగ్గర దాపరికాలేముంటాయి? సర్లే పడుకోండి! పొద్దున్న మాట్లాడొచ్చు!"

◆ ◆ ◆

ఆబ్దికం పూర్తైంది.

భోజనాలు చేసి తల్లి విశ్రాంతి తీసుకుంటుండగా, కిరణ్ తల్లి పక్కన చేరాడు. "వరహాల్రావు ఎవరమ్మా?" అనడిగాడు నెమ్మదిగా. శాంత కిరణ్ మొహంలోకి ఆందోళనగా చూసింది.

"ఎవరు?" అని అడిగింది వినబడనట్టు.

"నా దగ్గర ఎందుకు దాచావమ్మ?" అని మంచం చివర కూర్చుని తల్లి పాదాలు నొక్కుతూ ఆప్యాయంగా అడిగాడు.

"ఆ దుర్మార్గుడు కనబడ్డాడా" అని భయం భయంగా అడిగింది.

"ఎందుకు భయపడతావు అమ్మా? నీ కొడుకు పెద్ద లాయర్ అని నీకు తెలుసుకదా? అసలు ఏం జరిగిందో చెప్పు? ఎందుకు దాచావు ఇంత కాలం?" అని అనునయంగా అడిగాడు.

"మీ నాన్న నీకు తెలియనివ్వొద్దని నా దగ్గర మాట తీసుకున్నారు. మీ నాన్న గారు ఈ కాలంలో పుట్టవలసిన మనిషి కారు. ప్రాణం పోయినా ఏనాడూ అబద్ధం అన్నది ఎరగరు. చీమకి కూడా అపకారం చేసి ఎరగరు. చిన్నతనంలో వారాలు చేసుకొని పొట్ట పోసుకొని, కష్టపడి చదువుకున్నారు. టీచర్‌గా స్కూల్లో చేరారు. నా పెళ్లి అయిన చాలా ఏళ్లకు నువ్వు పుట్టావు. అప్పుడు మీ నాన్నని మనకంటూ ఒక గూడు ఏర్పర్చుకుందామని పోరగా పోరగా చివరికి ఒప్పుకున్నారు. నాన్నకి అప్పు చేయడమంటే భయం. సొంత పొదుపు సొమ్ముతో ఇంటికి శంకుస్థాపన చేశారు. సెలవల్లో ఇద్దరం కూలీలతో సమానంగా కష్టపడ్డాం. చిన్నప్పుడు నువ్వు కూడా నీ బుల్లిచేతులతో ఇంటిని తడిపావు. సొంత ఇంటి కలను నెరవేర్చుకునేందుకు నాన్న టీచర్ ఉద్యోగంతో పాటు సాయంకాలం కొట్లో అక్కౌంట్లు రాసేవారు. ఎంతో కష్టపడి నోరు కట్టుకుని, దాచుకున్న కష్టార్జితమనే ఇటుకలు పేర్చి కట్టుకున్న పొదరిల్లు మనది. మొదలు పెట్టిన వేళావిశేషం వల్ల ఎక్కడా ఆగకుండా ఇల్లు పూర్తయింది. ఈలోగా మీ నాన్నకి ట్రాన్సఫర్ వచ్చింది. ఇంట్లో ఒక్క రోజు కూడా గడపలేదే అని బాధ పడుతూ, మన యోగం ఇంతేనేమో అనుకున్నాం.

అప్పుడు రాహువులా వచ్చాడు వరహాలరావు. మనం కట్టుకున్న ఇంటి దగ్గర్లోనే ఉండేవాడు. "గురువు గారూ" అంటూ రోజు వచ్చి సాయం చేస్తున్నట్టు నటిస్తూ, అప్పు ఏమయినా కావాలా? వడ్డీ ఏమి ఇవ్వక్కర్లేదు అంటూ ఇవ్వజూపేడు. మీ నాన్న గారు సున్నితంగా తిరస్కరించారు. అయినా, అతడు ఇంటి పనుల్లో సాయం చేస్తూండే వాడు. అదంతా అతని మంచితనమని అనుకున్నాం. ట్రాన్సఫర్ వచ్చిన తర్వాత, స్కూల్లో తోటి మాస్టారికి ఇల్లు అద్దెకి ఇద్దామనుకున్నారు. ఈలోగా వరహాల రావు వచ్చి... "గురువు గారు ! మీ ఇల్లు నా ఇల్లులా జాగ్రత్తగా చూసుకుంటాను. అద్దెకిస్తే పాడు చేస్తారు. అసలే కష్టపడి కట్టుకున్నారు అని తియ్యని మాటల్తో నమ్మించి మన ఇంట్లో అడుగు పెట్టాడు"

హడావుడిగా రెండు నెలలు అడ్వాన్స్ రెంట్ చేతిలో పెట్టేశాడు. సర్లే మనం ఉండనప్పుడు ఎవరు ఉంటే ఏమిటి? అని

# పురస్కారాలు

## సాహిత్య ప్రస్థానం మే 2021 పురస్కారాలు

**సుమనోహారం**

*కథకు రూ.500*

రచయిత : **యోళ్ల రాజేష్**

**ప్రపంచీకరణపై విమర్శ ఖడ్గం**

*సాహిత్య విమర్శకు రూ.500*

వ్యాసకర్త : **ఎ రవీంద్రబాబు**

■■■

*కవితకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం*

*సాహిత్య విమర్శకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

*- ఎడిటర్*

---

సమాధానపడ్డారు మీ నాన్న.

"అగ్రిమెంట్ రాయించుకోలేదా?"

"అటువంటి తెలివితేటలు ఆయనకి లేవు నాన్నా.. అందరూ తనలాంటి వాళ్ళే అనుకునే మనస్తత్వం.."

"ఆ తర్వాత ఏం జరిగింది?" అని ఆతృతగా అడిగాడు.

"కొంత కాలానికి వరహాలరావు అసలు రూపం బయట పడింది. అద్దె ఇవ్వడం ఆపేశాడు. అడిగి అడిగి, నాన్న ఒక రోజు ఇల్లు ఖాళీ చేయమని చెప్పడానికి వెళ్లారు. అతడు దౌర్జన్యంగా నాన్నని బయటకి గెంటించాడుట. 'మళ్ళీ గుమ్మంలో అడుగు పెట్టావా? నీ అంతు చూస్తా. నీ కుటుంబం దిక్కులేనివాళ్లై పోతారు జాగ్రత్త' అని భయపెట్టాడుట. చుట్టుపక్కలవాళ్ళు "అయ్యో మాస్టారూ.. వాడ్ని ఎలా నమ్మేరు?" అని ఓదార్చుతుంటే ఆయన క్రుంగిపోయారు.

ఈలోగా ఆ దుర్మార్గుడే కోర్టులో కేసు వేశాడు. ఒకరోజు కోర్టుకి వెళ్ళి వచ్చిన మీ నాన్న "శాంతా! అబద్ధాల మీద అబద్ధాలతో అవతలి పక్క లాయరు కేసుని తప్పు దోవ పట్టిస్తున్నాడు. రేపు నేను మళ్ళీ కోర్టుకి వెళ్ళాలి. నేను ఎప్పుడో వరహాలరావుకి, ఎంత కాలమైనా ఇంట్లో ఉండు, ఇల్లు మాత్రం జాగ్రత్తగా చూడు అని రాసిన ఉత్తరాన్ని కోర్టులో ప్రవేశ పెడుతున్నారుట"

"మీరు ఈ వుత్తరాన్ని నేను రాయలేదు అని అబద్ధం ఆడండి, మిగిలినది అంతా నేను చూసుకుంటాను అంటున్నాడు మన లాయర్. నేను అబద్ధ ఆడడం అన్నది నా కంఠంలో ప్రాణం ఉండగా జరగని పని. అది అధర్మం అవుతుంది. వాడు నా ఇంటిలో తిష్ట వేస్తే, వాడ్ని ఖాళీ చెయ్యమని చెప్పడం మానేసి, మనల్ని ఇబ్బంది పెడుతోంది ఈ న్యాయ వ్యవస్థ" అని కుమిలిపోయారు.

ఇల్లు కోర్టు కేసులో ఇరుక్కుపోయిందన్న బాధ కన్నా వరహాల రావు నమ్మించి గొంతు కోశాడని, ఎక్కువ బాధపడ్డారు. "ఛ! మనుషుల్లో నీతి చచ్చిపోయింది. ఈ రోజు గడిచిందా లేదా అన్నదే తప్ప రేపు ఏం జరుగుతుందో అన్న పాపభీతి లేదు ఒక్కడికి! నేను పాటించిన ధర్మమే నన్ను, నా కుటుంబాన్ని కాపాడుతుంది" అంటూ ఆరోజు రాత్రి తెల్లవార్లు పలవరిస్తూ, మర్నాడు ఆ బాధతోనే కోర్టుకి వెళ్ళి అవతలి పక్క లాయర్ అడిగే తికమక ప్రశ్నలకి సమాధానాలు చెప్పలేక, గుండెనొప్పి వచ్చి అక్కడే బోనులో కుప్పకూలిపోయి ప్రాణం వదిలేరు" అని చెప్పి శాంత ఉబికి వచ్చిన కన్నీటిని పమిట చెంగుతో తుడుచుకుంది.

"అవును! నాన్న చిన్నప్పుడు నన్ను దగ్గరకు పిలిచి "నాయనా కిరణ్! నువ్వు పెద్దవాడివి అయ్యి చదువుకుని ఏ వృత్తి చేపట్టినా ధర్మంగా చేయి. అదే నిన్ను కాపాడుతుంది" అని నెత్తిమీద ముద్దు పెట్టుకున్నాడు. ఆ "ధర్మం" అన్న పదానికి అర్థం అప్పుడు తెలియకపోయినా, ఇప్పటికీ నాన్న అన్న మాటలు నా గుండెల్లో పదిలంగా ఉండి పోయాయమ్మా !

"అవును నాన్న... ఆయన ధర్మానికి కట్టుబడే మనిషి. అదే తన వారసత్వపు ఆస్తిగా నీకు ఇచ్చింది." అని గర్వంగా చెప్పింది.

"ఇంత జరిగినా, నేను పెద్దయ్యాక ఒక్క మాట కూడా చెప్పలేదేంటమా?" అని బాధ పడ్డాడు కిరణ్.

"ఏం చెప్పమంటావురా?" ఆ వరహాలరావు మనల్ని ప్రాణాలతో ఉండనీయడని పొట్ట చేత్తో పట్టుకొని ఈ ఊరు వచ్చేశాం. కాలక్రమేణా తన పలుకుబడి, డబ్బు ఉపయోగించి వరహాల రావు ఆ ఇల్లు తన కొడుకు పేరున మార్చేసుకున్నాడని తెలిసింది".

"ఇంకా కోర్టుల చుట్టూ తిరగడానికి నాకా చదువు రాదు, మీ నాన్న మాట్లాడే ధర్మ సూత్రాలే నాకు చదువు, జ్ఞానం. ఆయన సేవే నా జీవిత పరమావధి. అందుకనే ఆయన అన్నట్టు ధర్మమే! ఏనాటికైనా గెలుస్తుందని మనస్సు సమాధాన పరుచుకున్నాను ఇన్నాళ్ళు. అయినా ఇప్పుడు ఆ దుర్మార్గుడిని తలుచుకుంటేనే భయం వేస్తోంది. ఎందుకు నాన్న ఈ గొడవలు?" అంది శాంత.

"భయపడకు! ఇప్పుడు వరహాలరావు చచ్చిన పాము. వరహాలరావు కొడుకు సంజీవి వచ్చాడు. అతను చెప్పిన దానిని బట్టి, వాడు కొన ఊపిరితో ఉన్నాడు. ఇరవై ఏళ్ల నుండి మంచం బట్టి, నానా రోగాలతో నరకం అనుభవిస్తున్నాడట. ఇంటి కాగితాలు అతని కొడుకికి ఇచ్చి మనకి ఇమ్మని, మన పేర తిరిగి రిజిస్ట్రేషన్ చెయ్యమని చెప్పాడుట. వాడు పాపాలు చేసి కూడబెట్టిన సొమ్ములు, ఆస్తులు వాడి వైద్యానికే ఖర్చయిపోయి, ఇంటిల్లిపాది దరిద్రం అనుభవిస్తున్నారుట. పెద్ద కొడుకు ఆక్సిడెంటులో పోయాడుట, సంజీవిని చూస్తే నాకు చాలా జాలి వేసింది. అతని మాటలు విని, ఏమి చెయ్యాలో తెలియక నిన్ను అడిగి చెప్తానన్నాను"

"మీ నాన్నగారిని క్షోభ పెట్టి, ఆయన అకాల మరణానికి కారకుడయ్యాడు వరహాలరావు. కాబట్టే అంత శిక్ష పడింది." అని నిట్టూర్చింది.

"మనం అమలాపురం రేపే వెడదాం అమ్మ! పడుకో!" దుప్పటి కప్పి, సంజీవికి ఫోన్ చేశాడు వస్తున్నామని.

అమలాపురంలో రిజిస్ట్రేషన్ పనులు పూర్తయ్యాయి. తమ ఇంటిలో అడుగు పెట్టిన శాంతని ఇంటి వాకిట్లో చూసిన వరహాలరావు భార్య వచ్చి, ఆమె కాళ్ళ మీద పడింది.

"మిమ్మల్ని ఎంతో అన్యాయం చేశాడు మా ఆయన. దానికి ప్రతిఫలంగా నరకం అనుభవిస్తున్నాడు. చూడండి" అంటూ శాంతని లోపలకి తీసుకెళ్లింది.

హాల్లో మంచానికి అతుక్కు పోయి, అస్తిపంజరంలా ఉన్న వరహాలరావుని చూసింది. అక్కడంతా దారిద్ర్యం తాండవిస్తోంది.

"ఈ మధ్య మటుకు ఆయనకి కలలో మాస్టారు కనిపిస్తున్నారని ఒకటే ఏడుపండి. మతి చలించిందేమోనని అనుకున్నామండి. అన్ని తెలుస్తూనే ఉన్నాయండి. ఊరకనే ఉలిక్కిపడుతున్నారండి. పంతులు గారి ఆస్తి మనకు వద్దయ్యా అని ఎంత చెప్పిన వినలేదు. చివరకి పోయే ముందు బుద్ధొచ్చింది ఏం లాభం?" అని బోరున ఏడ్చింది. శాంత మనసు కరిగిపోయింది.

"అతనికి కలిగిన పశ్చాత్తాపంతోనే ప్రక్షాళన అయిపోయాడు. చేసిన పాపమంతా ఇక్కడే అనుభవించేశాడు. చివరి సమయంలో అతనికి మనఃశాంతి కలుగుతుంది. ఏమి బాధ పడకండి" అని ఊరడించింది.

ఈలోగా డాక్టర్ వచ్చి చూసి, "సంజీవి... ఎవరైనా దగ్గర వాళ్ళు ఉంటే కబురు పెట్టేసుకో! ఇంక కొన్ని గంటలే" అని చెప్పి వెళ్ళి పోయాడు.

అది విన్న వరహాలరావు భార్య, విధవరాలైన పెద్ద కోడలు, చిన్న కోడలు, మిగిలిన కుటుంబ సభ్యులు గొల్లుమన్నారు. అక్కడ పరిస్థితికి చలించి పోయిన శాంత...

"బాబూ సంజీవి... నువ్వు ఈ ఇల్లు ఖాళీ చెయ్యక్కర్లేదు. ఎంతకాలం ఉంటావో అంతా కాలం ఉండు. నువ్వు ఆర్థికంగా నిలదొక్కుకున్నాకా ఆలోచిద్దాం." అని కొన ఊపిరితో వున్న వరహాలరావు శరీరం కేసి చూసింది. సగం తెరిచి వున్న అతని గాజు కన్నులోంచి ఒక కన్నీటి బొట్టు బుగ్గ మీద నుంచి జాలు వారింది. శాంత అతన్ని నిర్వికారంగా చూసి బయటకి వచ్చేసింది.

కిరణ్ తల్లితో పాటు నడుస్తూ "మంచి నిర్ణయం తీసుకున్నావు అమ్మా... " అని భుజాల మీద చేతులు వేసి కారు దగ్గరకు తీసుకెళ్తూ ఒకసారి తన ఇంటి కేసి చూసుకున్నాడు, అవును! ధర్మం గెలిచింది అనుకున్నాడు తృప్తిగా. ■

**" జీవితంలో సమస్యలను,**
**ఆ సమస్యలకు గల కారణాలని**
**తెలియజేసేదే మంచి కథ!"**
**– కారా మాస్టారు**

## సామాన్యుడి మాట

- అవనిశ్రీ
99854 19424



**మ**మ్మల్ని బతకనీయ్యండి
మీకు పుణ్యముంటది
బత్కలేక సావలేక
మధ్యన కొట్టుమిట్టాడుతున్న పేదలం మేము
పరిగకంకుల్ని ఒడికట్టుకొచ్చి
కల్లంల గింజగింజ రాల్చుకొని
ఒక్కపూట బువ్వతిని బత్కినోళ్లం
రాత్రంత మోటగొట్టి
పగలంతా వరిమునంగోసి
కునుకు దీయకుండా
కన్నమ్మ కష్టాలుపడి సాదుకున్న బిడ్డలు
పాడెకట్టెల పరుపులపై ఊరేగుతుంటే
చూడలేకపోతున్నాము
పొద్దున తింటే మాపుకు లేదు
మాపున తింటే పొద్దున లేకుండా
సావలేక బత్కినోళ్లం
గాలికి తిరిగి గాలికి పెరిగినోళ్లం
ఇప్పుడు గాలిలేక సంపకుర్రి

గుడిసె గుంజల మీద తలపెట్టి బత్కినోళ్లం
కడుపాకలికి తట్టుకోలేక
ఉన్న ఎకరం పొలాన్ని
కుంచెడు గింజలకు అమ్ముకున్నోళ్లం
సొరెడు గింజలకు సావును తాకట్టుపెట్టినోళ్లం

దొర ఇంట్ల మూడు దుడ్లకు
మూనూటరవై దినాలు గాసముండి
పగలనకా రేయనకా
పైమీద పొద్దును పొడిపించుకొని బత్కినోళ్లం
మమ్మల్ని మరీ ఇంత అధ్వానంగా సంపకుర్రి..

పల్లెనొదిలి పట్నంబాటపట్టి
పట్టెడన్నం కోసం పరుగులు పెట్టినోళ్లం
ఇండ్ల కిరాయిలు కట్టలేక
కంట్లనీళ్ళు రాల్చుకుంటా
ఫుట్పాత్ మీదనో ఫ్లైవోర్ల పిల్లర్ల కిందనో
దినదినగండమైనోళ్లం...

పసిపిల్లల నుంచి ముసలోళ్లదాకా
రోడ్లవెంట రక్తపుధారులేసుకుంటా
ఆకలికి అలమటించుకుంటా
వందల కిలోమీటర్లు నడిసిపోతుంటే
ఒక్కరికి కూడా గుండె కరగలేదా...

దేశానికి కావాల్సింది
గుడి మసీద్ చర్చీ ఎత్తైన విగ్రహాలు కాదు
బదులు ఆసుపత్రులు విజ్ఞాన కేంద్రాలు కట్టండి
మిమ్మల్ని ఈ జనం
గుండెలపై పచ్చబొట్టు పొడిపించుకుంటరు
ఆకాశంలోకి రాకెట్లు ఎగిరే కాలంలో
రాతియుగపు పనులేంటి
విజ్ఞానానికి మేడలు కట్టే కాలంలో
అజ్ఞానికి పునాదులు తవ్వుతున్నారేంటి?

దేశమంతా శవాల మంటలతో వెలిగిపోతుంది
గంగానదిలో నీళ్లకు బదులు శవాలు పారుతున్నాయి
దేశ జనాభా చితి మంటల్లో కాలిపోతుంది
మా పేదల దేహాలను
కుక్కలు రాబందులు పీక్కతింటున్నాయి
ఇకనైన జెరంత మేల్కొండి

ఏడుపులు పెడబొబ్బల నడుమ
దేశం వల్లకాడౌతున్న వేళ
రాజ భవనాల్లో మీకు నిద్రెట్ల వస్తది
మీరు రాజకీయ నాయకులా
లేక రాబందులకు బంధువులా...
దేశాన్ని మూఢత్వంలోకి పారదోలి
మేధావులను జైళ్లలో నూకేసి
మీరే ఏలండి సార్ ఈ దేశాన్ని
ఆ ఉత్త మాటల సోది
మొసలి కన్నీళ్ల నాటకాలు ఆపి
ఈ దేశానికి ఏమైనా చేయండి..
జనాన్ని బతకనీయండి! ■



# కథలను మనకొదిలి వెళ్లిన కథా దీపధారి

- గంటేడ గౌరునాయుడు

94414 15182




"**మా**ష్టారు మనల్ని వొదిలెళ్ళిపోయార్రా .." అని అప్పల్నాయుడు ఫోన్ చేసి చెప్పినప్పుడు మాకైతే ఆశ్చర్యం కలగలేదు. రోజూనో.. రోజువిడిచి రోజో మాష్టారి గురించి మాట్లాడుకుంటూనే ఉన్నాం మా ఇద్దరం. 97 ఏళ్ల పసివాణ్ణి చాలా బాగా చూసుకున్నారు కోడలు ఇందిర, కొడుకులు సుబ్బారావు, ప్రసాదు. మాష్టారు అదృష్టవంతులు విసుక్కోకుండా పితృసేవ చేసే కొడుకులున్నందుకు. కొడుకులు ధన్యులు, గొప్ప వ్యక్తి పుత్రులుగా జన్మ లభించినందుకు. ఇక మాష్టారు జీవించిన కాలంలో మనమూ జీవించివున్నాం కదా అన్న తలపే గొప్పది కదా.. మరి వారి అభిమానాన్ని పొంది, వారితో కొన్నేళ్ళుగా నిరంతరం సంభాషిస్తూ.. సందేహాలు నివృత్తి చేసుకుంటూ.. వారితో సాహిత్య ప్రయాణాలు సాగిస్తూ.. అప్పుడప్పుడూ వారింట్లో వారితో కలిసి భోజనాలు చేస్తూ పొందిన గొప్ప అనుభూతిని పొందిన నేనెంత గర్వపడాలి! మాష్టారికి అంత చేరువగా వెళ్ళిన అదృష్టం ఎంతమందికి దొరుకుతుంది? మాష్టార్ని చూడాలనిపించి శ్రీకాకుళం వెళ్తే... "మిమ్మల్ని గుర్తు పడతారో లేదో చూడండి" అనేవారు వారి పెద్ద కొడుకు సుబ్బారావు గారు. మాష్టారికి నమస్కారం చెయ్యగానే నాచెయ్యందుకుని గంటేడా.. అని మెరిసే కళ్ళతో పలకరించడం.. ప్రేమగా మాట్లాడ్డం.. మాష్టారికి మాపట్ల గల అభిమానానికి పొంగిపోయేవాళ్ళం. శ్రీకాకుళమంటే మాకు కారా మాష్టారే.. ఇప్పుడు మాష్టారు లేని శ్రీకాకుళం మాకొక శూన్యమే. కథానిలయం ఉండొచ్చు, పక్కనే అప్పల్నాయుడు, దా.రా కూడా ఉండొచ్చు. వాళ్ళకోసం నేను ఇక ముందూ వెళ్ళచ్చు గానీ కారా మాష్టారులేని శ్రీకాకుళాన్ని ఊహించుకోలేకపోతున్నాను.

ఒక్కసారి వెనక్కితిరిగి చూసుకుంటే ...

మొదటిసారి మాష్టార్ని చూసింది విశాఖపట్నంలో. అప్పుడాయన కారా మాష్టారని తెలీదు. అది 1989 జులై అని గుర్తు. పార్వతీపురం ఐటిడిఎ వారు గిరిజన విద్య నేపథ్యంలో నిర్మించిన "నానూ సదువుకుంతాను" పూర్తి నిడివి వీడియో ఫిల్మ్ కేసెట్ ఆవిష్కరణ కోసం అప్పటి గిరిజన సంక్షేమాధికారి వాడ్రేవు చిన వీరభద్రుడు గారు తనతో నన్నాసభకు తీసుకెళ్ళేరు. ఆ సినిమాకి నాచేత ఒక పాట రాయించారు దర్శకుడు బి.హెచ్.రామ్మూర్తి గారు. సినిమా టైటిల్స్‌లో నా పేరు చూసి కారా మష్టారు "ఈ పేరు గల మనిషి కోసమే వెతుకుతున్నాను.. మీకు తెలుసా?" అని పక్కనే ఉన్న భూషణం గారిని అడిగారు. "మీ వెనకే ఉన్నాడు" అని నన్ను చూపించారు వీరభద్రుడు గారు. మాష్టారు నా చెయ్యి పట్టుకుని హాలు గేటు దగ్గరికి లాక్కెళ్ళేరు. తెల్లని పంచె లాల్చీలో మాష్టారు నా కళ్ళకి ఎవరో పెద్ద మాష్టార్లాగే కనిపించారు. అలా గేటు దగ్గరకి లాక్కెళ్ళి వేసిన మొదటి ప్రశ్న: "మీరు మీసాలు తీసేస్తారా.." అని. ఎందుకలా అడుగుతున్నారో.. ఏం చెప్పాలో తెలియక తత్తర పడుతుంటే మరో ప్రశ్న వేసేరు. తొలి కథ ఎవర్రాసేరు? ఎక్కడ? అని. తెల్లమొహం వేసుకుని చూడగడమే నా పనైంది. నాకేమీ తెలియదని గ్రహించేరు.

మాష్టారు కదా.. దిద్దుబాటు కథ, గురజాడ, విజయనగరం.. ప్రత్యేకతను చెప్పి "ఇంత విశిష్టత కలిగిన జిల్లా రచయితగా కథ గురించి ఆలోచించాలి కదా.. ఇతర ప్రాంత రచయితలతో పోటీ పడాలి గదా.." అన్నారు. విషయం బోధపడింది గానీ అడుగుతున్నదెవరో .. అడగొచ్చో.. లేదో భయ సందేహాలు. మాష్టారే "నన్ను కాళీపట్నం రామారావు అంటారు.." అని నవ్వుతూ అన్నారు. అప్పటికీ నాకా పేరుతో పరిచయం లేకపోవడం, వారి కథలతో పరిచయం లేకపోవడం నా అజ్ఞానానికి నిదర్శనం. ఆ సందెవేళ పల్చని వెన్నెల్లో , తెల్లని దుస్తుల్లో మాష్టారి తెల్లని నవ్వు నాకిప్పటికీ గుర్తే. ఆ క్షణాలే నా జీవితాన్ని మలుపు తిప్పినవిగా భావిస్తాను. మాష్టారు భుజం తట్టి, భయం పోగొట్టి "నీ కథ 'విముక్తి' ఆంధ్రజ్యోతిలో చదివాను. బాగుంది. ఇంకేమైనా రాసేవా?" అనడిగారు. కథాంజలిలో రెండు కథలు మాత్రమే వచ్చాయని సిగ్గుపడుతూ చెప్పాను. "బాగా రాస్తున్నావు. రేపొకసారి ఇంటికి రాగలవా?" అని అడ్రస్ చెప్పారు. అలా పరిచయమై మాష్టారి కుటుంబ సభ్యుడినన్నంతలా దగ్గర కాగలగడం నా భాగ్యమే!

మాష్టారు ఎంత గొప్ప కథకులో నేనిప్పుడు కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. తెలుగు కథకొక ఇల్లు కట్టి, దిద్దుబాటు కథనుంచి నేటిదాకా వచ్చిన కథల్ని ఒక దగ్గరికు చేర్చి, తనకు సాహిత్యం ద్వారా, సాహిత్య పురస్కారాల ద్వారా లభించిన సొమ్ముతో 'కథానిలయం' నిర్మాణం గావించి, కథా రచయితలకు, కథాభిమానులకు, పరిశోధకులకు మహోపకారం చేసిన మహానుభావుడాయన. కథ కంచికి.. అన్న నానుడిని 'కథ శ్రీకాకుళానికి' అని అనుకునేలా చేసిన కథాదీపధారి. మాష్టారు రచయితగా ఎంత ఉన్నతులో వ్యక్తిత్వం కూడా అంత గొప్పది. అందుకే రావిశాస్త్రి గారన్నారు : "దేవుడికి అందరూ నమస్కారం చేస్తారు. దేవుడు మాష్టారికి ఎదురైతే దేవుడే మాష్టారికి నమస్కరిస్తాడు" అని. అంత ఉన్నత వ్యక్తిత్వం గలవారు గనకనే కథానిలయం తలపు మాత్రానే రెంతస్థుల భవనమై వేలాది పుస్తకాలతో ప్రపంచాన్ని ఆకర్షిస్తుంది. కథానిలయం ప్రారంభోత్సవ సభలో ముఖ్య అతిథి గూటాల కఅష్ణమూర్తి గారు (అప్పుడు లండన్ నుంచి వచ్చారని గుర్తు) "ప్రపంచంలో నాకు తెలిసి కథకు రిఫరెన్స్ లైబ్రరీ ఎక్కడా లేదు. ఆ ఘనత మాష్టారి వల్ల శ్రీకాకుళానికి దక్కింది" అన్నారు. ఆ కథానిలయం ప్రారంభోత్సవ సభలోనే నా తొలి కథా సంకలనం 'ఏటిపాట' ఆవిష్కరణ జరగడం నాకు లభించిన భాగ్యాల్లో ఒకటి.

నా కథారచనా ప్రయాణానికొక మార్గం చూపిన దీపధారి మాష్టారు. ఆయన నిరంతర పాఠకులు. కథ చదివి ఆ రచయితకు ఫోన్ చేసి, అభినందించి, సూచనలిచ్చి ప్రోత్సహించే గొప్ప మనసు మాష్టారిది. నిన్నమొన్నటిదాకా పత్రికల్లో వచ్చిన కథల్ని చదువుతూనే ఉన్నారాయన.

కథల్ని, కథకుల్ని వెదికి వెదికి పట్టుకుని ప్రోత్సహించడం మాష్టారికే చెల్లింది. ఎందరో మాష్టార్లు జీతాలకు పనిచేసేవారు. ఈ మాష్టారు మాత్రం నిస్వార్థంగా సమాజం కోసం పనిచేసే నిజమైన మాష్టారు. కవిత్వం, నవల, నాటకం మొదలైన ప్రక్రియల కంటే కథను మాత్రమే ఇష్టపడి, కథకోసం కష్టపడి, కథకే జీవితాన్ని అంకితం చేసిన అరుదైన మనీషి. ఒక్క నిద్రలో తప్ప మెలకువలో ఆయన ఆలోచనలన్నీ కథలతోనే.

సాహిత్యాంశాలకే కాదు; సాహిత్యేతర మానవ సంబంధాలకూ అంతే విలువనిస్తారాయన. ఎన్నెన్ని అనుభవాలో మాష్టారితో. నా పుస్తకాలన్నిటినీ (రెండు మూడు తప్ప) మాష్టారే ఆవిష్కరించడం నా అదృష్టం. మరీ ముఖ్యంగా రాచకొండ రచనా పురస్కారం కోసం మాష్టారు నన్ను ఎంపిక చేసి తన చేతులతో ప్రదానం చెయ్యడం మహా భాగ్యం. నాకు ఇద్దరు గురువులు.. ఒకరు బతుకుదారి చూపించిన కీ.శే.సామవేదుల రామగోపాల శాస్త్రి గారు, మరొకరు కాళీపట్నం రామారావు మాష్టారు. (కీ.శే.అని రాయడానికి చేతులు అలవాటు పడాలి) ఇటీవల వచ్చిన నా కొత్త కథాసంకలనం 'గంటేడ గౌరునాయుడు కథలు' మాష్టారికే అంకితం ఇవ్వగలిగాను. మాష్టారి చేతుల్లో (గత సెప్టెంబరు లో) ఆపుస్తకం పెట్టి నమస్కరించినపుడు ఆయన కళ్ళలో ఎంత మెరుపో! గత నెలలో మాష్టార్ని కలిసినపుడు "గంటేడా.. ఆమూలాగ్రం చదివాను నీ పుస్తకం.. కొన్నిచోట్ల అండర్లైన్ చేసాను చూడు" అని ఎంత సంతోషంగా చెప్పారో.. ఒళ్ళు గగుర్పొడిచింది. ఈ తొంబయ్యేడేళ్ళ వయసులో కథలు చదవడం.. చదివానని చెప్పడం.. అబ్బురమే! "మాష్టారూ, వందేళ్ళుంటారు" అనంటే "గంటేడా శతాయుష్మాన్ భవ అని ఆశీర్వదించీగల్ను.. అప్పుడు తెలుస్తాది" అనేవారు నవ్వుతూ.. వార్ధక్యభారం మోయడం ఎంత కష్టమో అనిపించేదాయన మాటల్లో. మాష్టారిక లేకపోవచ్చు గాని మాష్టారి బోధనలున్నాయి, రాతలున్నాయి. ఆయనెప్పుడూ చెప్పే ఒక మాటతో ముగించడం సమంజసమనిపిస్తుంది. "సమాజం నుంచి మనమెంతో తీసుకున్నాం. అందుకు ప్రతి సమాజానికి మనమేమైనా ఇవ్వాలి. సమాజ రుణం తీర్చాలి. తల్లి రుణం, తండ్రి రుణం, గురురుణం లాగే.. అందుకు మనం చేయగలిగిందేదైతే అది. మనం చేయగలిగింది సాహిత్యం. అదే నిబద్ధతతో.. ఇద్దాం.

■



# ఆయన కథలు నేటివి, రేపటివి కూడా!

**లాంగుల్య**

**మా**స్టారి కొన్ని కథల గురించి ఈ సందర్భంలో రేఖామాత్రపు స్పర్శగా ఇక్కడ గుర్తు చేసుకుందాం. మాస్టారి యజ్ఞంతో తొమ్మిది కథా సంకలనానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. అనేక పురస్కారాలు మాస్టారికందడం ద్వారా వాటికి గౌరవం పెరిగిందని అనుకుంటాను. ప్రముఖ కథకుడు.. మాస్టారికి ఇష్టుడు అట్టాడ అప్పల్నాయుడు అంటాడు.. : "కారా వ్యక్తిగా అప్పల్రాముడు, రచయితగా సీతారాముడు" అని.. అప్పల్రాముడు కీర్తికోసం, మంచివాడ్నని అనిపించుకోవాలనే పేరు కోసం కొడుకుల చేత అప్పుపత్రం మీద వేలిముద్రలు వేయిస్తాడు.. యజ్ఞం కథలో. చూడండి సీతారాముడి మాటల్లో.. "నీకు జనం మెప్పుకావాల, అప్పల్రాముడు సేనా మంచోడు, ఆడి తప్పనోడన్న మాట కావాల, నీ బిడ్డపాపలాలెగన్నా పోనీ. నీకున్న దంబం అంతా ఏటట? దరమం తప్పడు" అని. అప్పల్రాముడు కీర్తికాముడని బోధపడుతుంది. మాస్టారు కీర్తకాముడు కారు.. మంచివాడిననిపించుకోడానికి ఎప్పుడూ తాపత్రయపడరు. నమ్మిన లక్ష్యం ప్రధానం తప్ప పేరు, కీర్తి అతనికి ప్రధానం కాదని మాస్టారికి దగ్గరగా ఉన్న అందరికీ ఎరుకే. మరి మాస్టారు వ్యక్తిగా అప్పల్రాముడని ఎలా అనుకోగలను. వ్యక్తగానూ రచయితగానూ సీతారాముడే.. కుండబద్దలు కొట్టినట్టు తన అభిప్రాయాలను వ్యక్తం చేయడానికే యజ్ఞం కథ రాశారని నేననుకుంటాను. తీవ్రమైన భావాన్ని సౌమ్యంగానే చెప్పడం మాస్టారి జీవ లక్షణం.

కారా రచనలు చదువుతున్నప్పుడు నాకు మా నాగావళి నది గుర్తుకొస్తుంది. నది విశాలంగా విస్తరించి ప్రవహిస్తుంది కదా.. అక్కడక్కడా తెల్లగా మెరుస్తూ కనిపించే చోట్ల చూస్తే నీరు ప్రవహిస్తున్నట్టుండదు.. నిలిచిపోయినట్టుంటుంది. అటువంటి వాటిని 'తెమ్మ' అంటారు. నీరు ప్రవహిస్తున్నట్టు కనిపించే చోట ఉన్న లోతుకంటే తెమ్మలో లోతు ఎక్కువ. అదుగో.. అలాంటి తెమ్మలాటి కథలు మాస్టారి కథలు. చాలా జాగ్రత్తగా లోతును గ్రహించాల్సినవి. యజ్ఞం కథ పైపైన చదివేవాళ్ళకి ఒక తగువు గురించి. కానీ లోతుగా విశ్లేషించేకొద్దీ పేద ధనిక వర్గాల మధ్య ఘర్షణ, అభివృద్ధి మాటున విధ్వంసం ఆర్థిక నమూనాలు.. పరిణామం .. ఇలా ఎన్నో అంశాలు చర్చకు వస్తాయి. బహుశా ఒక కథ మీద ఇంత చర్చ జరగడం ప్రపంచ కథాసాహిత్యంలోనే లేదేమో. ఇప్పటికీ చర్చించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్న వర్తమాన అంశంగా ఉంటుందీ కథ.

మాస్టారి తొలి కథల మీద మాస్టారే తన అభిప్రాయం చెబుతూ "నాకు ఇష్టమైన కథలు వేరు, నాకు చాతనైన కథలు వేరు. నాకు ఇష్టమైన కథలు ఎలా రాయాలో నాకు నాడు తెలియదు. నాకు చాతనైన కథలు రాసి ప్రయోజనం లేదని తేలిపోయింది." అన్నారు. కొన్నేళ్ళ అధ్యయనానంతరం "యజ్ఞం రాసేక నామీద నాకు నమ్మకం కుదిరింది" అన్నారు. పరిశీలనా శక్తి తోపాటు ప్రాపంచిక దృక్పథం లేనివారు గొప్ప కథలు రాయలేరు అంటారు. మాస్టారికి నిశ్చితమైన ప్రాపంచిక దృక్పథం ఏర్పడ్డాక రాసిన ఆర్తి, చావు, హింస, నో రూమ్, భయం, జీవధార, యజ్ఞం, శాంతి, వీరుడు మహావీరుడు, కుట్ర వంటి కథలు ఒక గొప్ప ఆలోచనాపరుని మేథోమథనం నుంచి ఆవిర్భవించిన గొప్ప కథలు. తెలుగు కథాసాహిత్యంలో మేలిమి ముత్యాలు.

ఆర్తి, చావు కథల్లో చూస్తే మనకు స్పష్టంగా కనిపించేవి మాల

పేటల్లోని కష్టజీవుల నికృష్ట జీవన వ్యధలు. వారి దుర్భర జీవితాలు. పేదరికం మనుషుల మధ్య గల బంధాలను ఎంతగా విచ్ఛిన్నం చేస్తుందో.. ఎంత వికృతంగా మారుస్తుందో చూపిస్తుం దీ కథ. ఎర్రెమ్మ , బంగారి కుటుంబాల మధ్య ఘర్షణకి మూలం పేదరికమే. సన్నెమ్మ కాపరం కన్నా ఆమె కూలి డబ్బులే ముఖ్యమై పోతాయి.. కన్నోరింటికీ, అత్తోరింటికీ మధ్య అగాధం ఏర్పాటవ్వ డానికి కేవలం దారిద్ర్యమే కారణం. శ్రమ సొమ్ముగా.. వస్తువుగా రూపొందే క్రమంలో జరిగే వికృతరూపానికి దర్పణం ఆర్తి కథ.

కుటుంబంలో పేదరికం తన ముద్ర ఎంత దుర్మార్గం వేస్తుందో అత్యంత సహజంగా కళ్ళకు కట్టిన కథ 'చావు' కుటుంబ సభ్యులంతా చిన్న పిల్లల్ని, ముసలమ్మను వొదిలి చేనికోతలకు వెళ్తారు దళితులు. అలా వెళ్తేగాని వారికి దినం దీరదు. ముసలమ్మ కన్ను మూస్తుంది. అప్పుడు పిల్లల స్థితిని, తిరిగి వచ్చే కుటుంబ సభ్యుల డోలాయమాన దయనీయ పరిస్థితిని వర్ణించిన విధం అద్భుతం. ఎంతో పరిశీలనా శక్తి ఉంటేగాని సాధ్యం కానిది. ముసలమ్మ చావు వార్త విన్న నారమ్మ అనుకోవడంలోని వాస్తవికత చూస్తే అబ్బురమే. చూడండి "గోయిందా.. నా సేతెండి కడియాలు గోయిందా" అని అనుకోవడానికి కారణం శవాన్ని తగలెయ్యడానికి కడియాలమ్ముకోవల్సిన దుస్థితి. శవాన్ని కాల్చడానికి కర్రలుండాల, అందుకు డబ్బులుండాల, శ్రమ చేయించుకున్నోళ్ళేగాని సాయం చేసేవాళ్ళు కారు ఊరోళ్ళు. రాత్రికి రాత్రే శవాన్ని దహనం చెయ్యకపోతే మరుచటిరోజు ఒప్పుకున్న కూలిపనికి వెళ్ళలేరు. అందుకోసం కుర్రోళ్ళు కర్రల్ని చాటుగా తీసుకొస్తారు. ఈ కథ చదువుతుంటే గుండె కరిగి నీరై కళ్ళలోకి వస్తుంది.

'కీర్తికాముడు' కథ సొంత సేద్యం ఉన్న వెంకయ్య నాయుడు అనే రైతు ఎలా చితికిపోయాడో చిత్రిస్తుంది. కథ పేరును బట్టి నాయుడి కీర్తికాముకత్వం కారణంగా కనిపిస్తుంది గానీ లోతుగా అధ్యయనం చేస్తే చాలా అంశాలు చర్చకు వస్తాయి. అసలు కీర్తి, యశము అనే మాటలు సృష్టించింది ఎవరు? 'దానం' ఎవరికి ఏమి దక్కుతుంది? ఇలా ఆలోచిస్తే నాయుడు కీర్తికాముడు కావడానికి కారణం మన పురాణ సాహిత్యం.. అందులో చెప్పిన ధర్మాలు అని తేలుతుంది. రంతిదేవుడూ, హరిశ్చంద్రుడూ వంటి కథలు ఎవరి ప్రయోజనాల కోసం? బ్రాహ్మణులకు భూరిదానాలు, గోదాన, భూదాన, హిరణ్యదానాలు చేస్తే కీర్తి పేరుతో నష్టపోయేదెవరు? లాభపడేదెవరు? చాలా సూక్ష్మాంశాలను చర్చకు పెడతారు.

సంక్రాంతి సంబరాల్లో రౌడీల పోట్లాట నేపథ్యంలో ప్రపంచాధి

## నల్లదారి



ఏపుగా పెరిగిన చేను
రక్షణగా ఇద్దరు కాపలాదార్లు
దూరంగా మేత మేస్తున్న కొన్ని గేదెలు
అదను చూసి ఒక గేదె
చేలో చొరబడింది
మేయడం మొదలెట్టింది
చూసి ఊరుకున్నారు కావలి దార్లు..
గేదెనుంచి పాలను పిండుకున్నారు
రోజుల తరబడి ఇదే తంతు
చూస్తున్న గేదెల్లో ఇప్పుడు భయం లేదు..!
కొండంత భరోసా!
అదిగో చేలోకి
మరో గేదె.. దానివెంట మరొకటి
ఇప్పుడన్ని గేదెలూ చేలోనే..
నిర్భయంగా మేసేస్తూ
యజమానిని గుల్లచేస్తూ ....

**- "వసుధ"**

**94908 32787**

పత్యం కోసం ఆనాటి అగ్రరాజ్యాల కుతంత్రాలు, చిన్న దేశాల బానిస ప్రవర్తనను ప్రతీకాత్మకంగా చెప్పిన కథ వీరుడు–మహావీరుడు కథ. యజ్ఞం, చావు, ఆర్తి .. ఇవేనా? మాష్టారి ప్రతి కథా పాఠకుల్ని కలవరపరుస్తాయి. కన్నీరు పెట్టిస్తాయి. కన్నీరు పెట్టించడంతో పాటు ఆలోచింపజేస్తాయి.

మాష్టారు తొలి కథల్లో రాసిన మధ్య తరగతి శిష్ట వ్యావహారికాన్ని వొదిలి దళిత పేదల్ని గురించీ వారి భాషలో రాయడం మరో మలుపు. గ్రామీణ అట్టడుగు వర్గాల జీవితాల్ని వారి భాషలో రాసి ఉత్తరాంధ్ర మాండలికానికి గౌరవం తెచ్చిపెట్టిన తొలి కథకులు మాష్టారే అనుకుంటాను. కారా కథలు ఒకసారి చదివి వొదిలేద్దామంటే కుదరదు. "పురాతన చరిత్ర కోసం భూమిపొరలను తవ్వే ఆర్కియాలజిష్టులా పొరా పొరా విడదీసి చూపేదాకా చరిత్ర సమాచారం ఆవిష్కారం కానట్టు మాష్టారి కథల్ని పొరాపొరా జాగ్రత్తగా విప్పుకోనిదే బోధపడదు" అన్న వేల్చేరు నారాయణరావు గారి మాటలు అక్షర సత్యం. మాష్టారి ప్రతి కథనూ లోతుగా అధ్యయనం చేయాల్సిందే. అవి నిన్నటివే కావు, నేటివి రేపటివి కూడా! ■

## రాజద్రోహి

- డాక్టర్ మాటూరి శ్రీనివాస్
98490 00037



**రా**యాల్సిన రాతలన్నీ కోతలైతే
చిత్తశుద్ధి లోపించి మెహర్బానీ కూతలైతే
రాజు, రాజరికం అక్కర్లేదు
అధికారం, దాని కున్న ఎడతెగని దాహం చాలదూ?
రాజ్యాన్ని నియంతృత్వంలోకి నెట్టేందుకు..

ఫోర్త్ ఎస్టేటు మొత్తం ఫోర్జరీల మయమై
భజన బత్తాయిగా మారిపోతే
కనిపించని నాల్గో సింహం కాళ్లు విరిగి
కాసులకు క్లాసులకో పరిమితమైతే
నువ్వు కార్టూనిస్టువో, కవివో
కమెడియన్‌వో కానక్కర్లేదు,
కార్మిక కర్షకుడివైతే చాలు
అన్నీ తామై తైతక్కలాడతారు మెకాలే వారసులు
వైద్యం లేని అత్యున్నత స్థాయి
పెంపుడు పిల్లితో కరిపిస్తారు

తెల్లారే పగటి చుక్కలు చూపిస్తారు
సిరలను ధరలతో పొడిచేస్తారు
కిమ్మనకుండ గమ్మునున్నావా?
నీకు ముళ్ల పరుపు మీద రాజయోగం
దమ్ము గిమ్మని వాగావా?
నీకు గీతల చొక్క వేసి రాజద్రోహం
చాయిస్ ఈజ్ యువర్స్
ఉంటావో పాకిస్తాన్ పోతావో..?
కరుణాళువైన భారత్ మాతా కీ జై! ■

## సంకల్పం

**వె**ళ్లే రహదారిలో
ముళ్ల ఇనుప గుండు
తుళ్ళి పడ్డాను
ఓ క్షణం తూలిపడ్డాను
మళ్లేందుకు వేరే దారి లేదు
ముందుకు వెళ్లాల్సిందే!
తల్లడిల్లుట మాని
ఉల్లాసంగా అడుగేశాను
ముళ్ల గుండు కాదది..
పల్లేరు కాయ
పాదం మోపగనే పటేల్మని పగిలి
పాతాళానికి జారింది!
నడక సాగింది
ఎల్లలెరుగని సంకల్పం ముందు
కరోనాలూ.. అవరోధాలూ
కేవలం పూచిక పుల్లలు!

- డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ,
94408 36931

## పులకించని రాగం


- లోసారి సుధాకర్
99499 46991

చుట్టూ ఎవరూ లేరు ఒక్కడైననూ
అంతటా శూన్యం తప్ప
దూరం నుంచి బండరాళ్ళ మీదుగా
పొడిగా వీచిన గాలితప్ప
గాలికి గాయపడ్డ పూలరేకులు తప్ప
దొరకని కళేబరాలకై వెతుకుతున్న
నక్కల ఒక్క ఏడుపు తప్ప
ఘోర నిశ్శబ్దాన్ని మధ్యమధ్యన
బద్దలు కొడుతున్న
తీతువుల దాహపు అరుపులు తప్ప
ఇది రాత్రి
దట్టంగా పరుచుకున్న కాకిరెక్కల
చీకటి కురిపిస్తుంది
పూయని వసంతానికి పులకించిన రాగంలా
తనువువంతా తడిసిపోయింది
దు:ఖంతో చెమటతో కన్నీళ్ళతో
ఎవరూ తుడవరు ఎవరూ తోడుగా ఏడ్వరు
వేల నక్షత్రాలున్న ఆకాశం కూడా
పాపం ఉదయానికి ఒంటరవుతుంది నాలా
మళ్ళీ పాత కథే చెబుతుంది ఎడారి
మళ్ళీ మళ్ళీ అదే కథ చెబుతుంది
ఆకాశం మరీ దైన్యంగా..
ఎన్ని ఒంటరి ఏకాంతాలు
ఎన్ని నిట్టూర్పుల దారులు నడిచి
ఎక్కడికి పోతాయి ఈ సాయంత్రాలు
సీతాకోక చిలుకల రెక్కల మీదుగా
గుంపులు గుంపులుగా చెదిరి
మసకమసక మబ్బుల్లోకి..
ఆత్మహత్యకు సిద్ధమైనట్టుగా
ఈ రాత్రి ఈ వేసవి కాలపు మధ్య రాత్రి



ఆకాశం నక్షత్రాల్ని దాటి
నాతో సంభాషించింది కన్నీటి పర్యంతమై
నల్లమబ్బుగా మారి ...

■



## మోస్ట్‌వాంటెడ్

కరోనా నుంచి
ఇప్పుడు మనల్ని కాపాడేది
దైవం కాదు; ధైర్యం!

- "వసుధ"
94908 32787



# నిబద్ధత, నిర్దుష్టత కెకెఆర్ మార్గం

తెలకపల్లి రవి

కెకెఆర్ అనబడే కోవెల కందాళై రంగనాథాచార్యుల పేరు సంప్రదాయాన్ని స్ఫురింపచేస్తుంది గాని దాంతో ఆయన తీరుకు పొంతన కుదరదు. ఎందుకంటే ఆయన అక్షరాలా ఆధునిక దృక్పథానికి ప్రతిరూపమనదగిన మేధావి. నిబద్ధత, నిరాడంబరత్వం, నిమ్మళమైన నిక్కచ్చితనం... వీటన్నిటినీ మించిన నిర్దుష్టత , నిపుణత ఆయన స్వంతం. విమర్శకుడు అనడం కంటే ఆయనను సవిమర్శనుడు అనడం మెరుగు. విమర్శనగా దర్శించడం , సూటిగా సున్నితంగా విశ్లేషించడం, కొద్ది మాటలతో వివరించడం ఆయన పద్ధతి. పటాటోపం కన్నా పదార్థానికి ప్రాధాన్యతనిచ్చే తత్వం. ఉద్వేగ ఉద్ఘాటనలు, ఉపదేశోపన్యాసాల కన్నా ఉపమానాలు ఉమ్మడి భావనల తరహాలో బోధించడం ఆయన స్వభావం. శక్తివంతులైన చాలామంది శిష్యులు రాజకీయ ప్రచార రంగాల్లో వున్నా కీర్తి కాంక్షకు దూరంగా మసలిన పండితుడు. తను చెప్పవలసిన అవసరం వుందనుకున్నది చెప్పవలసినంతవరకే చెబుతూ అందుకోసం అవసరానికి రెండింతలు అధ్యయనం చేస్తూ అర్థవంతమైన సార్థక జీవితం గడిపిన సాహిత్య జీవి. భాషావేత్త. సామాజిక భావుకుడు. పరిశోధకుడు. అందుకే తెలుగు నాట విద్వత్ లోకంలో ఆయనది ఒక విలక్షణ బాణి. విభిన్నశ్రేణి.

హైదరాబాదులో ఆంధ్ర (ఇప్పుడు తెలంగాణ) సారస్వత పరిషత్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కెకెఆర్ ఎందరో ప్రతిభా వంతులను ప్రభావితం చేయడమే కాదు. చర్చాపద్ధతిలో ఆధునిక తెలుగు సాహిత్య గమనాన్ని గమనించేందుకు వేదికలు సృష్టించారు. దశాబ్ద కాలం పాటు క్రమబద్ధంగా సాహిత్య గోష్ఠులు జరిపారంటే ఎంత క్రమశిక్షణ, మరెంత దీక్ష కావాలి! ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకూ, అరసం విరసం దశలు దాటిన తర్వాతి పరిస్థితిని సమగ్రంగా సమిష్టిగా చర్చకు పెట్టి సంపుటీకరించారు. ఆ దశలన్నిటికీ నామకరణం చేయడమే గాక జనరంజక సాహిత్యం అనే విభాగం కూడా చర్చకు పెట్టడంలో ఆయన వాస్తవికత కనిపిస్తుంది. అలాగే ధోరణి అన్నదాన్ని నిర్వచించి విభిన్న ధోరణులు అనే చర్చ కూడా చేశారు. ఆధునికతకే పరిమితం కాకుండా వీరికి పితామహుల వంటివారైన వేమన, వీరబ్రహ్మం ఇత్యాదులకు తొలి సమాజ కవులు అని పేరు పెట్టి వారి వారసత్వాన్ని వీరసత్వాన్ని కూడా గుర్తింపచేశారు.

### వ్యక్తిగత నేపథ్యం, ఉద్యమాలతో సంబంధం

కెకెఆర్ తెలుగు భాషా సాహిత్యాల అధ్యయనానికి చేసిన దోహదాన్ని అర్థం చేసుకోవాలంటే ఆయన నేపథ్యాన్ని, కాలాన్ని కూడా గుర్తు చేసుకోవాలి. హైదరాబాద్ సీతారాంబాగ్ ఆలయ ప్రాంతంలో తొలినాటి దిగంబర, విరసం కవులు జ్వాలాముఖి నిఖిలేశ్వర్ వంటివారు అతి సన్నిహిత స్నేహితులుగా బయిలుదేరిన కెకెఆర్ విరసం తొలి ప్రకటనపైన కూడా

సంతకం చేసి ఖమ్మం సభలకు కూడా హాజరయ్యారు. తర్వాత కాలంలోనూ తన ప్రగతిశీల భావజాలం మారకపోయినా విరసంలో లేరు. దిగంబర కవిత్వం తర్వాత విరసం ప్రాబల్యం లో పాత సాహిత్యం పాతకాలపు ప్రతిదీ తిరస్కరణకు గురైన దశ. నన్నయ్యను బొందెలోనే నిద్రపోనివ్వ వంటి నిఖిలేశ్వర్ వాక్యాలు దానికి ఉదాహరణలు. 1975లో వచ్చిన అత్యవసర పరిస్థితి ప్రజాఉద్యమాలపై ఉక్కుపాదం మోపింది. అనుభూతి వాదం వంటివి మొదలైనాయి. సాహిత్యరంగంలోనూ చర్చలోనూ కొంత ఖాళీ ఏర్పడింది. అలాటి సమయంలో కెకెఆర్ చొరవ కొత్త గవాక్షాలు తెరిచింది. సాహిత్యంలో విభిన్న ధోరణులు అంటూ వరుసగా మాట్లాడించి పుస్తకరూపంలో ప్రచురించి అర్థవంతమైన ముందు మాట రాసి ఆయన భిన్న కోణాలను ఆవిష్కరింపచేశారు.

### ప్రగాఢత, కాలీనత

ప్రాచీన సాహిత్యం నుంచి సామ్యవాద వాస్తవికత వరకూ అధ్యయనం చేసిన వ్యక్తిగా వివిధ ధోరణుల మధ్య తేడాను మాత్రమే గాక కొనసాగింపును కూడా అర్థమయ్యేట్టు చేశారు. ఇప్పుడు ఆ ఉపోద్ఘాతాలు చదివినా మనకు వాటి ప్రగాఢత, కాలీనత ఆశ్చర్యం కలిగిస్తాయి. ఆయన రాసిన వ్యాసాలే గాక ముందుమాటల్లో కూడా ప్రతిదీ ఒక సూత్రీకరణలా గోచరిస్తుంటే అంతగా ఒడిసిపట్టి రాస్తారన్న మాట. గీతలు గీసుకోవడం మొదలెడితే అలా కొనసాగించాల్సిందే.

మౌలికంగా భాషావేత్త భద్రిరాజు కృష్ణమూర్తి శిష్యుడైన కెకెఆర్ భాషాపరిశోధనలోనే డాక్టరేట్ పుచ్చుకున్నారు. అయితే సాహిత్యం భాషా రెంటినీ అధ్యయనం చేస్తేనే సమగ్రమైన అవగాహనకు రాగలమని ఆయన గుర్తించారు. ఉదాహరణకు భాష సాహిత్యం కవిత్వంలో అలంకారాలు అంటూ రాసిన వ్యాసాన్ని సాహిత్యం భాషా కళ గనక ఆధునిక సాహిత్య సిద్ధాంతాలకు భాష కేంద్రంగా వుండటంలో ఆశ్చర్యం లేదని ప్రారంభించారు. దీనికి ఒక పోలిక చెబుతూ విజ్ఞానశాస్త్రం ఏదైనా గణిత శాస్త్రం లేకుండా మనలేనట్టే సాహిత్య విమర్శ భాషా శాస్త్రం సహాయం లేకుండా నిలవలేదంటారు. సాహిత్య నిర్మాణంలోని మౌలికాంశాలకు భారతీయ లక్షణ శాస్త్రంలో నమూనాలు వున్నాయని స్పష్టం చేస్తారు. అయితే విస్తృతి వైవిధ్యం సంక్లిష్టత, దాన్నుంచి వచ్చే నూతన భావనలు, భావజాలం ఆధునిక సమాజం లక్షణాలనీ ఆధునిక సాహిత్యం కూడా వీటికి ప్రాతినిధ్యం వహిస్తుందని విశదపరుస్తారు. రూపం నిర్మాణం బట్టి సాహిత్యాన్ని ముఖ్యంగా కవిత్వాన్ని అధ్యయనం చేయడంలో అలంకార సిద్ధాంతాలను ఆధునిక దృక్పథాలను ఎలా అర్థం చేసుకోవచ్చునో అరిస్టాటిల్, ఆనందవర్ధనుడు మొదలు త్రిపురనేని మధుసూదనరావు వరకూ తీసుకుంటూ సోదాహరణంగా చెబుతారు. ఇంతా విస్తారమైన పరిధి, పట్టు చాలా కొద్ది మందిలోనే చూస్తాం. సాహిత్యం రాజకీయాలకు అతీతంగా మనలేదా అని ప్రశ్న వేసి భారతం నుంచి ఈనాటి వరకూ ఏనాడూ సాహిత్యం రాజకీయాలకు దూరంగా లేదని, మార్కెట్ యుగంలో తమకు సమస్య వస్తే రాజకీయాలు వద్దనడం పెద్ద రాజకీయమని చెబుతారు.

### తెలుగు భాష పరిణామం


నూరు సంవత్సరాల తెలుగు దశ దిశ, తెలుగు ఆధునికత ప్రాచీనత అనే వ్యాసాలు భాషావేత్తగానూ సామాజిక చారిత్రిక అధ్యయనశీలిగానూ గొప్ప అవగాహననిస్తాయి. తెలంగాణ ఉద్యమం, కేంద్రం తెలుగును ప్రాచీన భాషగా గుర్తించాలనే ఆందోళన వచ్చినపుడు పైకి ఏది చెప్పకుండానే అన్ని అంశాలనూ స్పృశిస్తూ ఆయన ఈ వ్యాసాలు రాశారు. తెలుగు ప్రామాణిక రూపం తీసుకోవడానికి ఒక కారణం ఆధునిక కాలం అంటూ ప్రారంభమయ్యే నాటికి తెలుగువారికి తమదంటూ ఒక నగరం లేకపోవడం అని గురజాడను కూడా ఉటంకిస్తూ చెబుతారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం సంగతి అటుంచి హైదరాబాదులో కూడా పాలనా భాషలుగా పర్షియన్, ఉర్దూ చలామణి అయ్యాయి. 1910 తర్వాతనే సాధారణ వ్యవహార రూపానికి దగ్గరగా వుండే ఆధునిక తెలుగుభాషా శైలి రూపుదిద్దుకోవడం మొదలైందని నిర్ధారించారు. 1925–30 నాటికి ఆధునిక తెలుగు వచన శైలి వ్యాపించిందని వివరించారు. మనుష్యేతర వాచకాలలో ము ప్రత్యయం పోయి మ్(ం) మాత్రమే మిగిలింది. నేనున్నూ అనే బదులు నేనూ అని రాయడం వచ్చింది. మార్పుల తర్వాత కూడా 1960ల వరకూ సరళ గ్రాంధికం కొనసాగింది. మొత్తంపైన ఇందుకోసం వందల ఏళ్లకాలం వాదనలు, ఉద్యమాలూ అవసరమైనాయి. చాలా సున్నితమైన ఈ చర్చలో ఎలాటి ప్రాంతీయ లేదా పాక్షిక భావనలు లేకుండా శాస్త్రీయంగానూ ఆమోదకరంగానూ చెప్పడం కెకెఆర్ ప్రత్యేకత. భాషా శాస్త్ర దృష్టిలో ఒక భాషా వ్యవహారం ఎక్కువదని గాని, మరొకటి తక్కువదని కానీ వుండదని

అటువంటి భావాలు ఎక్కడైనా ఎవరికైనా ఏర్పడితే అవి సామాజికమైనవి, వ్యక్తిగతమైనవి తప్ప భాషాగతమైనవి కాదని స్పష్టం చేస్తారాయన. సామాజిక భాషా శాస్త్ర పరిశోధనలను విద్యావంతులకు విస్తారంగా అందుబాటులోకి తెస్తే పొరబాటు అభిప్రాయాలు కొంతైనా తొలగిపోతాయని సూచిస్తారు. మానవ సమాజ వికాస క్రమంలో నిర్వహించే పాత్రను బట్టి భాషల ప్రాధాన్యత ఏర్పడుతుందంటారు. ఆధునిక జీవితంలోని క్లిష్టతను, వేగాన్ని ప్రతిబింబించే తెలుగు రచనలు వచ్చి వాటిని ఇతర ప్రపంచ భాషల్లోకి అనువదించడం జరిగితేనే ఆధునికత సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టం చేస్తారు. వాస్తవానికి ఈ రచయిత సంపాదకత్వంలో వచ్చిన ప్రస్థానం ప్రత్యేక సంచికలో తెలుగు జాతి సంస్కృతి ఎలా చారిత్రికంగా రూపొందాయో అత్యంత ప్రామాణికంగా సుదీర్ఘంగా రాశారాయన. ఆ సంచికలో తన వ్యాసమే పొసగనిదిగా అనిపిస్తుందని తర్వాత చమత్కరించారు.

**మహామహుల నుంచి యువత దాకా ...**

గురజాడ, శ్రీశ్రీల నుంచి ఇటీవలి రచయితల దాకా చాలామందిని సందర్భోచితంగా సమీక్షించిన విశ్లేషించిన కెకెఆర్ విలువైన పాఠాలు తీశారు. కొత్తవారి పుస్తకాలకు రాసిన ముందుమాటల్లో సూత్రీకరణలతో పాటే ఆయా రచయితల ప్రత్యేకత ఏమిటో చెబుతారు. కాలీనత అంటే కాలానుగుణమైన పరిణామక్రమం.. అది రచనలో ప్రతిబింబించే తీరు.. ఇదీ కెకెఆర్ ప్రధానంగా గమనించే అంశం. స్థలకాలాలలోనే రచనలు సాధ్యం గనక సామయిక, స్థల సాహిత్యం నిశితంగా పరిశీలించారు. శ్రీశ్రీని గురించి చాలా రాసినా గురజాడలో ఆధునికత ఎక్కువన్నది ఆయన మాట. శ్రీశ్రీ కవిత్వాన్ని గొప్పగా చెబుతూనే ఆయన సామాజిక భావుకత పరిమితులు కూడా గమనంలో పెట్టుకోవాలంటారు. అయితే శ్రీశ్రీ కవిత్రయంగా చెప్పిన ముగ్గురు తిక్కన, వేమన, గురజాడల గొప్పతనం ఏమిటో ప్రత్యేకంగా రాశారు. త్రిపురనేని, కెవిఆర్ వంటి విమర్శకుల నుంచి బాలగోపాల్, అశోక్‌కుమార్ వంటి వారి వరకూ కూడా ఆయన పరిశీలనలోకి వచ్చారు. మౌఖిక విమర్శనా శైలి అని దానికి పేరు పెట్టారు. సమాజ కవులు అని తాను నామకరణం చేసిన భక్తికవులపై పిల్లలమర్రి రాములు రాసిన పుస్తకానికి ముందుమాట రాస్తూ దాన్ని సమాంతర సాహిత్యం అని అభివర్ణించారు. క్రైస్తవ సంకీర్తనలు అన్న పుస్తకానికి ముందుమాట రాస్తూ భారతీయ సంప్రదాయ





భక్తి సాహిత్యంలో దేవుడి గురించిన వర్ణనలకు వాటికి తేడా ఏమిటో చెప్పారు. ఇన్ని గంభీరమైన విషయాలు చర్చిస్తూనే కలం పేర్లు, మారుపేర్లు అన్న రచనలో మనుషుల అసలు పేర్లకు చలామణిలోకి వచ్చే పేర్లకు పొట్టి అక్షరాలకూ తేడాలు పోలికలు ఎన్ని రకాలో బోలెడు ఉదాహరణలతో చెప్పారు.

అపారమైన అధ్యయనం, సమగ్రత, స్పష్టత వున్నా వినమ్రంగా ఆచితూచి జీవించిన కెకె రంగనాథాచార్యుల కృషి గురించి ఎంతైనా చెప్పవచ్చు గాని పరిమితంగా రాయడం, మితంగా మాట్లాడ్డం ఆయన లక్షణాలు. తెలుగు సాహిత్యం చారిత్రిక భూమిక, ఆధునిక కవిత్వం భిన్న ధోరణులు, తెలుగు సాహిత్యం మరో రూపు, తెలుగులో తొలి సమాజ కవులు, తెలుగు కథానిక, బహుముఖం వంటి గ్రంధాలు ఆయన రచనలు సంపాదక సంకలనాలు అత్యంత విలువైనవి. బహుశా ఎమెస్కో ప్రచురించిన *బహుముఖం* ఆయన ఆఖరి పుస్తకం కావచ్చు. సారస్వత కళాశాల ప్రిన్సిపాల్‌గా తర్వాత కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పరిశోధన మార్గదర్శిగా ఎందరినో తీర్చిదిద్దారు. ప్రగతిశీల ఉద్యమాలతో కలసి నడిచారు. తను సేకరించి పెట్టుకున్న అమూల్య గ్రంథాలను సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి విరాళంగా ఇచ్చి సుసంపన్నం చేశారు. స్వయంగా వర్ణాంతర వివాహం చేసుకుని సంస్కరణ స్ఫూర్తి చాటారు. సాహితీ స్రవంతి నిర్వహించిన ఎన్నో కార్యక్రమాలు సదస్సుల్లో కీలక ప్రసంగాలు చేసి ప్రోత్సహించారు. వ్యక్తిగతం గానూ నన్ను అభిమానించేవారు. ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో హరి పురుషోత్తమరావు, తన తర్వాత సారస్వత కళాశాల ప్రిన్సిపాళు గా పనిచేసిన నరహరి, డి.చంద్రశేఖరరెడ్డి ఆయనకు సన్నిహితులు గనక చాలాసార్లు చర్చోపచర్చలు సాగుతుండేవి. ఈ కరోనా కాలంలో అనుకోని విధంగా ఆయన మరణవార్త దిగ్భ్రాంతికరం. ఆయన రచనలు, బోధనలే మిగిలిన స్ఫూర్తి. ■

నచ్చిన పుస్తకం






# మనోధైర్యాన్నిచ్చే కవిత్వం

- అమూల్యచందు


90598 24800

**ఈ** వాక్యం ఈ కవికి చక్కగా సరిపోతుంది. ఐదు పుస్తకాల వయస్సు ఈ కవిది. 2001 నుంచి ఇప్పటివరకు తనని తానూ నరుక్కుంటూ, పేర్చుకుంటూ, అక్షరాలను పేనుకుంటూ కవిత్వాన్నీ శ్వాసిస్తూ తనకంటూ ఒక ప్రత్యేక పేజీని రూపొందించుకున్న కవి శ్రీనివాస్ గౌడ్. ఆరవ పుస్తకం ధైర్యవచనంతో కవిత్వ ప్రేమికుల ముందుకు వచ్చేసారు. నిజం చెప్పాలంటే ఏడాది నుంచి కరోనా కోరల మధ్య జనం బెంబేలెత్తిపోతున్నారు. భయంతో ముడుచుకుపోతున్న మనసులలోకి ధైర్యాన్ని నూరిపోయడం ఈ పుస్తకం యొక్క ఉద్దేశం. ఈ పుస్తకంలో పిల్లల మీద, అమ్మల మీద, వలస కూలీల మీద అన్ని అంశాల మీద అందంగా ఒదిగిన కవితలే కాదు, జపనీయులు రాసిన కవితలను తెలుగులోకి అనువాదం చేసి అలరించారు. ధైర్యవచనం మనల్ని మరో లోకంలోకి తీసుకెళ్లిపోతుంది. కవి ఎంత విశాలమైన ప్రపంచాన్ని చూశాడో ఆ కవితలే చెప్తాయి. మన చుట్టూ జరుగుతున్న జీవితాల పని తీరును, ప్రపంచం వేస్తున్న పిల్లి మొగ్గలను చాలా సూటిగా చెప్పారు. కవి ఎప్పుడూ, ఎక్కడ నిలబడతాడు అంటే ప్రపంచం చివర్న నడుస్తూ, పరిగెడుతూ, అప్పుడప్పుడు నవ్వుతూ, కొన్ని కన్నీళ్లను కారుస్తూ, ఎంతో మందితో అంతర్గతంగా యుద్ధం చేస్తాడు. అరుస్తాడు, ఆవేదనతో అల్లకల్లోలమౌతాడు, మకిలి పడతాడు, మలినమౌతాడు.. చివరికి అక్షరమై వెలుగుతాడు. తీసుకున్న వస్తుశిల్పాలతో అనుకున్న దాన్ని కొన్ని చోట్ల ఘాటుగా, గట్టిగా, కొన్ని చోట్ల సున్నితంగా వ్యక్తీకరించారు కవి. హిందీ టైటిల్స్‌తో కొన్ని చోట్ల అలాగే జపాన్ దేశానికి చెందిన ప్రాచీన కవితలను తెలుగులోకి అనువాదం చేసి అందరినీ ఒక ట్రాన్స్‌లోకి తీసుకెళ్లి వ్వాహ్ అనిపించేలా చేస్తారు. మనిషి మారాలంటే ఒక్క క్షణం చాలు. ఆ క్షణం లోపలుంటే మనిషి ఎలా ఉంటాడు. ఆ ఒక్క క్షణం దాటితే మూడ్ ఎలా చేంజ్ అవుతుంది అనేది ఒక్క క్షణం కవితలో మనిషి నిజ స్వరూపాన్ని చూపించారు. 'ఆ క్షణం దాటిందంటే/ ముమ్మాటికీ నేను నేను కాదు/ ప్రేమగానో/ ద్వేషంగానో/ ఆ క్షణంలో అలాగే ఉంటాను '' అంటారు కవి. మాటల మీద మాటు వేయండి అనే కవితను తీసుకుంటే 'మౌనంగా మాట్లాడే పనిముట్లను సృజించిన పనోడు ఇప్పుడు మాట్లాడాలి/ మట్టిలోంచి అన్నం ముద్దల్ని సృష్టించే మట్టి మనిషి ఇప్పుడు మందికి ముందుండాలి' ఈ వాక్యాలు చదివితే నిజమే కదా అనిపిస్తుంది. సృష్టించేవాడు వెనకబడుతున్నాడు. ఆర్భాటపు మాటలు చెప్పేవాళ్ళు ముందుకు దూసుకెళుతూ వీళ్ళ మీద పెత్తనం చేస్తూ దోచుకుతింటున్నారనే నేపథ్యంలో ఈ కవితను చాలా ఘాటుగా, సూటిగా రాసారు కవి. మరో కవిత 'గేటు దగ్గర' కవితను పరిశీలిస్తే 'ఒక్కోసారి గేటు పడుతుండాలి / జీవితం కళ్లబడింది / ఒక్కోసారి గేటు తీసుండాలి / జీవితం తుళ్ళి పడుతుంది' అంటారు కవి., ఇక్కడ గేటు అనే పదాన్ని మనసుకు ప్రతీకగా వాడారనిపిస్తుంది. అనవసమైన చోట మనసును అదుపులో ఉంచుకోవాలి. అలాగే ఏ రిలేషన్ ఐనా పట్టూ విడుపు వుండాలని చెప్పకనే చెప్తారు కవి. 'బదలా' అనే హిందీ టైటిల్‌తో రాసిన కవిత చదివిన ప్రతి ఒక్కరికీ రోమాలు నిక్కబడుచుకుంటాయి. మతం పేరుతో జరుగుతున్న అనర్థంపై ప్రతీకారం తీర్చుకోవాలి అంటారు. 'గుండె రాయి చేసుకుని/ గునపం చేతిలోకి తీసుకుని నేనూ

బదలా తీర్చుకోవాల్సి ఉంటుంది' అనే వాక్యాలతో ఆ కవితను ముగిస్తారు.

పిల్లలంటే ఎవరికి ఇష్టముండదు చెప్పండి. ఒక స్కూలు నేపథ్యాన్ని తీసుకుని పిల్లల చేత పాఠాల్ని బట్టీ పట్టిస్తున్న దృశ్యాన్ని కవిత్వం చేశారు. 'ఆమె పిచ్చి గాని / ఎక్కడైనా తూనీగలు / వరసలో ఒదిగి ఉంటాయా ..?/ ఎక్కడైనా పిట్టలు ముక్తకంఠంతో ఒకే పాట పాడతాయా ..?' అని చాలా సింపుల్‌గా, సూటిగా, ఆలోచింపజేసేలా చిన్న వాక్యాల్లో ఎక్కువ అర్థాన్ని చెప్పారు. పాఠకుడికి ఏది ఎక్కువ గుర్తుంటుంది. జ్వలించే కవిత్వాన్ని ముందు వరసలో గుర్తుపెట్టుకుంటాడు. అలాంటి కవిత్వం చీకట్లోంచి మెలకువలోకి తెస్తుంది. తర్వాత పాఠకుడికి అణువణువునా ఆ కవిత్వం రగులుతూనే ఉంటుంది. కొన్ని కవితల రుచి చేదుగా ఉంటుంది. ఎందుకంటే జీవితంలో ఎదురైన అనుభవాలు, సంఘటనలు, మనసును కదిలించే దృశ్యాలే చేదు కవితలకు నేపథ్యాలౌతాయి. ప్రతీ ఒక్కరి జీవితంలో ఏదో ఒక చోట ఇలాంటి ఒక చెదును రుచి చూడక తప్పదు. కవి కూడా అలాంటి సందర్భంలోంచి 'చేదు సమయాలు' పేరుతో చిక్కని వాక్యాలు రాసి అందరినీ ఒప్పించి తీరుతారు 'ఇద్దరం / దొరికిన ఏకాంతాన్ని / తప్పుకు తిరుగుతున్నాం / అడ్డుగా పెరిగి అహం గీతలు / ఇప్పుడు ఇద్దరం కలిసి / ఒకే కలను కనలేం / తెల్లారితే తలో దారి' .. అహం మనుషుల మధ్య ఎన్ని కంచెలు వేస్తుందో ఈ కవితలో చెప్తారు. నాన్న మీద ప్రతి కవి స్పందిస్తాడు. అమ్మానాన్నల మీదే కొన్ని అక్షరాలూ రాసి కవిగా తొలి అడుగు వేస్తాడు. 'మనసు మాగాణి మీద/ అమ్మను, నన్నూ నాటుకుని / ప్రాణాల్ని రెండు చేతులు చేసి/ అడ్డు పెట్టి సాగుతాడు/ ఎం చేస్తాడు నాన్న' అంటూ ఎంతో ఆర్ద్రంగా మనసు ద్రవించేలా రాశారు.

ఇక టైటిల్ కవిత 'ధైర్యవచనం' చూస్తే అదొక రూపంలో ఉండదు/ ఒక చోట ఉండదు / చూడడానికి అతను / మనలాంటి మనిషే గాని / మనలా గడ్డ కట్టుకుపోయిన మనిషి కాదు / లోపల జల ఎండిపోయిన మనిషి కాదు' అంటూ గుండెకు తాకేలా తాను అనుకున్నది రాశారు కవి. ఈ కవితను ఆపదలో ఆపన్నులను ఆదుకునే తన మిత్రుడు రమణారెడ్డి, ఇంకా అతని లాంటి వాళ్ళ కోసం కవి ఈ కవితను రాసి అంకితం చేశారు. ధైర్యం ఎటు నుంచైనా రావొచ్చు. మనిషి రూపంలో, పుస్తకం రూపంలో, ఇంక ఏదైనా రూపంలో.. నిజమే కదా. ఇంకో విషయం చెప్పాల్సి వస్తే జపాన్ కవితలను తెలుగులోకి అనువదించిన కవితల్లో 'మానుకోనా / లేదంటే గుర్తుంచుకోనా / ఈ లోకాన్ని కాదని / మన చివరి కలయికని'



# తెగిన గాలి పటం

– స్వప్న మేకల
**90522 21870**

**ఏ** తల్లి గర్భంలో నవమాసాలు తల దాచుకుందో
బాహ్య ప్రపంచంలోకి అడుగు పెట్టగానే
పేగుబంధం తెగిన గాలిపటమైంది..!
ఎక్కడ విసిరేయబడ్డదో
చెత్త కుప్పల్లో.. మురికి వాడల్లో
గుక్కెడు పాలకు వెక్కి వెక్కి ఏడ్చిన గుండె
కన్న తల్లి స్పర్శకి తల్లడిల్లుతోంది..!

ఎదగ లేని పక్షికి పంచభూతాలే వెలుగు నీడలయ్యాయి
కారుమబ్బులే కన్నీటి నేస్తాలుగా చెంత చేరాయి
కలతపడ్డ మనసంతా అలల సాగరమై
జీవితమంతా సుడిగాలి బతుకైంది
నిలుచున్న చోటు కూడా చీదరింపుల
చూపులతో నిప్పురవ్వలై జ్వలిస్తున్నాయి!

అవనంతా వెతికినా రక్త సంబంధపు ఆనవాళ్లు
ఎక్కడో తప్పిపోయాక జీవితం శూన్యమైంది
ఎంత శోధించినా తీరని వేదనే హత్తుకుంది
చివరికి అనాధనే ముద్ర బతుకు మీద
పచ్చబొట్టుగా జీవితాంతం వెక్కిరించింది..! ■

అని ఇజుమీ షికాబు అనే జాపనీస్ కవయిత్రి రాసిన కవితను తెలుగులో అనువదించి తెలుగు పాఠకులను అలరించడం నిజంగా గొప్ప విషయం. ఈ పుస్తకంలోని కవితలు నిజంగా ఎండిపోయిన చెట్టు మళ్ళీ చిగురించినట్టు, భయం తప్ప ఇంకేం లేని ఈ పరిస్థితిలో ధైర్యాన్ని ఇచ్చేలా ఉంటాయి. వాస్తవాలను కవిత్వం చేయాలంటే, దాన్ని పాఠకులు నిక్కచ్చిగా మెచ్చుకుని ఒప్పుకోవాలంటే దానికి కవి ఎంతో ఆచితూచి తెగువ చూపించాలి. కవిత్వం చదివిన వారిలో మనోధైర్యాన్ని నింపాలి. ఎందుకంటే కవి ఎప్పుడూ కలం సైనికుడు మరి. అలాంటి తెగువ, ధైర్యం వున్న కవి శ్రీనివాస్ గౌడ్ అని చెప్పొచ్చు. ■



# దీపం

- పెమ్మరాజు విజయ రామచంద్ర
9849744161

"పూర్ణిమా! బాగా తలనొప్పిగా ఉంది. వేడిగా కాస్త కాఫీ తీసుకురా..." పిలుస్తూ లోపలికొచ్చి కుర్చీలో కూర్చున్నాడు ఆనంద్.

"కాఫీకి పాలు లేవు. పాప ఆకలి అని గుక్కపెట్టి ఏడిస్తే గ్లాసెడు పాలుంటే ఇప్పుడే పట్టేశాను." మొహం చిన్నబుచ్చుకుంటూ నీళ్ళబిందెలో ముంచిన గ్లాస్ తీసుకుని భర్తకు అందించింది.

"అంటే పాపకి నువ్వు పాలు..." అని అడగబోయాడు. కాని బాలింతకు ఇవ్వవలిసిన పౌష్టికాహారం గురించి తెలుసున్న సైన్స్ టీచర్ మాట బయటకు పెగలక అక్కడే ఆగిపోయాడు. ఆనంద్ బిఎస్సీ బిఎడ్ చేశాడు. వయసు మీరిపోవడంతో ప్రభుత్వోద్యోగం రాలేదు. గత్యంతరం లేక ప్రైవేట్ స్కూల్లో టీచరుగా చేరాడు.

"అవును... పక్కింటి పార్వతి ఆంటీ వాళ్ళ మనమరాలిని అడ్మిషన్ గురించి అడిగావా?"

"అడిగానండి. వాళ్ళ అల్లుడికి ట్రాన్సఫర్ అవుతుందిట. అందుకని ఇంకా నిర్ణయం తీసుకోలేదుట."

"అంటే ఈ అవకాశం కూడా చేజారిపోయిందన్న మాట. సర్లే, నేను అలా బైటకు వెళ్లస్తాను."

"పాపకి డైపర్స్ కావాలి. అదే చేత్తో పాలడబ్బా కూడా తీసుకు రండి."

"అలాగే..." అని చెప్పి బైటకు వచ్చాడు ఆనంద్.

పూర్ణిమ చెప్పిన పాలడబ్బా, డైపర్స్ తీసుకువెళ్లాలంటే ఎక్కడైనా చేబదులు తీసుకోవాలి. ఇప్పటికే కోలీగ్ భార్గవికి వేయి రూపాయలు ఇవ్వాలి. క్రితం వారంలో పాపకు ఒంట్లో బాగోకపోతే తీసుకున్నాడు. డాక్టర్ ఆసుపత్రి గుర్తుకు రాగానే ఆయన తన అన్న గారి అమ్మాయిని స్కూల్లో చేర్పిస్తానన్నారనే విషయం గుర్తుకొచ్చింది. రెండురోజుల్లో చెపుతానన్నాడు. ఇప్పటికే మూడురోజులు అయ్యింది. అడగాలని హాస్పిటల్ వైపు ఆశతో నడిచాడు ఆనంద్. ఒక్క అడ్మిషన్ కన్ఫర్మ్ అయితే ఒక నెలజీతం ధైర్యంగా అడగొచ్చు. రెండు నెలల నుంచి ఒక్క అడ్మిషన్ తీసుకెళ్ళలేదు. అందుకే యాజమాన్యం జీతం ఇవ్వలేదు.

ఉద్యోగంలో చేరినప్పుడే ఈ షరతులు పెట్టారు. వేనీళ్లకు చన్నీళ్ళు తోడుగా ఉంటాయి కదాని ట్యూషన్స్ చెప్పుకుందా మంటే, కూడదన్నారు. సంవత్సరానికి 12 మందిని చేర్చాలి. అంటే నెలకి ఒక్కరు.. దేశ ఆర్థిక బడ్జెట్ లాగా ఆనంద్ బడ్జెట్ ఎప్పుడూ లోటే. రెండు నెలల నుంచి బడ్జెట్ పూర్తికావటం లేదు. అందుకే జీతం రావటం లేదు. బడ్జెట్ సాధించిన వాళ్లని హెడ్మాస్టర్ గొప్పవాడని పొగుడుతారు. పాఠం చెప్పలేని సుభాష్ మాత్రం పిల్లల్ని చేర్పించి, ప్రతి నెల ఉత్తమ ఉపాధ్యాయుడు అనిపించుకుంటాడు. గొంతు చించుకుని పాఠం చెప్పి, జీతం కోసం గోడ కుర్చీ వెయ్యడం ఆనంద్ లాంటి టీచర్లకి అలవాటు. ఆలోచిస్తూ అసంకల్పితంగా హాస్పిటల్ వైపు అడుగులు వేశాడు. ఆనంద్ వచ్చిన విషయం కాంపౌండర్ రవి డాక్టర్ గారికి చెప్పాడు.

"అన్నయ్య కూతుర్ని స్కూల్లో చేరుస్తామని అనవసరంగా చెప్పాను. ఫెవికాల్లా అతుక్కున్నాడు." డాక్టర్ మనసులో మాట బైటకు వచ్చేసింది. విసుగ్గా మొహం పెట్టి, "ఇద్దరు, ముగ్గురు పేషెంట్ల తర్వాత లోపలికి పంపు" అయిష్టంగా అన్నాడు.

ఆనంద్ ఆసుపత్రిలో రోగుల్ని చూస్తూ ఒకటే మాట అనుకున్నాడు. డబ్బులు లేకపోయినా పర్వాలేదు కానీ జబ్బులు మాత్రం రాకూడదు. సునాయసంగా చనిపోవాలనే వైరాగ్యం ఆవరించింది. ఒకాయన దగ్గలేక దగ్గలేక దగ్గుతున్నాడు. మరొకడికి ఆయాసం. ఒకడు తిండి ఎక్కువై బాధ పడుతున్నాడు. మరొకడు తినడానికి లేకపోయినా అప్పుచేసైనా రోగానికే డబ్బు ఖర్చు చేస్తున్నాడు.

ఆలోచనల పరిభ్రమణం మధ్య రవి వచ్చి, డాక్టర్ గారు లోపలికి రమ్మంటున్నారని చెప్పాడు. ఆనంద్ లోపలికెళ్ళాడు.

సరాసరి విషయంలోకి వస్తూ, "సారీ మాస్టర్! అన్నయ్య పాపని ఇంటర్నేషనల్ స్కూల్లో చేరుస్తారట." అని ఇక వెళ్లిపొమ్మన్నట్లు తల పంకించాడు.

"నో ప్రాబ్లం సార్! మీ హాస్పిటల్స్ లాగానే మా స్కూల్స్ మధ్య కూడా బాగా పోటీ పెరిగింది." అనేసి, బయటికి వచ్చాడు. మనసులో నీరసం ఆవరించింది.

హాస్పిటల్ నుంచి బైటకైతే వచ్చాడు కాని ఎక్కడికి వెళ్లాలో సందిగ్ధం. అప్పుడే పూర్ణిమ చెప్పిన డైపర్స్, పాలడబ్బా గుర్తుకొచ్చాయి. ఆపద్బాంధవుడు మోహన్ దగ్గరకు వెళ్ళక తప్పదు. అతను ఎన్నోసార్లు క్లిష్ట సమయాల్లో సహాయం చేశాడు. పూర్ణిమ తొమ్మిది నెలలు సజావుగా సాగి సుఖప్రదంగా డెలివరీ అయ్యిందంటే వాడే కారణం అని చెప్పకతప్పదు. చాలా సహాయం చేశాడు. అందుకే తనని ఏదైనా అడగాలంటే ఇబ్బందనిపిస్తుంది. కాని తప్పదు. 'మోహన్ మెడికల్ షాప్‌కి డైపర్స్, పాలడబ్బా కోసం వెళ్ళాలి.' మనసులో అనుకుని అటు వైపు అడుగులు వేశాడు.

'తోవలో నాగరాజు కిరాణాకొట్టుకెళితే ఆయన మనవడి స్కూల్ అడ్మిషన్ సంగతి కూడా తెలుస్తుంది. అక్కడకు వెళ్లాలంటే ఒకటే ఇబ్బంది. పాత బాకీ అడుగుతాడు, ఏదో ఒకటి చెపుదాం లే' అనుకుని నాగరాజు కిరాణా షాప్‌కి వెళ్లి మొహమాట పడుతూనే అడిగాడు ఆనంద్.

"మాస్టర్! మావాడ్ని హైదరాబాద్లో మంచి హాస్టలున్న స్కూల్లో జాయిన్ చేద్దామని వుందండి. అది కుదరకపోక మన ఊళ్ళో చేర్పిస్తే, మీ కాన్వెంట్లోనే చేరుస్తా." చెప్పాడు నాగరాజు కొడుకు.

"పోనీ! చిన్న తరగతులైనా....." కొంచెం బతిమాలుతున్నట్లు అడిగాడు.

"ఎందుకండి డబ్బు ఖర్చు. అపాటి చదువు ఇంట్లో వాళ్లు చెపితే సరిపోతుందిలెండి" అని మాట వినకుండానే అక్కడనుంచి వేరే పనిలోకి వెళ్లిపోయాడు.

"మాస్టర్, మీ పేరా కొద్దిగా పద్దు ఉంది. ఇప్పుడు జమ కడతారా?" అడిగాడు నాగరాజు.

"వచ్చే నెల మొదటి వారం జమకడతాలెండి" అని చెప్పి నిరాశ ఆవరించిన శరీరంతో వెనక్కి తిరిగాడు.

మధ్యాహ్నం నల్లటి తారు రోడ్డు మీద నడుస్తోంటే సముద్రతీరం మీద మండుటెండలో నగ్నపాదాలతో ఇసుక మీద నడుస్తున్నట్లు ఉంది ఆనంద్‌కి. మోహన్ షాపు వైపు వెళ్లలేదు. ఎదురుగా కనబడ్డ పిల్లల పార్క్‌లోకి కదిలాయి. ఏ బరువూ, బాధ్యత తెలియని పిల్లలు ఆడుకుంటోంటే చూడ్డానికి బాగుంది. ఒక క్షణం పిల్లల్లా మారిపోతే బాగుంటుదనే ఆలోచనకు ఆనంద్ మొహంలో నవ్వు చిగురించింది. ఇంతలో జారుడుబల్ల దగ్గర కలకలం! చిరిగిన గౌను వేసుకుని చూడ్డానికి పేదపిల్లలా ఉంది. ఆ పిల్ల వెక్కివెక్కి ఏడుస్తోంది.

ఆ పిల్లని దగ్గరకు తీసుకుని, "ఎందుకు ఏడుస్తున్నావు? ఎవరు కొట్టారు?" అడిగాడు ఆనంద్.

"ఆ ఆంటీ జారుడుబల్ల ఆడనివ్వటం లేదండీ. వాళ్ళ పాప ఆడుతుంటే ఇంకెవరు జారుడు బల్ల దగ్గరకి రాకూడదని తిడుతుంది." ఏడుస్తూ కళ్ళు నులుముకుంటోంది.

"ఆ జారుడుబల్లలో ఏముంది పైనుంచి కిందకు జారడం తప్పు! ఎప్పుడు మనం పైకి ఎక్కాలి. జారిపోకూడదు" అని ఆ అమ్మాయిని ఊరడించబోయాడు.

"అంకుల్! జారుడు బల్ల మెట్లు ఎక్కితేనే కదా. కిందకి జారేది." అంత ఏడుపులోనూ సమాధానం చెప్పింది. ఆమె సమాధానానికి ఆశ్చర్యపోయాడు ఆనంద్. 'నిజమే కదా! మెట్లు ఎక్కితేనేకదా జారిపోయేది' అనుకున్నాడు. అయినా మెట్లెక్కని అతనికేం తెలుస్తుంది, జారిపోవడం గురించి. జీవితమంతా జారిపోవడం మీద భయంతోనే గడుస్తోంది. ఒక క్షణం అతన్ని నిరాశ కమ్మేసింది.

ఇంతలో జారుడుబల్ల దగ్గర ఖాళీ అయ్యింది. వెంటనే ఆ పాప లేడిపిల్లలా గెంతుకుంటూ జారుడుబల్ల దగ్గరకు పరుగెట్టింది.

మళ్ళీ గేట్ దగ్గర గందరగోళం. జారుడుబల్ల ఆంటీయే ఒక దివ్యాంగుడిని ఆంగ్లంలో నోటికొచ్చినట్లు తిట్టుకుంటూ వెళ్లిపోతోంది. దివ్యాంగుడు పంటి బిగువున బాధని అణుచుకున్నాడు. అతని రెండు కళ్ళు వర్షించే మేఘల్లా ఉన్నాయి.

అక్కడకెళ్లిన ఆనంద్, "ఏమైంది సార్! ఎందుకు ఆమె అలా మాట్లాడుతోంది?" అడిగాడు

"సార్! నేను కరపత్రాలు పంచుతున్నాను. ఇష్టం ఉంటే తీసుకోవాలి. లేకపోతే తీసుకోకూడదు. అంతేగాని నన్ను ముష్టివాడని, కుంటివాడని అవమానించకూడదు కదా" పసిపిల్లాడిలా ఫిర్యాదు చేశాడు.

"ఇంతకీ ఆ కరపత్రంలో ఏముంది?" ఆనంద్ అడిగాడు.

"నా పేరు రాఘవ. నేను గత ఆరు సంవత్సరాలుగా సమ్మర్ క్యాంప్ నడుపుతున్నాను. నా దగ్గర ట్రైనింగ్ అయిన పిల్లలు చాలా చోట్ల విజేతలుగా నిలిచారు. పాటల్లోనూ, డాన్స్‌లోనూ, నేషనల్ ఛానెల్స్ క్విజ్ ప్రోగ్రాంలోనూ విజయం సాధించారు. మంచి ట్రాక్ రికార్డు ఉంది. వికలాంగుడ్ని అనుకోవడం నాకు ఇష్టం ఉండదు. ఎవరైనా గుర్తుచేస్తే కష్టంగా ఉంటుంది." జేబులో చేతిరుమాలు తీసి మొహం తుడుచుకుంటూ చెప్పాడు.

"బ్రదర్, మీ లాంటివాళ్ళు అలాంటి వాళ్ళ మాటలు పట్టించుకోకూడదు. ఏనుగు వెళుతోంటే కుక్కలు మొరుగుతాయి. ఇంతకి ఏం చదువుకున్నారు?"

"నేను ఎమ్మెస్సీ మాథ్స్‌లో యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్. నాకు సంగీతం వచ్చు. నా లెక్కలు, సంగీతం నన్ను సమ్మర్ కాంప్ పెట్టేందుకు కారణం అయ్యాయి.."

అతనితో కరచలనం చెయ్యగానే ఏదో తెలియని శక్తి ఆనంద్‌ని ఆవహించింది. "సార్! మిమ్మల్ని కలిస్తే ఎందుకో తొలి పరిచయమే అయినా ఎన్నో ఏళ్ల అనుబంధంలా ఉంది."

"నాక్కూడా అలాగే అనిపిస్తోంది. మిమ్మల్ని చూస్తే అన్నింటికీ రాజీపడే నాలో కూడా అగ్ని రాజుకుంటోంది. నామీద నాకే నమ్మకం వస్తోంది. మొదటి కలయికలోనే ఇలా అడుగుతున్నానని ఏమి అనుకోకపోతే నాదో చిన్న ప్రతిపాదన." మొహమాటం పక్కనపెట్టి అడిగాడు ఆనంద్.

"ఏమిటో నిర్మొహమాటంగా చెప్పండి." అని స్నేహపూర్వకంగా అడిగాడు రాఘవ.

"నా పేరు ఆనంద్. నేను బిఎస్సీ బిఇడి చదివి ప్రభుత్వోద్యోగం దొరక్క ఒక ప్రైవేటు కాన్వెంట్లో టీచర్‌గా పని చేస్తున్నాను. నాకు మీ సమ్మర్ క్యాంప్ టీమ్‌లో భాగస్వామిని కావాలనిపిస్తోంది. మీకు అభ్యంతరం లేకపోతే ఆలోచించండి. నా శక్తి ఎంతవరకు మీకు పనికొస్తుందో చూడండి. మీకు సరిపోతానని భావిస్తే కలిసి ప్రయాణం చేద్దాం." మనసులో మాట చెప్పాడు ఆనంద్.

"తప్పకుండా. మీ అనుభవం నాకు తప్పక ఉపయోగపడు తుందనిపిస్తోంది. మీకు నా మన: పూర్వక స్వాగతం." రాఘవ మాటలు ఆనంద్‌ని ఉత్తేజపరిచాయి.

"చాలా థాంక్స్ బ్రదర్. కష్టసుఖాలు కలిసి పంచుకుందాం. నాకు పెద్దగా ఆశలు లేవు. లాభాలు లక్షల్లో అక్కర్లేదు. నా కుటుంబం ఆకలితో వుండకుండా వుంటే చాలు. షరతుల ఉద్యోగం చేయలేకపోతున్నా. మనం కష్టపడదాం." ఆనంద్ మాటల్లో ఆత్మవిశ్వాసం కనబడింది. అదే రాఘవకు మనోధైర్యం ఇచ్చింది.

"అవును బ్రదర్! కృషి చేస్తే విజయం అందుకోవచ్చు. మీ మాటలు నాకు కొండంత బలాన్ని ఇస్తున్నాయి. మనం పాఠం చెప్పడం మీద శ్రద్ధ పెట్టి చెపితే పిల్లలు వాళ్లంతట వాళ్ళే వస్తారు.



## జీవితం బహువచనం

**పా**దాలు ఒంటరివైనా
పయనం ఒంటిది కాదు
నువ్వు ఏక వచనమైనా
నీ నవ్వు బృందగానమే కదా!
ఏకాకి నడకలోనూ
నీదైన పరుగులోనూ
నీడలా లోకం తోడుంటుంది
వైఫల్యమైనా, సాఫల్యమైనా
అది సామూహికమే, మిత్రమా
మానవ జీవితమంటేనే
శిథిలం కాని సామాజిక గేయం
వేయి బాహువుల ఏకైక దేహం!

**- డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ,**
**94408 36931**

మన అంకితభావమే మనకు ప్రచారం. అదే మన లక్ష్యం." ఆనంద్ అభిప్రాయానికి బలం చేకూర్చాడు రాఘవ.

"నాకు ఓకే! నాకు రూపాయల మీద ఆశ లేదు. నా ఆకలి తీరాలి. నలుగురి ఆకలి తీర్చాలి. నేను దాచుకున్న కొద్దిపాటి డబ్బే మన పెట్టుబడి. ఇంటిదగ్గరే మన బడి. రేపట్నుంచి ఆ పనిమీదే ఉందాం." అని చేతికర్ర చప్పుడు చేసుకుంటూ రాఘవ కదులుతుంటే తిమిరాన్ని తరిమేసిన దీపం ఇంకా వేనవేల దీపాలు వెలిగించడానికి వెళుతున్నట్లుంది.

ఇప్పటిదాకా ఆనంద్ నడిచిన నల్లని తారురోడ్డు మీద ఈ క్షణం జోళ్ళు లేని కాళ్లతో నడుస్తోంటే పూల తివాచీ పరిచినట్లు సుతిమెత్తగా ఉంది. ఆనంద్‌కి ఆ నడక కొత్తగా ఉంది. ■




# నేనెవరిని?

- చిలుకూరి దీవెన
94411 18102

నేనెవరిని...?
చెట్టునా ఆడదాన్నా
చెట్టులో ఉన్న ఆడతనాన్నా
ఆడదానిలో ఉన్న చెట్టుతనాన్నా
అవున్నిజమే
నేను చెట్టులో ఉన్న ఆడతనాన్నే
మొక్కగా ఉన్నప్పుడు కాస్త చదువు అనే ఎండ
ప్రోత్సాహం అనే నీరు దొరికితే చాలు
మహావృక్షమే అవుతాను
నీరు పోసిన వారికీ నీడనవుతాను
వందల జీవాలకు తిండి పెట్టే అమ్మనవుతాను
ఆశ్రయమిచ్చి అండగా ఉంటాను
అవకాశాల మబ్బులు హద్దులు
దాటిపోకుండా కట్టడి చేస్తాను.
అభివృద్ధి పంటలు పండేలా చేస్తాను
కలిసిరాని కాలంలో మోడునైనా
క్రుంగిపోకుండా సంకల్పంతో
నాలోని ఆలోచనల ఆకుల్ని నిద్రలేపి
మరింత గొప్పగా నా వ్యక్తిత్వాన్ని
ఆవిష్కరించగలను
అవసరం తీరిపోయిందని నన్ను
అడ్డంగా నరికేసినా ఆఖరి సమయంలో
నీకు ఆసరాగా నిలుస్తాను
అవున్నిజమే...
నేను ఆడదానిలో ఉన్న చెట్టుతనాన్నే
'మల్లెతీగ వంటిది మగువ జీవితం' అని రాస్తే
మల్లెతీగతో పోల్చినందుకు సంతోషపడ్డాను
ఆధారం లేకుండా బతకలేవనే బెదిరింపని
తెలుసుకోలేకపోయాను
నీకు తెలుసు అవకాశం వస్తే అంతరిక్షం కూడా
నా చేతి చిటికెన వేలి చివరనే ఉందని
అందుకే నన్ను అవసరం మేరకు మాత్రమే
పెరగనిస్తావు
నేలపై నాటుకోకుండా కుండీలో బంధించేస్తావు
నా ఆశల కొమ్మల్ని ఎప్పటికప్పుడు కత్తిరించేసి
నన్నో బోన్సాయి చెట్టుగా చేసేస్తావు
నీ ఇంట్లో ఉండాల్సిన ముఖ్యమైన అలంకారంగా
మార్చుకున్నావు నన్ను
నీ నీడలో నిస్సారంగా ఉండిపోయినా
ఉన్న కాస్త సారాన్నీ ఫలంగా ఆశిస్తావు
నీ పురుషాహంకారం అనే అణుబాంబు పేలుడు
రేడియేషన్ చూసి
నిలదొక్కుకోవడం తర్వాత...
అసలు మొలకెత్తడానికే భయపడే స్థితిని తీసుకొచ్చావు
ఏ క్షణంలో నీ మాటల కత్తుల వేటు పడుతుందో
నీ చూపుల ఆసిడ్ దాడికి గురి కావాల్సి వస్తుందోనని
వణికిపోయేలా చేశావు

ఇప్పటికైనా...
చెట్టు లేకపోతే నీ భవిష్యత్తుకు ఆసరా ఉండదనీ
ఆడది లేకపోతే భవిష్యత్తులో నువ్వు ఉండవనీ
తెలుసుకుంటే
మొక్కని చెట్టుగా మారనియ్యి
ఆడదాన్ని ఆకాశాన్ని తాకనియ్యి! ■






# హృదయాన్ని తాకే మానవీయ కథలు

- బొడ్డపాటి చంద్రశేఖర్
63003 46501

**శ్రీశ్రీ** వచనానికి నడక ఉండాలన్నాడు. అపుడే అది పాఠకుణ్ణి ఆకర్షించి, ఉత్కంఠను కలిగిస్తూ చదివించే లక్షణాన్ని సంతరించు కుంటుంది. ఆ లక్షణాన్ని తనలో పొదవుకుని కథను చకచకా నడిపే ఓ అద్భుత కథకుడే పివిబి.శ్రీరామమూర్తి. నాయనమ్మ చెప్పిన వైవిధ్యభరితమైన కథలు, కథనం ఆయనను ఎంతో ప్రభావితుడిని చేసి, కలం పట్టి 300 కథలు రాసేటట్లు చేసింది. వాటిలో కొన్ని రెండు కథా సంపుటాలుగా వచ్చాయి. వాటిలో ఒకటి అరణ్య రోదనం.

ఈ సంపుటిలో 34 కథలున్నాయి. అన్నీ చదివిస్తాయి. కొన్ని కథలు మనసులో నిలిచిపోతాయి. తీసుకున్న కథాంశాన్ని మాలిమి చేసుకుని స్పష్టతతో చక్కని అభివ్యక్తితో కథావరణాన్ని కల్పిస్తూ సందర్భానికి తగిన భాషతో కథను పలికించే శ్రీరామ మూర్తి గారి కథలు ఐదు దశాబ్దాలుగా అన్ని ప్రముఖ పత్రికల్లో ప్రచురితమై అలరిస్తున్నాయి. ఈ సంపుటి నుంచి ముచ్చటగా మూడు కథలను పరిచయం చేస్తాను.

మొదటి కథ అరణ్యరోదనం. కథాసంపుటికి ఈ పేరే పెట్టారు. గిరిజనుల జీవనశైలిని, సంస్కృతిని, అమాయకత్వాన్ని, అసహా యత్వాన్ని, వీరిని దోచుకునే షావుకారు స్వార్థ పరత్వాన్ని, అతని కొడుకు ధర్మరాజు కాముకత్వాన్ని, పోలీసుల జులుంని దృశ్యమానం చేస్తుందీ కథ. ధర్మరాజు కాముకతకు బలైన గిరిజన కన్యల ఆర్తనాదం 'అరణ్య 'రోదనమే! ఎంతో బిగువుగా వుంటుంది కథనం. తెలుగు పండితులు, ఉపాధ్యాయులు అయిన శ్రీరామమూర్తి గారు చేసే వర్ణనలు, ఆధునిక పోలికలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఈ వర్ణనలు ఎక్కడా మితి మీరవు. పోలికలు ఉపమ, రూపకాలంకారాలై చెట్టపట్టాలేసుకుని తిరుగాడుతుంటాయి. మచ్చుకి కొన్ని చూద్దాం!

- *సూర్యకాంతికి జారిపడే మంచు బిందువులు తెగిన హారంలోంచి జారిపడే ముత్యాల్లా కనిపిస్తాయి.*
- *కొండల మీద నుంచి జారి పడే సెలయేళ్లలో ప్రతిబింబించే చుక్కలు వెన్నెల జలకాలాడటానికి వచ్చినట్లు కనిపిస్తాయి.*
- *మంచుతో కప్పబడిన కొండలు కేరిబాగుల్లో పెట్టి ఫ్రిజ్‌లో పెట్టిన ఆకుకూరల సంచీల్లా ఉన్నాయి. తుఫాన్ సమయంలో హెలికాప్టర్ నుంచి ఎగర వేయబడ్డ ఆహార పొట్లాల్లా, ఆ కొండల మధ్య అక్కడక్కడ వున్న ఇళ్ళు.*
- *కొండలో చలికి జనమంతా రగ్గులు కప్పుకుని గడ్డిలో పెట్టి గోనెల్లోకి దింపిన అరటిపళ్ళ గెలల్లా ఉన్నారు.*

... ఇవన్నీ రచయిత భావుకతకు, భావనా శక్తికి, పరిశీలనా దృష్టికి ప్రతీకలు. కొన్నిచోట్ల కవిత్వాన్ని చెపుతున్నారా అనిపిస్తుంది. అలా రచన సాగినపుడు ఇది వచనమని, కవిత్వ మని విడదీయలేమని సంజీవదేవ్ అంటారు. శ్రీరామమూర్తి గారి కథలు చదువుతుంటే అది నిజం అనిపిస్తుంది. అవసరమైన చోట్ల చేసే పోలికలు, వర్ణనలు ఔచిత్యాన్ని చూపుతూ, సన్నివేశ బలాన్ని పెంచుతూ కథావరణాన్ని కల్పిస్తూ కథాప్రాంగణాన్ని దాటిపోవు.

రెండవ కథ 'టాంబు'. ఉత్తమ పురుషలో సాగే ఈ కథలో కథనపు బిగువుతో పాటు వేగమూ ఉంది. నిజానికి ఉత్తమ పురుషలో కథను నడిపించటం చాలా కష్టం. ఎంతో చాకచక్యం, సమర్థత కావాలి. రచయితకు ఆ రెండూ పుష్కలంగా ఉన్నాయి. కథాంశం రిజర్వేషన్‌లకు సంబంధించినది. తన పిల్ల లకు

ప్రతిభావంతంగా రాణించాలని పిల్లలకు చెప్పిన ఓ తండ్రి కథ 'టాంబు". అదే తమ్మయ్య! ఆ పిల్లలు కూడా తండ్రి ఆదర్శాన్ని అర్థం చేసుకుని, విలువల నెరిగి మసలుకుని చదువుల్లో రాణించి ఆ తండ్రికి గర్వ కారణ మయ్యారు. ఉత్తమ పురుష పాత్ర టాంబు ఆదర్శానికి, నిజాయితీకి, నిబద్ధతకు నిరుత్తరుడవుతుంది. తన పిల్లల స్థితిని, టాంబు పిల్లల స్థితిని పోల్చుకుని అసూయ చెందుతాడు. చక్కను మానసిక విశ్లేషణకు, మనస్తత్వ చిత్రణకు ప్రతీక ఈ పాత్ర. టాంబు మాటలు రిజర్వేషన్ల పట్ల అతని ఆలోచనా తీరు ఉత్తమ పురుష పాత్రను సిగ్గుపడేటట్లు చేస్తుంది. తన ఆలోచనా ధోరణి తప్పని తెలుసుకుని పశ్చాత్తాప్తుడవుతాడు.

ఇక మూడవ కథ 'హమ్మయ్య, దేవుడు బజ్జున్నాడు". దేవుడు ఓ చిన్న పిల్లవాడి పేరు. స్కూల్లో ఓ విద్యార్థి పుస్తకంలో పెట్టుకున్న రూ. 500 నోటు పోయిన సందర్భంలో తప్పు చేయటం మానవ సహజమని, దాన్ని దిద్దుకోవచ్చని లెక్కల మాస్టారు చెపుతారు. ఎవరు తీశారో అందరికీ బహిర్గతం కాని విధంగా ఒక ప్రయోగం చేసారు. విద్యార్థులందరిని క్లాసులోంచి బయటకు వెళ్ళమని, తరవాత ఒక్కొక్కరిని లోపలికి వెళ్లి, ఆ దొంగతనం చేసినవాణ్ని డబ్బు పోగొట్టుకున్న విద్యార్థి పుస్తకంలో పెట్టేయ్యమన్నారు. కాని ఆ ప్రయోగం సఫలం కాలేదు. "రమేష్ పుస్తకంలో పెట్టు కున్న నోటు ఎక్కడో జారిపోతే అది వాడి దురదృష్టం. మీలోనే ఎవరో తీసి దాచితే అది మహాపరాధం. మిమ్మల్ని దేవుడు క్షమించడు. దానికి ఫలితంగా మీ తల్లి తండ్రులో, మీరో శిక్ష అనుభవించాల్సి ఉంటుంది" అన్న మాస్టారి మాటలు విద్యార్థి దేవుడిలో భయాన్ని కలిగించాయి. తండ్రి గ్రామ పెద్ద. ఓ తగాదా విషయంలో ఇరు వర్గాల నుంచి లంచం తీసుకుని నిలదీసి నప్పుడు దేవుడి సాక్షిగా తీసుకోలేదని అబద్ధమాడటం ఆ బాలుడిని మరింత భయ భ్రాంతుణ్ణి చేసింది. తండ్రి అబద్ధమాడటం, పైగా దేవుడిమీద సాక్షిగా అనటం, మాస్టారి మాటలు ఆ చిన్న మనసును అతలాకుతలం చేసాయి.

వాడి మనస్థితిని అర్థం చేసుకున్న అతడి తల్లి భయాన్ని పారదోలే విధంగా లోకంతీరును వివరించింది. బోధనకు, ఆచరణకు ఉన్న అగాధాన్ని చెప్పింది. చిన్న మనసుకు అర్థం కాగల ఉదాహరణలిచ్చింది. ఆమె మాటలు అల్లకల్లోలమైన వాడి మనోసంద్రాన్ని ప్రశాంత పరిచాయి. వాడి కంటికి కునుకు వచ్చేట్లు చేసి "కుసుమ కోమలమైన ఈ దేవుళ్ళ గురించి అసత్య, అవినీతిమయమైన రొంపిలో కూరుకుపోయిన పెద్దలు ఆలోచిస్తు న్నారా అనే భయంకరమైన ఆలోచనతో తను కునుకుకు దూరమైంది. ప్రపంచపు తీరును వాడికి తేట చేసిన వైనం చాలా గొప్పగా ఉంది. అయితే ఆ తీరును పట్టించుకోవద్దని, నిజాయితీగా, మనస్సాక్షికి బద్ధుడిగా ఉండమని తన కొడుక్కి చెప్పిన ఆ తల్లి పాత్రను మలచిన తీరు, పాత్ర చేత పలికించిన పలుకులు ఆమె ఔన్నత్యానికే కాదు పరిణతికీ చిహ్నం. కొడుకు దృష్టిలో వాడి తండ్రి మీద చులకన కలిగించేటట్లు కాని, అగౌరవాన్ని చూపే విధంగా గాని లేవు. కానీ, అతడిని, ఆ రకమైన వాళ్ళని ఆదర్శంగా తీసుకోకూడదని అన్యాపదేశంగా చెపుతున్నట్లున్నా, దేవుడికి అది చేరింది. మనసు తేలికయింది. అందుకే బజ్జున్నాడు. How judiciously and elegantly the writer has portrayed the mothers character!

ఈ కథలో మూడు పాయలున్నాయి. మొదటిది, ప్రధాన మైనది దేవుడి స్కూల్లో జరిగిన దొంగతనం సంఘటనలో మాస్టారు చేసిన ప్రయోగం. రెండోది : దేవుడి తండ్రి తీర్పు చెప్పటంలో అబద్ధమాడటం. మూడోది : అతలాకుతలమైన దేవుడి మనసు గుర్తించి, సాంత్వన చేకూర్చిన అతడి తల్లి చేసిన బోధన. మూడు పాయలుగా కథలో సాగి ఒక ప్రవాహ మైనాయి. ఈ మూడు పాయలు కథకు ఎంతో కీలకమైనవి. వీటిని ఎంతో సమర్థంగా నిర్వహించారు రచయిత.

ఈ సంపుటిలోని కరువొచ్చిందా, దేనికి? అనే కథలో "...కరువు కంది పప్పు కొస్తే ఫర్వాలేదు, అభిమానానికి, ఆప్యాయతకీ రాకూడదు" అని హెచ్చరిస్తారు. రెక్కలు ముక్కలు చేసుకుంటూ, ప్రాణాన్ని పణంగా పెట్టే కూలీల చెమట, కాయకష్టం, బలయ్యే ప్రాణాలు కోటయ్య లాంటి కాంట్రాక్టర్ల బంగారు భవితకు ఎలా ఆధార మవుతాయో చెప్పే కథ "పునాది రాళ్లు". ఇలా ఎన్నో కథలు పాఠకులను సంతోషింప చేసేందుకు, ఆలోచించుకునేందుకు, శోధించుకునేందుకు మార్గదర్శకా లవుతాయి.

రచయితకు ప్రాచీనాధునిక సాహిత్యాల పట్ల మక్కువ ఉంది. సందర్భానికి అవసరమని భావించినపుడు వాటిలోని వాక్యాలను లేదా సారాన్ని చెప్పటం వారికలవాటు. శ్రీనాధుని, నంది తిమ్మన్నను, దేవులపల్లి వారిని, గుంటూరు శేషేంద్రశర్మను వుటంకిస్తూ ఉంటారు. వాల్మీకి, వ్యాసులను స్మరిస్తుంటారు. స్పష్టత, క్లుప్తత, సూటిదనం, చక్కనైన చిన్న వాక్యాలు, పద ప్రయోగాలు, శ్రీరామమూర్తి గారి కథలకు సహజాభరణాలు. పరిశీలన, పఠనం అన్న గురజాడ మాటలను అక్షరాలా మనసులో నిలుపుకుని, సమాజ పోకడను తన రచనలలో చూపిస్తూ ఇప్పటికీ సాహితీ వ్యవసాయం చేస్తున్న అక్షర హాలికులు పి.వి.బి.శ్రీరామమూర్తి గారికి అభినందనలు! ఇంకెందుకు ఆలస్యం.. పుస్తకాన్ని అందుకోండి. చదవండి. రచయిత మొబైల్ నెంబరు : 94400 59067.

■




# సామాజిక వాస్తవికత, భావావేశం మేలి కలయిక

- వొరప్రసాద్
94900 99059

తెలుగు ప్రాంతానికి, తెలుగు భాషా వాతావరణానికి దూరంగా కలకత్తాలో ఉంటారు సర్వమంగళ కుటుంబం. వారి పూర్వీకులు ఎన్నో సంవత్సరాల కిందట వలస వెళ్ళిపోయారు. అక్కడే అలా స్థిరపడిన తెలుగు కుటుంబాలు తెలుగు వాతావరణానికి, తెలుగు భాషకు దూరమైనప్పటికీ శక్తికిమించి తెలుగుతనాన్ని కాపాడుకునే ప్రయత్నం చేయడం అభినందనీయం. అక్కడి తెలుగువారికోసం 'జాగృతి సమీక్ష' త్రైమాసిక పత్రిక సర్వమంగళ, కేశవ్ దంపతులు వెలువరిస్తున్నారు. ప్రగతిశీల దృక్పథంతో సృజనాత్మక రంగంలో కృషిచేస్తున్న వీరి నేపథ్యం ఎందరికో స్ఫూర్తినిస్తుంది. 'నెమిషిస్' పేరుతో సర్వమంగళ తన తొలి కవితా సంపుటితో మనముందుకు వచ్చారు. ఈ కవితా సంపుటి 50 కవితల సమాహారం. ఇటీవలే కవితా రచన ప్రారంభించిన సర్వమంగళ కవిత్వ పాఠకులను ఆకట్టుకోవడానికి ఈ సంపుటి ద్వారా గట్టి ప్రయత్నమే చేశారు. ఈ పుస్తకం శీర్షిక 'నెమిషిస్' అని పెట్టడంలోనే పాఠకుల్లో ఆసక్తి రేపారు. ఈ పుస్తకానికి చాలా విలువైన ముందుమాట రాసిన ప్రముఖ కవి, జర్నలిస్టు నల్లి ధర్మారావు ఈ శీర్షిక తనకి అర్థం కాలేదంటూ దాని అర్థం తెలుసుకోవడానికి తను చేసిన అన్వేషణను ఆసక్తిగా ప్రస్తావించారు : "హార్వర్డ్ యూనివర్సిటీ ఆస్ట్రో ఫిజికల్ అబ్జర్వేటరీతో కలిసి యూసీ బెర్కలీ అనే భౌతిక శాస్త్రవేత్త సూర్యుడు కూడా మరో నక్షత్రంతో కలిసి ఆవిర్భవించినట్లు కనుగొన్నాడు. ఆ మరో నక్షత్రం పేరు 'నేమిసిస్' అంటూ పాఠకులకు ఇబ్బంది లేకుండా ముందే 'నెమిషిస్' అర్థాన్ని చాలా విపులంగా వివరించారు. ఆయన వేరువేరు అర్థాలను వివరించినప్పటికీ సూర్యుడితో పాటు జంటగా ఆవిర్భవించిన ఒక నక్షత్రం పేరు 'నెమిషిస్' అనే వివరణ మాత్రం ఆసక్తికరంగా అనిపిస్తుంది. ఆ పదాన్ని సర్వమంగళ కవితా శీర్షికగా పెట్టుకుని చక్కటి కవిత రాశారు. ఆ కవితా శీర్షికనే ఈ సంపుటి శీర్షికగా కూడా పెట్టారు. కవులు తమ కవిత్వం ద్వారా కొన్నిటిని ప్రత్యేకంగా వెలుగులోకి తీసుకువస్తారు. కొత్త అర్థాలతో పాఠకులకు కొత్త అనుభూతులను పంచుతారు. 'నేమిషిస్' పదం అటువంటిదే.

ఈ పుస్తకంలో తన చుట్టూ ఉన్న సమాజంలోని అనేక సమకాలీన అంశాలను సర్వమంగళ కవిత్వీకరించే ప్రయత్నం చేశారు. వ్యవస్థలోని లోపాలనూ, వ్యక్తుల అంతరంగిక ఘర్షణను గాఢమైన కవిత్వంగా మలిచారు. మనుషుల మధ్య అడ్డుగోడలుగా నిలిచే కుల, మతోన్మాద ఛాందసాలను తన కవిత్వం నిండా తీవ్రంగా నిరసిస్తారు. మతం పేరుతో మనుషుల హృదయాలను గాయపరిచే ధోరణిపై నిప్పులు కక్కుతారు. కాశ్మీర్ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా 370 ఆర్టికల్‌ను రద్దుచేయడం, ముస్లిం సమాజాన్ని అణచివేసే కుట్రతో తీసుకువచ్చిన పౌరసత్వ చట్ట సవరణ వంటివి మనసుకు హత్తుకునేట్టుగా కవితా వస్తువును చేశారు. 'కశ్మీర సమీరం' కవితలో – 'చేతులకు బేడీలు/ కాళ్ళకు సంకెళ్ళు/ గృహ నిర్బంధం/ నిర్మానుష్యం నింగీ నేలా' అంటారు. కాశ్మీర్ ప్రజలకు స్వేచ్ఛ లేకుండా ఆంక్షలతో, నెలల తరబడి కర్ఫ్యూ విధించడం చూసిన మనల్ని ఈ కవితా చరణాలు కదిలిస్తాయి. నిజంగానే ఇంటర్నెట్ కూడా లేకుండా చేసిన ఆ పరిస్థితి 'నిర్మానుష్యం నింగీ నేలా' అనడం గుండెల్ని పిండేస్తుంది.

అక్కడి ప్రజల స్వేచ్ఛని హరించడం మానవ హక్కుల హననం గా మనల్ని తట్టి చెబుతుంది ఈ కవిత.

సమాజం పట్ల లోతైన అవగాహన, మానవీయ దృక్పథం సర్వమంగళ కవిత్వాన్ని పరిపుష్టం చేసాయి. కీలక సంఘటనల్ని తన కవితా వస్తువులుగా చేసుకుని పాఠకుల్లో ఆలోచనల్ని రేకెత్తించే ప్రయత్నం చేస్తారు. దేశాల మధ్య జరిగే యుద్ధాలకున్న అర్థాల్ని ప్రజల కోణంలో అర్థం చేయించే ప్రయత్నం చేసారు 'నివార్యమో, అనివార్యమో' కవితలో. "నీవు విసిరిన వలలో/ ఇప్పుడు కొవ్వొత్తులతో నేను కాలిపోతున్నా!/ నీవిప్పుడు నలువైపులా మారుమోగి/ పోయే ఉన్మాదం!/ ఇప్పుడు ముసిరిన చీకట్లో/ నా ప్రాధాన్యం ఎక్కడో తప్పిపోయింది", "యుద్ధం వికృతత్వం/ యుద్ధభూమిలో ఉన్నవాడికే/ ఎక్కువ తెలుస్తుంది" "యుద్ధం నివార్యమో, అనివార్యమో/ ఓసారి అడిగిచూడు." అసమానతల్ని పెంచే విధానాల్ని పాటించే పాలకులు ప్రజల కనీస అవసరాలను తీర్చలేరు. ప్రజల్ని మభ్య పెట్టడం కోసం, ప్రజల దృష్టిని మళ్ళించడం కోసం అకారణ యుద్ధాల్ని, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొడతారు. అందుకే సర్వమంగళ ఈ కవితలో 'యుద్ధ వికృతత్వం/ యుద్ధభూమిలో ఉన్నవాడికే ఎక్కువ తెలుస్తుంది' అంటూ 'యుద్ధం' ఏమాత్రం ప్రజలకు అవసరం లేనిదిగా పరోక్షంగా ప్రకటిస్తారు. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా అది ప్రజల కోణంలో నివారించదగినదే కాని అనివార్యం కాదు అని ఒక మౌలికమైన అవగాహనను తన కవితలో వ్యక్తీకరిస్తారు.

తనకున్న మార్క్సిస్టు ప్రాపంచిక అవగాహనతో సమాజంలోని అసమానతల, ఆధిపత్య భావనల మూలాల్లోకి కవితా పాఠకుల్ని తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తారు: "నిన్న రోహింగ్యల గుండెకోత తీరలేదు/ ఈ రోజు అస్సాంలో ఆక్రందన మొదలైంది/ రేపు బెంగాల్లో పునాదులు కదిలిస్తారు/ వలసలు చిందించే చెమటతో/ అభివృద్ధికి పునాదులు వేసు కున్నారు/ ఇప్పుడు బరువుగా మారిన వలస జీవులు/ ఆ రోజు చౌకగా దొరికన శ్రమజీవులు/ ఇక్కడ ఏదీ నాది కాదు!" అంటారు 'ఇక్కడ ఏదీ నాది కాదు!' కవితలో. బర్మాలో నిరాశ్రయులుగా మారిన రోహింగ్యాలు, అస్సాంలో ముస్లిం ప్రజానీకం పరిస్థితిని మనదృష్టికి తీసుకువచ్చి ఆలోచింప జేస్తారు. మీరు మా ప్రజలు కారు అనే పరిస్థితిని ఎదుర్కొన్న సమూహపు దైన్యస్థితి పట్ల పాఠకుల్లో సానుభూతి రేకెత్తిస్తారు. ఈ ప్రపంచంలో వలసవెళ్ళిన ప్రజల్ని అందరూ ఉపయోగించు కున్నవారే. కానీ ఆ వలస ప్రజల అవసరాల్ని, ఆత్మగౌరవాన్ని పట్టించుకోవడంలో క్షమించరాని నిర్లక్ష్యం జరిగింది. వలసజీవుల, నిరాశ్రయుల వేదనని తన కవితతో హృదయానికి హత్తుకున్నారు సర్వమంగళ. సంకుచిత అవగాహన మనుషులు విశాలంగా ఆలోచించలేకపోవడాన్ని ఆమె తన కవితల్లో ప్రశ్నిస్తారు. ఒక విశ్వజనీన భావన ఈ పుస్తకం లోని కవిత్వం నిండా పరుచుకుని కనబడుతుంది. భావ ప్రకటనా స్వేచ్ఛపై రాసిన 'అక్షరానికి సంకెళ్ళు' కవిత తీవ్రమైన స్వరంతో రూపొందింది : "ప్రాణం పోసుకోవాలని/ తాపత్రయ పడుతూ/ క్షణక్షణం గండంగా/ వేటగాడి చేతిలో గురితప్పి/ ఊపిరి పోసుకుంటున్నాయి". పాలకులను ప్రశ్నించిన నేరానికి హత్యలకు గురవుతున్న, జైలు పాలవుతున్న రచయితలు మనకు ఈ కవితలో ప్రత్యక్షమవుతారు. అయినా ఈ పాలకులు ప్రశ్నలను ఎదుర్కోక తప్పదు అనే సంకేతాన్ని ఈ కవిత వ్యక్తీకరిస్తుంది.

మనదేశంలో హిందూమతోన్మాదం ప్రజల్ని విభజించడంలో వేయి నాల్కలలో విజృంభిస్తున్నది. మనుషు లను మతస్థులుగా చేసి విద్వేషం పెంచుతున్న తీరును 'అబద్ధం' అనే కవితలో హృదయానికి హత్తుకునేలా కవిత్వీకరించారు సర్వమంగళ. "ముస్లిమంటే భయం/ నాలో వటవృక్షమై/ మాటువేసి కూర్చుంది/ ముస్లిమంటే అలజడిని/ స్నేహమన్న చేయిచ్చిన/ ముమ్తాజ్‌ను మరిచిపోను/ అఖిల కాలేజీ చదువుల అనుభవాల్లో/ ఆప్యాయతలూ, అనుభూతులూ/ అసలు మరిచిపోలేను/ అమ్మ అబద్ధానికి కారణం/ అమ్మ కాదనీ/ విడదీసే చరిత్ర అనీ తెలిసింది/ శత్రువెవరో తెలిసింది." ముస్లిం అంటే ఒకరకమైన విద్వేషాన్ని దేశంలో పెంచిన తీరును, కుట్రను కవితాత్మకంగా వెల్లడిచేసిన కవిత 'అబద్ధం'. లౌకిక భావాలతో, మత సామరస్యంతో కలిసిమెలిసి సాగుతున్న ప్రజలను విడదీయ డానికి మతం మతోన్మాదంగా మారిన తీరు పట్ల హెచ్చరిక ఈ కవిత.

సమాజంలో వేళ్ళూనుకుంటున్న అపసవ్యతల్ని పాఠకుల దృష్టికి కవితాత్మకంగా తీసుకురావడమే కాదు ప్రతిఘటించడం మనపనే అంటారు సర్వమంగళ. మన భుజాల మీద చేతులు వేసి నిలదీద్దాం, ప్రశ్నిద్దాం నడవమంటారు 'నిశ్చయం' కవితలో. "మనల్ని మనవాళ్ళతో/ దండించి విడదీస్తారు/ ముస్లిమని హిందువని/ దళితులని బీసీలని/ మతాల మారణ హోమం/ కులాల కృత్రిమ యుద్ధం/ రెచ్చగొట్టి రచ్చకెక్కిస్తారు/ మనలోని అమాయకత్వాన్ని/ ఆటగా మార్చుకుంటారు" "అమానవీయ శక్తుల్ని/ అధికారపు దురంధరుల్ని/ కలసి కట్టుగా నిక్కచ్చిగా/ నిశ్చలంగా నిర్భయంగా/ నిలదీద్దాం ఎదిరిద్దాం/ నూతన సమాజాన్ని/ వినూత్నంగా నిర్మిద్దాం".

పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచీకరణ పేరుతో లాభాలవేటలో

తలమునకలై ఉంది. ఒక శాతం కోటీశ్వరులు, శత కోటీశ్వరులు ఒకవైపు, మరోవైపు 99 శాతం ప్రజలేమో అసమానతల మధ్య, అశాంతి, అభద్రతల మధ్య కునారిల్లి పోతున్నారు. ఈ పరిస్థితుల్ని రచయితలు శక్తివంతంగా తమ తమ సృజనాత్మక ప్రక్రియల ద్వారా వెలుగులోకి తెస్తున్నారు. ఈ కృషి అంతా ఒక ప్రతిఘటనా భావజాలంగా మారాలి. కేవలం పరిస్థితుల్ని వర్ణించడంతో సరిపెట్టుకుంటే లాభం లేదు. పాఠకుల్లో ప్రతిఘటనా చైతన్యం పెరిగేలాగా ప్రగతిశీల రచయితలు కృషిచేయాలి. ఆ దిశగా రచయితలు ప్రయాణించాల్సిన ఒక అనివార్యమైన భౌతిక పరిస్థితులు ముందుకొస్తున్నాయి. తన శక్తిమేరకు ఆ దిశగా సర్వమంగళ కలం నడవడం అభినందనీయం.

లాభాలకుండే ప్రాధాన్యత మనుషులకుండని పెట్టుబడిదారీ వ్యవస్థపై భ్రమలను వదులుకొని శ్రమశక్తిని గౌరవించే సామ్యవాద వ్యవస్థకు బాటలు వేయాల్సిందే అంటూ స్పష్టం చేస్తారు 'మరో ప్రపంచానికి బాటలు వేద్దాం' కవితలో. "బూర్జువా భ్రమలతో/ వాస్తవాలు పొసగవని/ పెట్టుబడిపై పోరాటం నిత్యసత్యమని/ శ్రమ శక్తి అజేయమని/ జయించేందుకో ప్రపంచం ఉందని/ సామ్యవాదం అనివార్య మని/ వెలుగెత్తి చాటుదాం!/ మరో ప్రపంచానికి బాటలు వేద్దాం" అంటూ మనకు మరో ప్రత్యామ్నాయం ఉందని ఆ వైపుగా మనం ప్రయాణించాల్సిందే అంటున్నారు సర్వమంగళ. నేటి సంక్లిష్ట సమాజం అర్థం కావడం లేదంటూ అస్పష్టంగా మాట్లాడే రచయితలకు భిన్నంగా చాలా స్పష్టంగా తన అభిప్రాయాన్ని వ్యక్తీకరిస్తారు. ఇటువంటి గొంతులు మరిన్ని పెరగాలి. ప్రజల కోణంలో సామాజిక వాస్తవికతను విప్పిచెప్పే సాహిత్యం మాత్రమే సమాజాన్ని మరింత ఉన్నతం చేయగలదు.

పెట్టుబడి అన్నిరంగాలనూ మాయాజాలానికి గురిచేస్తుంది. అనేకమంది రచయితలు ఈ సమాజం పట్ల భ్రమలకు గురి అవుతుంటారు. వాస్తవిక దృక్పథం గల రచయితలు అటువంటి భ్రమలకు గురికారు. సర్వమంగళ అందుకే 'పరాయినైతే నేమి..!' కవితలో "నా ఆలోచనల్లో / నేను లేను/ పెట్టుబడి మాయాజాలం/ నన్ను పరాయిగా మార్చింది" అంటూ తనను తాను విమర్శించుకుంటారు. అటువంటి స్వీయ విమర్శనాత్మక దృష్టి ఈనాటి రచయితకు చాలా అవసరం. అంతటితో ఆగకుండా తాను ఎప్పటికప్పుడు తనను తాను చెక్కుకుంటున్న దృశ్యాన్ని 'అంతర్లీనం' అనే చక్కటి కవితగా అందించారు : "ఎన్ని ఉలి దెబ్బలైనా/ ఈ శరీరానికీ మనసుకీ/ తగిలే ప్రతి దెబ్బా/ నాలో మరింత పరిణతిని పరిపుష్టం చేస్తోంది/ గాయాలు చేస్తూనే ఉంది ఈ ఉలి". వయస్సు పెరిగే కొలదీ శరీరాకృతి మారుతున్నట్టే మన మానసిక పరిణతి కూడా మారుతుంది. ఆ స్పృహ మనకున్నప్పుడు మనల్ని మనం ఉన్నతంగా చెక్కుకోవాలి. ఎన్ని ఉలిదెబ్బలనైనా తట్టుకుని మనల్ని మనం మలుచుకోవాలి. మన వ్యక్తిత్వాన్ని విలువలతో రూపొందించుకోవాలనే భావనలను ఈ కవిత అందిస్తుంది. మన జీవన ప్రయాణంలో మన వ్యక్తిత్వ శిల్పాన్ని ఉలి దెబ్బలు తింటూనే తీర్చిదిద్దుకోవాలి అని హృద్యంగా చెప్పి ఆకట్టుకుంటారు. మహిళలపై జరుగుతున్న హత్యాచారాలపై, మహిళా వివక్షపై ఆలోచింపచేసే కవితలు రాశారు.

'చరిత్రహీనులు' కవితలో "మూడు కాళ్ళతో/ నడిచే ముసలి అవ్వయినా/ పాకుతున్న చిన్నారి పాపయినా/ జీవమున్న స్త్రీ దేహం/ అయితే చాలు/ పురుష రక్తం/ ప్రవహిస్తోంది" అంటారు. స్త్రీలపట్ల పురుషులు ఎందుకింత దుర్మార్గంగా ప్రవర్తించగలుగుతున్నారు. స్త్రీని లైంగికంగా తప్ప మరో విధంగా చూడలేనితనం ఎందుకు పురుషరక్తంలో జీర్ణించుకుపోయింది? ఈ ప్రశ్నలకు ఈ గ్లోబలైజేషన్ సమాజం సమాధానాలు చెప్పదు. మహిళను తమ వ్యాపారానికి, పబ్లిసిటీ చేసుకోవడానికి, అందాల ప్రదర్శనకు ఉపయోగించుకున్న ఈ వ్యాపార సమాజమే స్త్రీలపట్ల పురుషుల దృష్టిని ఈ విధంగా నియంత్రించింది. అందుకే 'బంగారు పంజరం' అనే కవితలో "నేనొక స్త్రీని/ బంగారు పంజరంలో/ భవిష్యత్తు అందంగా/ ఊహించుకుంటున్న/ అందమైన స్త్రీని" అంటారు సర్వమంగళ. పెట్టుబడిదారీ సమాజం ఎప్పటికీ బంగారు పంజరమే. ఊహించుకునేలా చేస్తుంది. భ్రమలకు గురి చేస్తుంది. వాటివెనుక సాఫీగా తన దోపిడీని కొనసాగిస్తుంది. ఈ కుట్రను బహిర్గతం చేసే ప్రయత్నం ఈ కవిత్వం. నిజాల్ని నిర్భయంగా చెప్పగలిగిన కవిత్వం ఇది. ఈ సమాజం పట్ల వున్న భ్రమలను, ముసుగులను సునాయాసంగా తొలిగిస్తుంది. ఆడంబరం లేని అక్షరాలతోనే సామాజిక వాస్తవికతను పాఠకుడికి దృశ్యమానం చేసిన కవిత్వం 'నెమిషిస్'. 'పరివేదన' కవితలో – "వేదనతో మనసు పడ్డ తపన/ వర్షించిన కన్నీళ్ళూ/ కావ్యాన్ని సృష్టిస్తాయి" అంటారు సర్వమంగళ. నిజంగానే తన హృదయం ఎంత దుఃఖమయం అయితే ఈ కావ్యం వెలుగయ్యిందో. ఎన్ని కన్నీళ్ళ బరువో ఈ 'నెమిషిస్'. కొన్ని అక్షరాలు మాత్రమే కావచ్చు, చిన్న కావ్యం మాత్రమే కావచ్చు. నిప్పుల్లాంటి నిజాల్ని గుప్పిట పట్టినప్పుడు ఆ కొద్దిపాటి అక్షరాలకు వెలకట్టలేని విలువుంటుంది. ఫోన్ 89616 26848 ద్వారా కవయిత్రిని సంప్రదించవచ్చు. ■

## శుభ్రత నేస్తాలు

- కోరాడ అప్పలరాజు
95502 34204



దేహానికి మురికి దుప్పటి కప్పుకొని
సూర్యోదయానికి సలాం కొట్టి
వీధుల్లో... వాడల్లో...
చెత్తను చిత్తశుద్ధితో ఏరుతూ
పరిశుభ్రత మంత్రాన్ని జపించే
పరమాత్మ స్వరూపులు వాళ్ళు..!

ఇంటి ముంగిటకొచ్చి ఈల వేస్తుంటే..
మూలనున్న చెత్త బుట్ట
మురిపెంగా నవ్వుతుంది..!
అపరిశుభ్రత అంగంగమూ పేరుకున్నా
మురికి కూపం నుంచి
అపురూపంగా చెత్త తీస్తున్న
వాళ్ళను చూస్తుంటే
పుడమి తల్లి ఎదనుంచి
పురాతన వస్తువుల్ని అపురూపంగా ఏరే
పురాతత్వ శాస్త్రవేత్తల్లా గోచరిస్తారు..!

డ్రైనేజీ నుంచి వెలువడే
దుర్గంధపు వాసనలు
ముక్కుపుటాల్ని అదరగొడుతూ
వైతరణీ నదిని తలపిస్తున్నా...
పరహితమనే చందనం పూసుకొని
మురికితో మైత్రి చేస్తున్న వాళ్ళని చూస్తుంటే
సాష్టాంగ ప్రణామం చేయాలనిపిస్తుంది

కొన్ని కొన్ని సమయాల్లో
నిరుపమానమైన వాళ్ళ సేవ స్మరణకొస్తుంటే...
లోక హితానికై హాలాహలాన్ని
కుత్తుకలో దాచుకున్న త్రినేత్రధారిలా సాక్షాత్కరిస్తారు..!
వాళ్ళ కరాల్లో చీపుళ్లు కదులుతుంటే
వీధుల్లో కుళ్లు కనుమరుగవుతుంది
మలిన రహితమైన పరిసరాలను
జాతికందించే..
మహోన్నత మూర్తులు వాళ్ళు
శుభ్రత సంపదకు చిరునామా వాళ్ళు...

## పగలు రాత్రి

పగలు రాత్రి
ఒకదాని వెంటొకటి
ప్రవహించే రెండు నదులు

పగలు రాత్రి
కాలానికి సమానమైన
రెండు కళ్ళు

వెలుతురు పువ్వుపై
వాలిన తుమ్మెద రాత్రి –

రాత్రి భుజాలపై
ఊగాడే
ఉదయం పాపాయి పగలు

- రాఘవేంద్ర



# డివైడర్

- రత్నాల బాలకృష్ణ
94401 43488

**న**డినెత్తిమీదకెక్కి కిరణాస్త్రాలు సంధించడానికి సమాయుత్తమవుతున్నాడు సూర్యుడు. రోడ్డుకి వారగా చెట్టుకి ఆనుకొని షెడ్డులాంటి కొట్టుకి బయట ఒక పక్క పాత టైర్లు పేర్చబడి ఉన్నాయి. ఇంకోపక్క పాత ట్యూబులు వేలాడుతూ ఉన్నాయి. టూల్‌బాక్స్ పక్కన రెంచీలు, సుత్తి, స్క్రూడ్రైవర్లు, లీవర్లు, జాకీ చిందర వందరగా పడి ఉన్నాయి. అప్పటికి పావుగంట నుంచి వెతుకుతున్న రెంచీ మాత్రం చేతికి దొరకలేదు వజీర్‌కి. మొహం నిండా చెమటలు పట్టి కష్టమర్ అసహనపడతాడేమోనన్న తొందరలో కోపంతో తన కుర్రాడిపై కేకలు వేస్తూ.... "హరే అండా! ట్వంటీ-ట్వంటీటు రింగ్ రెంచి లేకే ఆవ్‌రే. "ఈ బేక్ వీల్ నట్టు చెక్‌నట్ రెంచితో ఇప్పుతుంటే ఈడడం లేదు!" అన్నాడు వజీర్.

"సాబ్‌జీ ఆ రెంచి ఎదురుగా ఉన్న థామస్ కొట్టు కుర్రాడు లేకే గయా!" అని సమాధానం ఇచ్చాడు అండా. వీడి బుర్ర కోడిగుడ్డు ఆకారంలో ఉండడంతో వీడిని అండాగాడనే అందరూ పిలుస్తారు. వాడి అసలు పేరు ఎప్పుడో మర్చిపోయారు అందరూ.

"తు కైకు దియారే .. జా జల్దీ లేకే ఆజావ్, ఇక్కడున్నట్లు రావాలా" అంటూ గద్దించాడు వజీర్.

"జీ..! ఎదురు కొట్టుకెల్లాలంటా థోడా టైం పడుతుంది సాబ్. ఆ చివర కొత్తపేట దగ్గర జంక్షన్ రోడ్‌క్రాస్ ఇచ్చాడు. ఈ చివర సింహాచలం మేడ దగ్గర కెళితేగాని ఎదురు రోడ్లోకి ఎళ్ళలేం. మధ్యలోంచి డివైడర్ వెళుతోంది కదా సాబ్! ఆ చివరికెళ్ళి థామస్ కొట్టుకెళ్ళి మళ్ళీ తిరిగి వెనక్కి రావాలి సాబ్. టై లగేగా !"

"హవునురా! మై భీ భూల్ గయా.. సంవత్సరం క్రితం వరకూ ఎంత ఖుషీగా ఉండేవాళ్ళం. ఈ డివైడర్ కోసం రోడ్డు వెడల్పు చేసి మన బతుకుల్ని బర్‌బాద్ చేసాసార్ కదరా! ఫిర్ అబ్ హమ్ క్యా కరేగా ! హోనేవాలా హో సక్తా! జా జల్దీ రెంచి లేకే ఆజానా" అంటు కుర్రాడ్ని థామస్ కొట్టుకి పంపించాడు.

"సర్లే.. ఈ చెక్‌నట్ రెంచికే రెండు సుత్తి దెబ్బలు వేస్తే అదే ఈడుతుంది" అని తనలో తనే అనుకుంటూ రెండు గట్టి సుత్తి దెబ్బలు వేసేసరికి బేక్‌వీల్ నట్లు వీడాయి. చైన్‌ని, బేక్ బ్రేకుల్ని పక్కకి తప్పించి బేక్ వీల్ బయటకు తీసేసి విప్పేసిన నట్లు మళ్ళీ బేక్‌వీల్‌కి బిగించి లీవర్లు తీసుకొని టైరు విప్పడం ఆరంభించాడు.

"వజీర్ ఎంత సేపవుతుంది పేచీ చెయ్యడానికి ? ఇప్పటికే వచ్చి అరగంటవుతుంది. కలక్టర్ ఆఫీస్‌కి టైం అవుతున్నాది. అర్జంట్ నోట్ పుటప్ చెయ్యాలి. వీడియో కాన్ఫరెన్స్ ఉందని అరగంట ముందు రమ్మన్నారు ఆఫీసరు. ఇప్పటికే అరగంట లేటయింది. అయ్యగారితో ఎన్ని దొబ్బులు తినాలో ఏంటో! నా ఖర్మ! ఆఫీసుకని ఇలా బయల్దేరానో లేదో! సడన్‌గా టైర్ పంక్చర్ అయ్యింది. తొందరగా కానీవయ్యా " అంటూ పంక్చర్ రిపేరు చెయ్యమని గాభరా పెట్టాడు కష్టమర్.

"సర్! నట్లు ఇప్పడం జర లేట్ హోగయా! దస్ మినిట్ మే పూరా కర్‌దూంగా! జరా బల్ల పర్ బైటియే సాబ్" అంటూ రిమ్ముకి టైర్‌కి మధ్యలో లివర్ దూర్చి రెండో లీవర్‌ని కొంచెం దూరంలో దూర్చి సుత్తితో నెమ్మదిగా కొట్టి రెండు చేతులతో ఒక్కసారిగా రెండు లీవర్లను ఒడుపుగా బయటికి నెట్టాడు. ఒక్కసారిగా రిమ్ము నుండి టైరు విడివడి కొంచెం బయటకు వచ్చింది. విడిన భాగంలో ఎడమచేతిని దూర్చి కుడిచేతితో లాఘవంగా మిగతా టైర్‌ని పక్కకి తొలగించాడు. లోపలున్న

ట్యూబ్‌ను బయటకు లాగి వాల్‌పిన్‌కి ఉన్న నట్‌ని విప్పి ట్యూబ్‌ని పూర్తిగా బయటకు తీసాడు. లెగ్ పంపు తీసుకొని ట్యూబ్‌కి గాలి కొట్టి లొత్తలు పడిన బేసిన్‌లో ఉన్న నీటిలో ముంచి ట్యూబ్‌ని రెండు మూడు సార్లు నీటిలో కలయ తిప్పాడు.

నీటిలోంచి సన్నగా బుడబుడ మంటూ బుడగలు బయటకు వచ్చాయి. పక్కనున్న కాల్చిపారేసిన అగ్గిపుల్లలను తీసుకొని ట్యూబ్‌పైన బుడగలు వస్తున్న రెండు చిన్న కన్నాలు దగ్గర రెండు పుల్లలను గుచ్చాడు. ట్యూబ్‌లోంచి గాలి తీసేసి కన్నాలు పడ్డ దగ్గర ఎమిరిపేపర్ హేండిల్‌తో గట్టిగా రుద్దాడు. ఆ రుద్దిన భాగంలో సొల్యూషన్ రాసి దానిపై రబ్బర్ పేచ్‌టేప్ అంటించి వాల్కనైజింగ్ చేసాడు. ట్యూబ్‌కి కన్నం పడ్డ దగ్గర రబ్బర్ పేచ్ టేప్ వేడికి కరిగి ట్యూబ్‌పైన కరిగిపోయింది. రెండు కన్నాలు పూర్తిగా మాయమయ్యాయి.

"వజీర్ భాయ్! వేగంగా పంక్చర్ పూర్తి చెయ్యి భాయ్! ఇప్పటికే మా ఆఫీసర్ నాలుగు సార్లు ఫోన్ చేసి చెడామడా తిట్టేసాడు" అంటూ బతిమాలాడు కష్టమర్.

"ఇంకో దో మినిట్ మే హెూజాయ్‌గా సాబ్!" అంటూ ఎప్పుడో వెళ్ళిన వాడు ఇంకా రాలేదని కోపంగా తిడుతుండగా రింగ్ రెంచి పట్టుకొని పరిగెట్టుకుంటూ వచ్చాడు అండా.

"అరే! సువర్‌కే బచ్చా! ఎప్పుడెళ్ళావురా! ఇత్నా దేర్ క్యోం హెూగయారే మాద్కేలవడే!" అంటూ అరిచాడు.

"నేను పరిగెట్టుకొనే వచ్చాను సాబ్! అయినా సింగిల్ సైడ్ ట్రాఫిక్ వల్ల, ఈ డివైడర్ చివరికెళ్ళి వచ్చేసరికల్లా దేర్ హెూగయా సాబ్!" అని భయపడుతూ సమాధానం ఇచ్చాడు. ఇంతకుముందు చేతిలో ఏ పనిముట్టుంటే దానితోనే ఎన్నోసార్లు సాబ్ కొట్టిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ.

"సర్లే! ఆ లెగ్ పంపు అందుకొని ట్యూబ్‌కి గాలి కొట్టు" అని అనగానే అండాగాడు కొంచెం ఆయాసపడుతూ కాలితో లెగ్‌పంప్‌ని బలంగా కిందికి నెడుతూ గాలికొట్టాడు. కొంచెం గాలి ఎక్కిన తర్వాత ట్యూబ్‌ని తీసుకొని రిమ్ము దగ్గరకు వచ్చాడు వజీర్.

రిమ్ము పైనంతా ఒక్కసారి చేత్తో తడిమి రిమ్ము స్పోక్స్ పుల్లల పైనున్న టేప్ పింపురుకి పాడైందని కష్టమర్‌కి చెప్పాడు. "ఇప్పుడవన్నీ వద్దులే.. ముందు ట్యూబ్ ఎక్కించు" అన్నాడు కష్టమర్. కొన్ని స్పోక్స్ పుల్లలు లూజుగా ఉండడంతో ట్రూయింగ్ నిప్పల్ రెంచిని అందుకొని లూజు అయిన పుల్లలను బిగించాడు. టైర్ లోపల, బయట చేత్తో తడిమి టైరుకు గుచ్చుకున్న చిన్న బుర్రమేకు బయటకు తీసి కష్టమర్‌కి చూపించాడు.

"దీనివల్లే మీ బండికి ప్యాచ్ అయ్యింది. లక్కీగా మీరు పేచ్ అయిన వెంటనే నడిపించుకొని వచ్చారు. లేదంటే టైరు, ట్యూబ్ రెండూ మార్చుకోవలసి వచ్చేది సాబ్!" అంటూ రిమ్ కన్నంలో ట్యూబ్ వాల్‌పిన్ దూర్చి టైర్‌లో ట్యూబ్‌ని సర్ది లీవర్లు తీసుకొని టైర్‌ని పూర్తిగా రిమ్‌లోకి లాఘవంగా దూర్చి ట్యూబ్ నిండా గాలికొట్టి బేక్‌వీల్‌ని సిద్ధం చేసాడు. బైక్ వీల్ క్రేంక్‌పైకి చైన్‌ని కరెక్ట్‌గా సర్ది, చెక్‌నట్‌లను రింగ్ రెంచీతో గట్టిగా బిగించాడు. బేక్ వీల్ బ్రేక్స్‌ని కూడా కరెక్ట్‌గా బిగించి బ్రేక్స్ కరెక్ట్‌గా పడుతున్నదీ లేనిదీ చెక్‌చేసి బండిని కష్టమర్‌కి అప్పగించాడు.

"ఎంతయింది?" అడిగాడు కష్టమర్.

"వంద రూపాయలు సాబ్!" అన్నాడు వజీర్.

"వంద రూపాయలా" అంటూ నోరెళ్ళబెట్టాడు కష్టమర్.

"సర్! రెండు పేచ్‌లకి ఏభై ఏభై కలిపి వంద సాబ్" అంటూ వంద ఎలా అయిందో వివరించాడు వజీర్.

"ఇంతకు ముందు ఇరవై, ఇరవై కలిపి నలభై తీసుకున్నావు, ఇప్పుడు వందా? చాలా ఎక్కువ." అన్నాడు కష్టమర్.

"మార్కెట్ రేట్లు బాగా పెరిగాయ్ సాబ్! ఇంకా ప్యాచీల వ్యాపారం కూడా బాగా తగ్గిపోయింది. రోజంతా పది ప్యాచీలు చేస్తే ఐదొందలు రాదు సాబ్! మరి మేమెలా బత్కాలి సాబ్" అన్నాడు వజీర్.

"సర్లే ఇదుగో వందా" అంటూ అయిష్టంగా అందించాడు.

పడ్డ కష్టాన్ని ఎవరూ చూడరు. వందా అంటూ నోరెళ్ళబెడతారంటూ గొణుక్కుంటూ జేబులో పెట్టుకున్నాడు వజీర్.

"అరే అండా! ఇందాక నువ్వు థామస్ కొట్టుకు వెళ్ళావు కదా! థామస్ భాయ్ ఉన్నాడా?" అంటూ అడిగాడు.

"హా ఉన్నారు సాబ్!" అంటూ సమాధానం ఇచ్చాడు అండా.

ఎదురెదురు కొట్లో వాళ్ళమే కానీ ఎన్నాళ్ళయింది వాడ్ని చూసి ఎలా ఉన్నాడో ఏంటో? అని తనలోనే తను అనుకుంటూ సామ్‌కో ఏక్ బార్ జానాహై ఉస్కా షాప్‌కో అంటూ ఇంకో బండి పేచ్‌కి వస్తే దాన్ని బాగుచేసే పనిలో పడ్డాడు.

◆ ◆ ◆

సాయంత్రం ఏడు గంటలకు థామస్ సైకిల్ షాపుకి వెళ్లాడు వజీర్.

"కైసేహెూ థామస్ భాయ్. కైసా చల్తాహై దందా" అంటూ

పలకరించాడు. “ఉదయాన్నే దర్వాజా ఖుల్తేహీ నీ చెహరా కన్పించాక ఆ దినమంతా ఖుషీగా ఉండేది. ఇప్పుడు అస్సల్ నీ ముఖం చూడాలంటేనే నెలలు పట్తోంది భాయ్” అంటూ చాన్నాళ్ళకి చూసిన మిత్రుడితో కరచాలనం చేసాడు.

“అవును భాయ్! నిన్ను కూడా చూసీ చాన్నాళ్ళయింది. హా! నువ్వెలా వున్నావ్? వ్యాపారాలు బాగా పడిపోయాయి. ఈ మధ్య సైకిల్ రిపేరు చేయించుకున్న వాళ్ళే తగ్గిపోయారు. వ్యాపారం ఏం బాగులేదు భాయ్” అంటూ ట్రూయింగ్ వీల్‌కి బిగించిన రిమ్ము నిప్పుల్‌ని బిగిస్తూ పేలవంగా సమాధానం చెప్పాడు థామస్.

“అసలికే వ్యాపారం బాగులేదని బాధ పడుతుంటే రోడ్ వైడెనింగ్ అని చెప్పి మన కొట్లు ముప్పాతిక జాగాని కొట్టేసి వెడల్పు చేసారు. కనీసం తలుపులు వేసుకోడానికి తగ్గ జాగా కూడా మిగల్లేదు. రోజూ రిపేరింగ్ సామాన్లు మోసుకొని ఇంటికి తీసుకెళ్ళి మళ్ళీ ఉదయాన్నే తీసుకొని రావాల్సి వస్తోంది. ఇంతకు ముందులాగ పనులు కూడా లేవు. ఆ కొద్దో గొప్పో పన్లు కూడా ఈ డివైడర్ పుణ్యమా అని రోడ్‌కి ఒక సైడ్ వాళ్ళే వస్తున్నారు. ప్చ్.... ఏం చేస్తాం చల్తీకా నాం గాడీ. ఇలాగే బతుకు బండీడ్వాల్సి వస్తోంది. సైకిల్‌కి రిపేరు చేయాలన్నా కనీసం నీడలేక ఎండలోనే రిపేరు చేస్తున్నా. ఎదురురెదురుగా ఉండేటోళ్ళం కనీసం రోజులో పదిసార్లయినా కలిసి మాట్లాడేటోళ్ళం. ఇప్పుడు వేరే వేరే ఊళ్ళలో ఉన్నట్లు ఎంత దూరం పెరిగింది మన మధ్య. అయినా అన్నీ నా విషయాలే చెప్తున్నా గానీ నీ వ్యాపారం ఎలా ఉంది?” అంటూ అడిగాడు వజీర్‌ని.

“ఏం చెప్మంటావ్ భాయ్. దినంకి పది ప్యాచీలైనా రావడం లేదు. ఇప్ప మోడల్ మారి ట్యూబ్‌లేని టైర్లు వచ్చేస్తున్నాయ్. ఇంక ఇప్పుడొస్తున్న బేరం కూడా తగ్గిపోతుంది భాయ్. మనం కొట్లు పెట్టిన ఆ పావలా, అర్ధ రూపాయికి ప్యాచీలు చేసిన రోజులే బాగున్నాయనిపిస్తుంది భాయ్. ఆ పావలా, అర్ధ రూపాయలతోనే రోజుకి నలబై, ఏబై సంపాదించి ఇంటికి నాల్గు పైసల్ పట్కెల్లేటోళ్ళం. ఇప్పుడు దినంకి నాల్గైదు వందలు వచ్చినా ఏ మూలకీ చాల్డం లేదు. ఏదో కష్టం సుఖం పంచుకోడాన్కి నీలాంటోళ్ళి కలవడానికి కనికరం లేకుండా ఈ డివైడర్ హమ్‌కో అలగ్ కర్‌దియా!

పురానే దినోంమే హం కైసే బితాయా హర్ దిన్. ఓ యాద్ ఆనేసే మస్త్ లగ్‌తాహై థామస్. మనిద్దరం ఒకే షావుకారి దగ్గర నెలరోజుల గేప్‌లో పనికి కుదిరాం. అప్పట్లో భాస్కరరావు సైకిల్ షాప్ అంటే బడానామ్, చుట్టుపక్కల దస్ పంద్రహ్ ఊళ్ళోలు అక్కడే సైకిల్ అద్దెకి తీసుకెళ్ళడం, సైకిల్ రిపేరు చేసుకుంటుండడం ఎంత హంగామా ఉండేది ఆరోజుల్లో. చుట్టుపక్కల ఎక్కడ సాదీ, సంబరాలు అయినా అక్కడే గేస్‌లైట్లు అద్దెకు తీస్కొని వెళ్ళేవారు” అంటూ పాత రోజులను గుర్తుకి తెచ్చుకున్నాడు వజీర్.

“అవును! అప్పుడప్పుడు నాకూ గుర్తుకు వస్తుంటాయి.. ఆరోజుల్లో రామతీర్థం శివరాత్రి జాతర టైంలో సైకిళ్ళు బాగా అద్దెకు వెళ్ళేవి. సావుకారు గారు కూడా అర్ధరాత్రి వరకూ మనతో ఉండి అర్ధరాత్రి వరకూ తనతో ఉన్న పనోళ్ళకి సైకిళ్ళు ఇచ్చి జాతరకి వెళ్ళి రమ్మనేవారు. మనం ఆ అర్ధరాత్రి సైకిళ్ళు తొక్కుకొని రామతీర్థం జాతరకి వెళ్ళి సరదాగా చెరుకులు, చెనగలు కొనుక్కొని ఎంతో సరదాగా గడిపిన ఆ రోజులన్నీ గుర్తొస్తున్నాయి” అంటూ పాత రోజుల్లోకి వెళ్ళాడు థామస్ కూడా.

“మన సావుకారిగార్కి కొంచెం కోపమెక్వయినా పని నేర్పేటప్పుడు బడా ధ్యాన్ సే సిఖాయా. కొన్చం చదువుకున్న వారైనందువల్ల శ్లోకాల్, పద్యాల్ పాడుతూ హుషార్‌సే పని చేసేవారు. థోడాసే కుచ్ గల్తీ హోనేసే, నహీతో రెంచీగానీ, పట్కారుగాని తప్పుగా పట్టుకుంటే మాత్రం ఒక్క మొట్టికాయ పెట్టేవారు. ఆ మొట్టికాయకి బుర్ర వాచిపోయేది. ఆ మెట్టికాయకి భయపడే సైకిల్ రిపేరింగ్ పని జల్దీసే సిఖాయా హమ్” అంటూ షావుకార్ని మననం చేసుకున్నాడు వజీర్.

“మనిద్దరం పెద్దయిన తర్వాత ఏక్ సమ్‌ఝౌతా భీ చేస్కున్నాం. నువ్వు సైకిల్ రిపేర్ చేయాలని, ఎదురు రోడ్లో నేను బళ్ళకు ప్యాచీలు వెయ్యాలని ఇరాదా లియా. తబ్‌సే ఎదురెదురుగా ఉన్నా ఒకే షాప్‌లాగ ఏ బేధాలు లేకుండా నీ షాప్లో సామాన్లు నేను వాడ్కున్నా, నా షాప్‌లోవి నువ్వు వాడ్కున్నా ఫికర్ లేకుండా ఉండేవాళ్ళం. ఇప్పుడు ఒక్క చిన్న రెంచి కావాలన్నా కమ్‌సేకమ్ కిలోమీటర్ దూర్ ఆనేసేహీ నీ షాప్‌కి రావడం కుదర్డం లేదు. దేశం ఎలిగిపోతుందని చెప్డాన్కి రోడ్లు వెడల్పు చేస్తున్నార్ కానీ, మనలాంటోళ్ళ బత్కులు, కొట్లు పోయి రోడ్లు పాలవుతున్నాయని ఏ గవర్‌మెంట్ నహీ సోచ్‌తాహై భాయ్” అంటూ బాధపడ్డాడు వజీర్.

“అప్పట్లో కొట్టు ఖులానేకే పెహ్లేహీ నువ్వు ఉద్యాన్నే కన్పించి ఏం వజీర్ భాయ్ ఎట్లా ఉన్నావని పలకరించే వాడివి. ఇప్పుడు నీ చెహరే చూడాలంటేనే ఎన్నో దినాలు పడుతోంది థామస్'' అంటూ తమ అనుబంధాన్ని గుర్తుచేసాడు వజీర్.

"అవును వజీర్! అల్లాహొ అక్బర్ అంటూ నమాజు మొదలయ్యేసరికి నువ్వు నమాజ్ చెయ్యడానికి పక్కనున్న మసీదులోకి వెళ్ళేవాడివి. శుక్రవారం వచ్చిందంటే ఒక పూటంతా మసీదులోనే ఉండిపోయేవాడివి. అప్పుడు నీ షాప్‌కి కష్టమర్ వస్తే నేనే దగ్గరుండి ప్యాచీ చేయించి పంపించే వాడిని" అని పాత విషయాలు జ్ఞాపకం చేసాడు థామస్.

"హా! మరి నువ్వు కూడా ఆదివారం వచ్చిందంటే ఉద్యం పూటంతా చర్చిలో ప్రేయర్‌కి వెళ్ళిపోయేవాడివి. మరి ఆ పూటంతా నీ సైకిల్ షాపు రిపేరు పని నేను చూసేవాడ్ని. మా బెహన్ లూసీ, నీ పిల్లలతో ఖుషీగా చర్చిలో ప్రార్థన్లు చేసి మధ్యాహ్నం భోజనాలు అయిన తర్వాత షాపుకి వచ్చేవాడివి. అవన్నీ ఇప్పుడు మారిపోయాయి.. గత సంవత్సరం నుండి మసీదుకి పోవడం లేదు థామస్. షాపు దగ్గరే బేసిన్లో పానీసే చెవ్వు, ముక్కు, కళ్ళ రాస్కోని జమీన్ పర్ రుమాలు వేసి మైక్ సౌండ్ సున్‌తేహీ నమాజ్ చేస్కుంటున్నా భాయ్. ఏ కైసా దిన్ ఆగయా! అగర్ దిల్ భర్ అల్లాకో నమాజ్ భీ నహీ కర్ సక్తా!" అంటూ ఆవేదన పడ్డాడు వజీర్.

"అవును నేను కూడా సండే క్వారల్స్‌కి చర్చ్‌కి వెళ్ళడం లేదు వజీర్. ఇప్పుడు సైకిల్ తొక్కేవాళ్ళంతా స్కూల్ పిల్లలే ఎక్కువగా ఉంటున్నారు. వాళ్ళందరికీ కూడా ఆదివారం నాడే సెలవు కదా! ఆ రోజే ఉదయమే కొంచెం బేరం అవుతోంది. మరి ఆ ఉదయం పూట కొట్లో లేకపోతే ఇల్లు గడవదు కదా!" అంటూ బాధపడ్డాడు థామస్.

మొన్న రంజాన్‌కి మీ బహెన్ లూసీ "ఏంటి ఈరోజు మీ వజీర్ కేరేజ్ పంపించలేదేం? ప్రతి సంవత్సరం పంపించే కేరేజ్ ఈ రోజు ఎందుకు రాలేదు" అని ఆరా తీసింది. అంటే నేను ఏదో సర్ది చెప్పాన్లే! కానీ నువ్వు పంపించే ఆ కేరేజ్‌లో పులావ్ నెయ్యి వాసన మూడు రోజుల వరకు చేతినుండి వచ్చేది భాయ్. పెద్దపెద్ద మటన్ ముక్కలు నేతిలో వేగిన తర్వాత పులావ్ వాసనకి ఘుమఘుమలాడి పోతుండేవి భాయ్".

వెంటనే వజీర్ మొహమాటపడుతూ "హా! థామస్! రెండు మూడు సంవత్సరాల కిందటి వర్కూ బిల్‌కుల్ దస్ కేరేజ్‌లైనా చుట్టుపక్కల కొట్లవార్కి, ఇళ్ళవార్కి పంపేవాడ్ని. ఎప్పుడైతే రోడ్ బడా కర్నా షురూ హువా తబ్‌సే సబీ బంద్ హొగయా! రోడ్లు వెడల్పు చేయడం వల్ల రెండు సంవత్సరాల్ రోడ్ల పక్క ఆ దుమ్ము, ధూళికి మన కొట్లోకి ఎవరూ రావ్డం లేదు. రోడ్లు వెడల్పు అయిన తర్వాత నిల్వడానికి నీడలేక చెట్టు కిందే కొట్టు పెట్టుకోవాల్సి వచ్చింది. తబ్‌సే బేరం పూరా పడిపోయింది భాయ్. నీ ఒక్కడికైనా కిందటి సంవత్సరం కేరేజు పంపించకపోతే ఒప్పుకోనంది మీ బెహన్. కానీ ఈ సంవత్సరం నీక్కూడా కనీసం పంపించలేకపోయాన్ భాయ్. మా ఇంట్లో కూడా రంజాన్‌కి తప్పనిసరిగా మటన్ లేకుండా పులావ్ వుండదు కానీ చికెన్ పులావ్‌తోనే ఈ రంజాన్ సరిపెట్టుకోవల్సివచ్చింది భాయ్" అంటూ బాధపడుతూ చెప్పాడు వజీర్.

"మరి నేను కూడా క్రిస్మస్‌కి కేరేజ్ పంపించలేకపోయాను వజీర్. మనిద్దరి పరిస్థితి ఒకటే. నేను కూడా కోడి పలావ్ తోనే క్రిస్మస్ చేసుకోవాల్సివచ్చింది. అందుకే సిగ్గుతో నీకు కలవడానికి రాలేక పోయాను" అంటూ థామస్ ఒకింత సిగ్గుపడూ చెప్పాడు థామస్.

"ఒకరి బాధలు ఒకరు చెప్పుకోడానికైనా ఎదురెదురు కొట్లలో ఉండి నెలలు గడిస్తేగానీ కలవలేకపోతున్నాం. కనీసం కమ్మవీధి జంక్షన్ దగ్గరన్నా అండర్ బ్రిడ్జ్ ఇచ్చుంటే కొంచెం దూరం నడిచైనా వచ్చి కలుస్కో గల్గేవాళ్ళం. ఇప్పుడు కలవాలంటే కనీసం ఇటు కిలోమీటరు, అటు కిలోమీటరు దూరం వస్తేగానీ కలవలేకపోతున్నాం." అన్నాడు" వజీర్ థామస్‌తో.

"నువ్వు ఈ మాత్రం దానికే బాధపడుతున్నావు. నాకు ఈ మధ్యనే కొత్త భోగట్టా తెలిసింది తెలుసా!" ఏంటని ఆతృతగా అడిగాడు వజీర్.

"వైజాగ్ నుండి పాలకొండకి నేషనల్ హైవే వస్తోందట. అప్పుడు ఇప్పుడున్న ఈ రోడ్డు ఆరు రోడ్లు అవుతుందట. మధ్య నుండి నెల్లిమర్ల వరకు ఫ్లై ఓవర్ కూడా వస్తుందట. అప్పుడు మన షాపులు పూర్తిగా పోవడమే కాకుండా మన వెనకాల ఉన్న ఇళ్ళు కూడా పది అడుగులు పైగా పోతాయట. అంటే అప్పుడు నువ్వు ఆ చెట్టుకింద నిలబడి ప్యాచీలు చెయ్యడానికి కూడా నిలువ నీడ ఉండదన్నమాట. పోనీ ఈ ఊరి చివర ఆ శ్మశానం దగ్గరో, ఆ పోడుబడ్డ బోడమ్మ బంగ్లా దగ్గరో షెడ్ వేసుకోవాలనుకున్నా, ఈ మధ్య కార్పొరేషన్ అయిన తర్వాత రోడ్డు పక్క ఏ బడ్డీగానీ, షెడ్‌గాని వేస్తే కార్పొరేషన్ వాళ్ళు రాత్రికి రాత్రి పొక్లెయిన్‌తో ఎత్తి ఊరవతల విసిరేస్తున్నారు. ఏంటో ఊరు బాగుపడ్డం అంటే జనాలకి కనీసం నిలువ నీడలేని డివైడర్లను కట్టడం కాబోలు" అంటూ నైరాశ్యంతో చతికిల పడ్డాడు థామస్. ■

## కవి

పదాలకు లాలపోసి
వాక్యాలతో రెండుజడలేసి
కవిత్వం బుగ్గమీద
చుక్కపెట్టే అమ్మ

పద్యాన్ని భుజంమీదికెత్తుకొని
గుండెలమీద తన్నించుకుంటూ
మురిసిపోయే నాన్న

అక్షరాల కొండమీద నిల్చుని
వాక్యాలను కిరణాలుగా కురిపిస్తూ
ప్రకృతికి ఎర్రచీరను చుట్టే సూర్యుడు

అక్షరాల ఆకాశాన్ని
వాక్యాల దారంతో చుట్టి
రాత్రికి తెల్లరంగునద్దే చంద్రుడు

కవిత్వపు రంగులను
రెక్కలకు కట్టుకొచ్చి
పద్యం పూవు మీద వాలే సీతాకోక

అక్షరాల సాళ్ళ నడుమ
పదాల విత్తులు జల్లి
పైరుగాలులతో పద్యమల్లె కూలితల్లి

పదాలను
భుజంమీది కండువాలా వేసుకొని
వాక్యాలను గడ్డిమోపుగా కట్టి
పద్యాన్ని పాలిచ్చె బర్రెను చేసి
సాయంకాలం పూట
ఇల్లు చేరే రైతన్న

అక్షరాన్ని నరనరాన నింపుకొని
దేహాన్ని పదాలుగా పేర్చుకొని
కవిత్వమే జీవితంగా
జీవితమే కవిత్వంగా బతికే పద్యం!

- తండ హరీష్ గౌడ్
89784 39551



## వ్యత్యాసం

- లై
94919 77190

ఒక గట్టు నుంచి
ఇంకో గట్టుకు దూకుతున్నప్పుడు
రెండు కాళ్ల మధ్య దూరం
కొన్ని బంధాలు
విశ్వాసాలు, నమ్మకాలు
అన్నీ చెదిరిపోయిన మేఘాలే
వాన చినుకులే!

అన్యాయంగా దూకడానికి
ప్రేమగా జొరబడటానికి
ఎంత వ్యత్యాసం?

బహుశా
కన్నుకు చూపుకు ఉన్నంత కావచ్చు
కన్ను మంచిదే
మరి చూపు?
కింద ఎవరో
ఎగురుతున్నారు
మరి అదేంటో!

## సమీక్ష






# అస్తవ్యస్త వర్తమానంపై గళమెత్తిన కలం


- జంధ్యాల రఘుబాబు
98497 53298


**పా**తికేళ్ళుగా కవిత్వం రాస్తూ, గత పదేళ్ళకు పైగా వేగం పెంచి కవిత్వంతో తన కలాన్ని పదును పెట్టుకుంటూ విరివిగా అక్షరీకరిస్తున్న కవి చందలూరి నారాయణరావు. పద్యమనే అడ్డుగోడల్ని చీల్చుకు వచ్చిన కవిత్వానికి కూడా గోడలు కడదామని ప్రయత్నించే వాళ్ళని నిత్యం చూస్తున్నాం. కానీ ఆ గోడలని లెక్క చేయకుండా తాను రాస్తున్న కవిత్వంలో వస్తువును మింగేయకుండా పాఠకుడికి చేరువౌతూ తన సొంతమైన శైలీ, శిల్పాలను తయారు చేసుకుంటూ అప్రతిహతంగా ముందుకు సాగుతున్న కవిగా కూడా చందలూరిని చూడవచ్చు.

"మనం కాసేపు మాట్లాడుకుందాం" సంపుటి ఈయన మొదటి పుస్తకం. ఇందులో "ముందస్తు ముసురు" మొదలు "మరమరాలు" దాకా 54 కవితలున్నాయి. ఆవిష్కరణ కవితతో ఆరంభిస్తే, "గతం పాఠమై చదివిస్తుంది/ దృశ్యమై కనిపిస్తుంది/ కలగా కవ్విస్తుంది/ అదే వర్తమానం" అంటూ దాని కొనసాగింపుగా "వర్తమానంలో గతాన్ని/ నెమరేసుకుంటూ జీవితం సాగితే / భవిషత్తు చిరునవ్వుతో ఆహ్వానిస్తుంది/ మౌనంగా మాటాడుతుంది/ తుదకు తనకు తానుగా/ జీవితం నీ ఎదుట ఆవిష్కరించుకుంటుంది" ఇలా భూత, భవిష్యత్, వర్తమానాలను ఒకేచోట చూపిస్తారు.

"పాఠశాలలా? ప్రచార వేదికలా?" అంటూ ఒక ఉపాధ్యాయుడిగా తన బాధను ఇలా చెబుతారు. అధికారుల వాహనం ఏదొచ్చినా "బడిగంట ముందే ముస్తాబై/ మోగేందుకు గొంతు సవరిస్తుంది/ టైం టేబుల్లో బలికాబోయే పీరియడ్స్/ బిక్క మొఖం వేసుకొని దిక్కులు చూస్తూ/ బాధను దిగమింగుకుంటున్నాయి" అని బడి ఒక రాజకీయ వేదిక కావడానికి సిద్ధమైందంటారు. "ప్రభుత్వ రాజపత్రాలకు ముందడుగు ఇక్కడే వేయాలి/ అధికారపు రాజకీయ పథకాలకు/ ముందుమాట ఇక్కడే రాయాలి" అని వాపోతారు. "తెల్ల ముఖము వేసిన నల్లబల్లపై రాతలు/ సుద్దముక్కతో చేరి/ మధ్యలో ఆగిన పాఠానికి తమ సంతాపాన్ని తెలిపాయి/ రెక్కలు ముక్కలైన ఫలితంలేని పాఠాన్ని చూసి విరక్తి చెంది/ పొడిపొడిగా తన గొంతును తానే నిలుపుకుంది" ఇలా చదువుల ముంగిళ్ళు ఎలా రాజకీయ వేదికలవుతున్నాయో చూపిస్తారు. ఇక్కడే మనకో విషయం గుర్తొస్తుంది. మొండిగా తెరిచిన పాఠశాలల వల్ల ఇప్పటికే రెండు వందలమందికి పైగా ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోయారన్న అంశంతో జోడిస్తే సమకాలీనతకు పనికొచ్చే కవితగా కూడా దీన్ని చెప్పుకోవచ్చు. కవిత ముగింపులో "అధ్యయనం అంపశయ్యపై చేరింది/ ఉపాధ్యాయుడికి ఊపిరిపోసి/ బడిని బతికించండి" అన్న పంక్తులు చదివితే ఉపాధ్యాయుల ఊపిరి తీసింది ఎవరు అన్న ప్రశ్న మనల్ని వెంటాడుతుంది. యుటిఎఫ్ ఐక్య ఉపాధ్యాయ ఏప్రిల్ 2018లో వచ్చిన కవిత ఇది.

"నీకు నీవే జవాబు" అనే కవితలో లోకం అందంగా ఉన్నా బలహీనతలకు గురిచేయాలని చూస్తుందంటూనే "తనకు తానుగా పెనవేసుకుని/ ముడులు వేసుకుని/ పరిగెత్తిస్తుంది/ పరుగులు తీయిస్తుంది/ ప్రవాహ పరిచయాలతో/ లోతెంతో ఎరుగని/ పరీవాహకాలవైపు నెట్టుకు" పోతుందంటారు. చివరికి లోకం ఏమన్నా సహాయం చేస్తుందా అంటే "ప్రతి క్షణం ఎదురయ్యే ప్రతి ప్రశ్నకు/ ఎక్కడా ఎవ్వరూ జవాబు ఇవ్వలేరు/

స్వానుభవాల బలగాలతో సాగిపోతూ/ నీకు నీవే జవాబుగా మారాలి" అని లోకం నిజరూపాన్ని చూపి ముగిస్తారు. మహాకవి శ్రీశ్రీ కవిత ఆః లో లోకం గురించి ఎనిమిది పంక్తుల్లో చెప్పిన కవితలాంటి ప్రయోగాలు కవులు చేయాలి. అలాగే కవితపై కవిత రాయని కవి ఉంటాడా? చందలూరి రాసిన 'కవిత' చూడండి : "కిటికీలోంచి ఎగిరిన మనసు/ ఊరంతా తిరిగి తిరిగి/ సాయంత్రం తెల్లకాగితంపై వాలింది/ ఏరుకొచ్చిన సంగతులను/ నాల్గక్షరాలుగా పొదగ్గా/ అవి వాక్యాలుగా ఎదిగి/ రెక్కలచ్చిన పక్షులుగా/ చైతన్యం పంచుతుంటే/ ఆ పసిడి కులుకుల కువకువలకు/ ఏమని పేరు పెడదాం!/ కవిత అంటే సరిపోదూ" అని తన భావుకతను అభివ్యక్తిని చూపిస్తారు.

భావ కవిత్వం ప్రభావం కవుల చేత అప్పుడప్పుడూ కొన్ని మూగ కవిత్వాలు రాయిస్తుంది. "మూగవై నాలో మారుమ్రోగుతుంటావు" కవితలో "కనిపిస్తావు.../ ఏదో అనిపిస్తావు/ నాలో పిలుపై పలకరిస్తావు" అని మొదలుపెట్టి మూసిన కనుల మాటున మాయమవడం, కనుల బాసకు అనువాదం చేయడం, గుండెకు గొంతుకు నడుమ శబ్దాన్ని శూన్యం చేస్తావంటూనే ఇలా ముగిస్తారు : "అందాకా.../ గాయపడ్డ భావాల్లో/ ఎద ముంగిట ప్రోగుబడ్డ గేయాల్లో/ రహస్యంగా నిను దాచుకుంటాను/ ఈ జన్మలో కంపించేదాకా.../ మరు జన్మలో కలిసొచ్చేదాకా" అంటూ తన భావుకతను బహిర్గతం చేస్తారు. "అద్వైతం" కవితలో "గోడ మీద ఉన్న దేవుడి బొమ్మ మీదుగా/ నాన్నను చూశా/ అలసి సొలసిన అరమోడ్పు కన్నుల్లో/ ప్రస్ఫుటంగా వినిపించే/ హృదయ స్పందనలను విని/ ఇద్దరికీ భేదం లేదని గుర్తించా/ అద్వైతాన్ని అనుభవించా" నాన్నే దైవమని చెబుతారు. "కల" కవితలో బాల్యాన్ని గుర్తు చేసుకుంటారు. "కంటి గూటిని విడిచి వెళ్ళిన నిద్ర/ రాత్రంతా కనిపించకపోవడంతో/ నిశ్శబ్దాన్ని తోడు చేసుకొని బాల్యమంతా తిరిగొచ్చి/ పాత దృశ్యాలతో శుభ్రపడిన కళ్ళు/ కొత్త కలకోసం ప్రయాణమవుతుంటే/ మట్టిలో పొర్లాడుతున్న మనసు/ పరిగెత్తుకుంటూ ఎదురొచ్చి/ మట్టివాసనను మూటగట్టి/ కమ్మని కలతో తిరిగి రమ్మని/ వీడ్కోలు పలికింది" అని దారి పొడుగునా జారిపోయిన రోజుల గురించి చెబుతారు. "కలల కళ్ళు మూతపడ్డాయి/ కంటి గూళ్ళు తెరుచుకున్నాయి/ కళ్ళు మగతకు/ మనసు నిద్రకు/ మత్తుగా నడిచివెళ్ళాయి" అన్న ముగింపుతో కళ్ళు, మనసు, కల, మగతల మధ్య బంధాన్ని బాంధవ్యాన్ని పొందికైన పదాలతో చెబుతారు.

సాధారణంగా ఏ కవితో, కథానికో రాయడం ఓ "ప్రసవ వేదన"గా అభివర్ణించుకుంటారు కవులు. కానీ ఒక దినపత్రిక ముద్రణ పూర్తవడాన్ని ప్రసవ వేదనగా పోలుస్తారు నారాయణరావు. "ఓ వార్త ఆకృతికై/ ప్రతి రాత్రి పడే ప్రసవ వేదనే దినపత్రిక/ ఓ పాపం../ ఓ నేరం.. / ఓ ఘోరం../ సమాజానికి రోజూ ఏదో ఒక గాయం/ కెమెరా సాక్షిగా సంఘ విద్రోహాన్ని/ నిలదీయడమే తన లక్ష్యం, లక్షణం" అని "ఏ సిరాలో సుదులు తిరిగో/ మునివ్రేళ్ళ మొనల మధ్య/ అక్షరం అచ్చులో పదును తేలుతుంది/ నేతలమని రోళ్ళు తెరచి/ రాతలపై రాళ్ళు రువ్వితే/ అక్షరం ఆయుధమై/ నేతల తలరాతలు మారుస్తుంది/ జనజాగృతిలో మమేకమై/ దేశానికి జవజీవాలు అందిస్తుంది" ఖబడ్దార్ అన్నట్టుగానే ముగిస్తారు. 2002లో రాసినా సమకాలీనత కలిగిన ఇంకో కవిత "బుసకొట్టే కల్చర్". ఇందులో విద్యావ్యవస్థ మార్పులనూ, పరభాషా చదువులనూ, కాన్వెంటు చదువులనూ నిరసిస్తూ "పరభాషా భక్ష్యంతో/ పరగడుపునే కక్కుతూ/ బలవంతపు లక్ష్యానికి/ తరుముతున్న కలికాలపు చదువులు/ తిరిగిరాని బాల్యాన్ని/ దుమిసివేసే అంకుశాలు" అంటూ ఇంట్లో తల్లిదండ్రుల ఆశలు కూడా కారణమని చెబుతారు. ఈ కవిత చదువుతూ ఉంటే నేడు ఇంగ్లీషు మీడియం తప్పనిసరి చేస్తామన్న పాలకుల మాటలు గుర్తొస్తాయి.

ఇక "శీర్షిక కవిత మనం కాసేపు మాట్లాడుకుందాం..."లో "మనసు తీరాల్లో నిలబడి/ కలల కడలిని పరికిస్తూ/ మూగ తెరల్ని తెంపుకొని/ మాట పొరల్ని ఒలుచుకొని/ మనం కాసేపు మాట్లాడుకుందాం!", జీవితంలో "బాధల మేట కింద నలుగుతున్న వాస్తవాల వెలికి తీత కోసం/ మనం కాసేపు....", "మనో ప్రపంచంలో మరో ప్రపంచం కోసం/ పరుగులు తీస్తున్న మనసులతో/ మనం కాసేపు..." చివరగా "అనుభవ ముద్రలో దాగని సత్యాలు దాగని దృశ్యాలు/ మరోసారి ముఖచిత్రాలై ముంగిట మురిపిస్తుంటే/ మనం కాసేపు మాట్లాడుకుందాం". ఈ కవిత 2015లో రాసింది. ఆరేళ్ళ తరువాత ఇప్పటి సెల్లుల ప్రపంచంలో మనం కాసేపు మాట్లాడుకుందాం అన్నట్టుగా ఉంది. కవితా సంపుటిలో అక్కడక్కడా భౌతికవాద దృష్టి కనిపించినా ఈ కవి దాన్ని ఇంకొంత పెంచితే మరెన్నో ప్రజాప్రయోజనమైన కవితలు తప్పకుండా రాస్తాడని అనిపిస్తుంది. . ■

**కవిత**

## ఏడు పదులు

**బా**విలోంచి బానలోకి వచ్చిన నీళ్ళు
కాలువలోకి జారిపోగా
బానకు కరుచుకున్న కొన్ని బొట్లే కదా
బానకు సొంతం!
చెట్ల ఆకులు
వడగాలికి సుడిగాలికి
కొట్టుకొని పోగా
కొమ్మలకు అతుక్కున్న ఆకులే కదా
చెట్టుకు సొంతం!
దోసిట్లో పడిన మంచినీళ్ళు
వేళ్ళసందుల్లోంచి జారిపోగా
కడుపులోకి చేరినవే కదా
కడుపు సొంతం!

గొర్రెల మందకు
ఎంత కాపలా కాసినా
నక్కలూ తోడేళ్ళూ
తినేయగా మిగిలినవే కదా
మందడి సొంతం!
కష్టపడి పండించిన పంట
ఎలుకలూ మెంట్రవలూ
కొరికేయగా మిగిలినదే కదా
రైతు సొంతం!

వర్షమెంత కురిసినా
పొంగిన నీళ్ళన్నీ దొర్లిపోగా
కల్జు దాకా మిగిలిన నీళ్ళే కదా
చెరువు సొంతం!
ఏళ్ళ తరబడి చదివిన చదువు
మరపు మరుగున పడిపోగా
మిగిలిన పిడికెడు అక్షరాలే కదా
చదువరి సొంతం!
ఏడు పదుల జీవనయానంలో
కూడా నడిచినవాళ్ళంతా ఆగిపోగా
ఆగకుండా అనుసరించే ఆమే కదా
ఆయన సొంతం!



**- రాచపాళెం చంద్రశేఖరరెడ్డి**



### గుర్రం జాషువాపై సాహిత్య వ్యాసాలకు ఆహ్వానం

**క**వి కోకిల, కవితా విశారద, నవయుగ చక్రవర్తి పద్మభూషణ్ గుర్రం జాషువా 50వ వర్ధంతి. జూలై- 24-2021 సందర్భంగా ప్రజాకాంక్ష ప్రత్యేక సంచిక తీసుకుని వస్తుంది. 'గుర్రం జాషువా సాహిత్య విశిష్టత', 'గుర్రం జాషువా 'జీవితం సాహిత్యం' 'సమకాలీన సమాజంలో జాషువా పాత్రపై మీ విలువైన రచనలు, కవితలు జూలై 5-2021 లోపు sonytangirala@gmail.comకు డిటిపీ ఫార్మెట్ లేదా టైపు యూనికోడ్ ఫాంట్‌లో ఓపెన్ ఫైల్ పంపగలరు. వివరాలకు తంగిరాల సోని, 96766 09234.




# సీమ కవిత్వ చైతన్యమే జలగండం, జలస్వప్నం

డాక్టర్ రాధేయ

**ఆం**ధ్రదేశపు జనాభాలో రాయలసీమ జనాభా 18 శాతం. రాయలసీమలో సరాసరి వర్షపాతం 20 నుంచి 25 అంగుళాలు మాత్రమే! గత 30 ఏళ్లుగా రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో సగం వర్షపాతం కూడా ఉండటం లేదు. వర్షాభావం కారణంగా భూగర్భ జలాల నీటిమట్టం రాయలసీమలోని అన్ని ప్రాంతాల్లో చాలా త్వరితంగా తగ్గిపోతుంది. రాయలసీమ ఒకప్పుడు రతనాల సీమ, ఇప్పుడేమో రాళ్ల సీమ. రాయలసీమ కరువు సీమగా కక్షల సీమగా, హత్యల సీమగా, ఆత్మహత్యల సీమగా, మారణ హోమాల సీమగా, దోపిడీలు దౌర్జన్యాల సీమగా, రాజకీయాల సీమగా ప్రసిద్ధికెక్కింది.

రాయలసీమలో చెరువులు ఉన్నా చెరువులో నీళ్లు ఉండవు, బావుల్లో నీళ్లుండవ్. కాలువలున్నా పంట పొలాలకు నీళ్లు సాగవు. సామాన్య ప్రజలకు తాగేందుకు నీళ్లు ఉండవు. తినేందుకు తిండి ఉండదు, కట్టుకునేందుకు బట్ట ఉండదు, ఉండేందుకు ఇల్లు ఉండదు. అయితే అక్కడ బతికే భూస్వాములు, వ్యాపార వేత్తలు, రాజకీయ నాయకులు మాత్రం కోట్లు గడుస్తూనే ఉంటారు. కరువు కాలంలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస పోవడం, పశువులమ్ముకోవడం, ఆస్తులమ్ముకోవడం సర్వ సాధారణం. కరువు కాలంలో సన్నకారు రైతులు కూలీలుగా, బిచ్చగాళ్ళుగా మారిపోతుంటారు. కొంతమంది పుట్టినగడ్డ మీద బతకలేక, పొట్ట చేత పట్టుకొని నగరాల్లో సెక్యూరిటీ గార్డులుగా, ఆటో డ్రైవర్లుగా పనిచేయడానికి సిద్ధపడుతూ ఉంటారు. ఒకవైపు అనావృష్టి, మరోవైపు పాలకుల నిర్లక్ష్యం. వీటికి తోడు సాంఘిక వెనకబాటుతనం... ఇవన్నీ కలగలిసిన ఒక భయానక బీభత్స వర్ణచిత్రం రాయలసీమ జీవితం.

రాయలసీమ వెనుకబాటుతనానికి అనేక కారణాలున్నా, మనం ప్రధానంగా నీటి సమస్యను మాత్రమే చర్చిస్తున్నాం. ఎందుకంటే ఇది అత్యంత మౌలిక సమస్య. నీరు లేని చోట సంపద అభివృద్ధి చెందదు. సంపద లేని చోట ఆరోగ్యం, విద్య, మొదలైన ఎన్నో అంశాలు అభివృద్ధి చెందవు. నీటి పారుదల రంగంలోనే కాకుండా ఇతర రంగాల్లో కూడా రాయలసీమ పట్ల తీవ్ర నిరాదరణ కొనసాగుతూనే ఉంది.

20వ శతాబ్దం తర్వాత రాయలసీమలో వచ్చిన సాహిత్యంలో మనకు సీమ ప్రాంత కవితా చైతన్యం కనపడుతూ ఉంది. ఈ క్రమంలో ఎన్ని కావ్యాలు వచ్చినా జీవిత చిత్రణలో, భాషలో, భావ వ్యక్తీకరణలో రాయలసీమ జీవితానికి ప్రాతినిధ్య కావ్యంగా విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట' ప్రసిద్ధమైంది. ఈ కావ్యం 1956లో ప్రచురితమైంది. 20వ శతాబ్దంలో కండగల కావ్యభాషగా సృష్టించుకున్న అతి తక్కువ కావ్యాల్లో 'పెన్నేటి పాట' ఒక్కటిగా చెప్పుకోవచ్చు. పెన్నా నదీ స్వభావమే రాయలసీమ స్వభావం. ఈ నది రాయలసీమ ప్రజల విషాద జీవితానికి ఒక పెద్ద సంకేతం. "అదే పెన్న అదే పెన్న/ నిదానించి నడు/ వట్టి ఎడారి తమ్ముడు .." అంటుంది కవి కంఠం. ఈ కావ్యాన్ని విద్వాన్ విశ్వం గారు వచన పద్యంగా రాయడం ఒక విశేషం. ఆ తర్వాత 1970 దశకం నుంచి రాయలసీమ జీవిత చైతన్యం వచన కవిత్వంగా, పద్య కవిత్వంగా వచ్చింది. ఇందులో అనేకమంది సీమకవులు, కథకులు, నవలాకారులు ఉన్నారు. కథ, నవల ప్రక్రియ కంటే కవిత్వమే ఇక్కడ ప్రధానంగా నిలబడింది. రాయలసీమ కవిత్వంలో కొన్ని ప్రత్యేక అంశాలు ఉన్నాయి సీమ కవులు రాధేయ, ప్రేమ్‌చంద్,

రఘుబాబు, మధురాంతకం రాజారాం, కేతు విశ్వనాథ రెడ్డి, పులికంటి కృష్ణారెడ్డి, బండి నారాయణ స్వామి, మల్లెల నరసింహమూర్తి, శాంతి నారాయణ, దాదాహయాత్, సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి, గోపిని కరుణాకర్, నాగప్ప గారి సుందర్రాజు, సడ్లపల్లి చిదంబర రెడ్డి, రాప్తాడు గోపాలకృష్ణ, జి వెంకట కృష్ణ, పలమనేరు బాలాజీ, రాజారామ్, చంద్రశేఖర శాస్త్రి, షమీ ఉల్లా, లోసారి సుధాకర్, యాములపల్లి నర్సిరెడ్డి, కొత్తపల్లి సురేష్, పల్లెపట్టు నాగరాజు మొదలైన కవులు, రచయితలు సీమ ప్రజల జీవన వైవిధ్యం గురించి మంచి రచనలు చేశారు. అత్యంత నిజాయితీగా సీమ జీవన వాస్తవికతను ఆవిష్కరించారు. రాచపాలెం చంద్రశేఖర రెడ్డి, సూర్యసాగర్, సింగమనేని నారాయణ, వల్లంపాటి వెంకట సుబ్బయ్య వంటి మేధావులు, సాహిత్య విమర్శకులు కూడా సీమ వేదనను తమ వ్యాసాల్లో విమర్శల్లో ప్రకటిస్తూనే వచ్చారు. కొందరు కవులు దీర్ఘ కావ్యాలను కూడా ప్రకటించారు. వారిలో రఘుబాబు–సంఘటిత స్పర్శ, వై శ్రీరాములు – జలగండం, జి.వెంకటకృష్ణ–హంద్రీ గానం, యాములపల్లి నర్సిరెడ్డి – ఓరుప్పోటు ను చెప్పుకోవచ్చు.

మన సీమకవి సౌభాగ్య 1986లో తన సంధ్యా బీభత్సం అనే కవితా సంపుటిలో అనంతపురంను అనంతపూర్‌గా చమత్కరిస్తూ ఇలా రాస్తాడు. **"ఎందు కొమ్మల్లా మనుషులు/ ఎక్కడికో సాగిపోతారు/ ఆంధ్రదేశంలో ఆఫ్రికా దృశ్యాల్ని ఆవిష్కరిస్తాయి/ నీళ్ళకు బదులు నిప్పులతో పంటలు పండితే ఇక్కడ వర్ష రాహిత్యానికి వసంతాలు నీల్లాడతాయి/ ఏ గంధర్వుడో వచ్చి మధుర గానంతో ఎప్పటికైనా ఈ రాళ్లను కరిగించక పోతాడా అని ఆకాశం కేసి ఇక్కడి జనం ఆశగా చూస్తూ ఉంటారు."** రాయల సీమలోని నీటి సమస్యను కవితా వస్తువు తీసుకొని రాసిన ఇద్దరు సీనియర్ కవుల కవిత్వం గురించి ఈ వ్యాసంలో విశ్లేషించుకుందాం. ఎక్కలూరు శ్రీరాములు రాసిన 'జలగండం', మల్లెల నరసింహమూర్తి రాసిన 'జలస్వప్నం'.. ఏక కాలంలో (2004) రావడం ఒక విశేషమైతే, రెంటి కవితా వస్తువు కూడా 'జలం' కావడం మరొక విశేషం.

1974లోనే 'రంగుల పక్షి' కవితా సంపుటితో అనుభూతుల ప్రపంచాన్ని ఆవిష్కరించిన కవిగా తనదైన ఒక ప్రత్యేక ముద్రను ఏర్పరుచుకున్న కవి ఎక్కలూరు శ్రీరాములు. రంగులపక్షి కవిత్వంలో తనకిష్టమైన కవి శేషేంద్ర ముద్ర బలంగా కనపడుతుంది. 30 ఏళ్ల విరామం తర్వాత వచ్చిన జలగండం దీర్ఘ కావ్యంలో సొంత ముద్ర, అభివ్యక్తి, శిల్పమే మనకు కన్పడుతుంది తప్ప ఎవరి ఛాయలూ అగుపించవు. చిన్న చిన్న వాక్యాల్లోనే ఈ కవి అనంత కవితా విష్ఫోటనాన్ని దర్శింపజేస్తాడు. ఇది ఒక కొత్త చూపుగా అభివర్ణిస్తారు ప్రముఖ కవి నగ్నముని తన ముందుమాటలో. ప్రపంచీకరణ దురాక్రమణతో పంచభూతాలు సైతం కార్పొరేట్ వ్యాపారానికి కట్టు బానిసగా మారిన విషాదాన్ని తీవ్రంగా అధిక్షేపిస్తూ తన రెండు పాదరక్షలతో నమస్కరిస్తూ పాఠకుల్ని కావ్యంలోకి ఆహ్వానిస్తాడు కవి.

ఈ కావ్యానికి తను రాసుకున్న సుదీర్ఘ పీఠికలో రాయల సీమ జనజీవన విషాదం, సీమలోనే అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాలోని ఆకలి చేసిన చేస్తున్న హత్యల్ని, ఆత్మహత్యల్ని, ప్రభుత్వ వైఫల్యాల్ని తీవ్రగా విమర్శిస్తూ ప్రజల్ని చైతన్య వంతుల్ని చేసే ఆలోచనల్ని రగిలిస్తాడు కవి.

**జలం కరువైన సీమకు రుతువులు లేవు**
**ఉన్నదల్లా ఒకే ఒక్క ఋతువు**
**అదే కరువు ఋతువు, ఆకలి ఋతువు**

ఇక్కడ వర్షాధార పంట వేరు శెనగ. సకాలంలో వానలు రావు. పంటలు రావు. ఒకవేళ వచ్చినా అప్పులు తీర్చలేని అరకొర దిగుబడులే!

**మట్టిలో విత్తనాలు విత్తితే**
**గుత్తులు గుత్తులుగా**
**వేరుశెనగ పండుతుందనుకున్నాం**
**కరువు కత్తులు మొలిచి**
**కుత్తుకలు తెగి పడటం రోజూ చూస్తున్నాం**
**ప్రతి పూట పస్తున్నాం**
**ప్రతి ఏటా చేస్తున్నాం పుట. 3**

**కరువు సీమలో కాలాలు ఎన్నున్నా**
**సీమకు ఒకే ఒక కాలం అది ఎండాకాలం**
**భగభగ మండే కాలం**
**ఒక్క నీటి చుక్క నేలపై రాలని కాలం**
**ఒక్క చిన్న మొక్క నేలలో మొలవని కాలం**
**వేరుశెనగ పండితే చాలు వేరే పంట అక్కర్లేదు**
**రాగులు పండితే చాలు/ రతనాలు అవసరమే లేదు**
**మూడు మూటలు వేరుశనగ ఇత్తినా**
**ఒక్క మూట ఉత్పత్తి కూడా ఉత్తుత్తేనా**
**రాయలసీమలో వానారాదు**
**రాళ్ల బతుకుల్లో అప్పు తీరదు పుట..7**

ఇక్కడ నాగలికే కాదు, నాలుకకి దాహం తీరదు. విత్తనాన్ని సుత్తితో కొట్టిన సరే భూమిలోకి దిగదు. ఇక్కడ వాన కాదు రైతుకు మోసం చేస్తున్నది రాజకీయం చేస్తున్నదే అసలైన ద్రోహం అంటాడు కవి. "ఈ సీమలో ఎన్నో చెరువులు, సముద్రాలున్నా నీళ్లు లేవు/ సీమ మనుషులు వలస పక్షులు/ నిరంతర

క్షామపీడితులు/ కనుచూపు మేరంతా గడ్డ కట్టిన కరువు" అంటున్న కవి. పాలకులు ఉలిక్కిపడేలా పచ్చి నిజాల్ని నిర్భయంగా చెబుతాడు కవి.

ప్రభుత్వానికి చెల్లించే పన్నులు ప్రజల నుంచి వచ్చినవే అయినప్పుడు వాటిని ప్రజల అవసరాలకు ఖర్చు పెట్టాలి, అప్పుడు ప్రజలు అప్పులు చేయవలసిన అవసరం ఏముంది? ఆ అవసరం కనిపించడమే ప్రభుత్వాల అసమర్థత నిదర్శనం అంటాడు. **"దేశంలో/ మత్తు మందు కోసం, సారా కోసం/ ఖర్చు చేసే మొత్తంలో/ పదో వంతు మంచినీళ్ల కోసం వచ్చిస్తే ఇక్కడ పచ్చగా బతకవచ్చు రైతు." పుట.13.** ముఖ్యంగా ఆనంతపురాన్ని గురించి చెబుతూ.. ఇక్కడ ప్రతి ఇల్లూ చూపుకు నోచుకోని చీకటి నేత్రం, ప్రతి పల్లె చదువూ సంధ్యలు లేని క్షతగాత్రం అంటాడు.

**"దు:ఖం దుర్భిక్షం కెరటం/ ప్రతి దృశ్యం కన్నీటి సముద్రం/ ఆకలి మూకటిలో/ కటిక చీకటి తాండవిస్తున్న ప్రపంచం అనంతపురం/ ప్రతి పల్లెలో కూలిపోతున్న ఇల్లు/ మట్టి కొట్టుకుపోతున్న పసివాళ్లు/ వలసలు వెళ్తున్న రైతు కూలీలు/ రాయలసీమ జీవితమంటే కరువులు చిత్రించిన/ చిత్తరువుల సమూహమనీ, కడుపు చించుకుంటే/ కాళ్ళ మీద పడే ఆకలి రాజ్యమనీ/ ఇక్కడ పశువులకైనా, మనుషులకైనా సమూహ చావులేనంటాడు! "రాయలసీమ సర్వస్వం రగులుతున్న భాస్వరం/ అక్షరాలా అనంత సీమలో/ అణువణువులో క్షామం/ మా నినాదాలన్ని ఒక్క నీళ్ల కోసమే .." పుట..19.**

**"మా చేతుల్లో మీ రాజకీయ జెండాలు పెట్టద్దు/ మీ ఓట్లకోసం నోట్లు పెట్టొద్దు/ మీ వరాల వర్షాలు మా కొద్దు/ మా పొలాలకు నీటి కుంట లివ్వండి/ చాలంటాడు"** కవి.

**"రాయలసీమలో విస్తరిస్తున్న ఇసుక ఎడారి/ రానున్న కాలంలో ఇది ఒంటెలకు రహదారి/ ఎల్లప్పుడూ సీమకు కరువుతోనే రణం/ రాయలసీమలో ఓటు/ బందిపోటు చేతిలో ప్రాంసరీ నోటు/ మనిషి రాజకీయ పశువుగా/ బతుకుతున్న వరకు మరణించేదాకా వాడిది బానిస బతుకు!" పుట.. 41**

**"ఆదుకుంటాం ఆత్మహత్యలు చేసుకోకండి/ అనే మాట కంటే ముందు/ ఆదుకుంటే ఆత్మహత్యలు జరగవనే సత్యం/ ఆ వాక్యంలోనే ఉందని గ్రహించడానికి/ అర్థం చేసుకోవడానికి ఈ రాజకీయ నాయకులకు/ ఒక జీవితకాలం పడుతుందేమో"** అంటాడు కవి.

ప్రభుత్వం రైతుకు నీళ్ళు ఇవ్వాలి. మంచి విత్తనాలు ఇవ్వాలి. ఎరువులు ఇవ్వాలి విద్యుత్ ఇవ్వాలి. పంటలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలి. అప్పుడు రైతు నిరంతరం శ్రమించి పంటను కంటికి రెప్పలా చూసుకుంటూ దేశాన్ని సుభిక్షంగా ఉంచుతాడు. నీళ్లు లేకుంటే రైతు లేడు, రైతు లేకుంటే పంట లేదు. పంట లేకుంటే మనిషికి బతుకే లేదు. కావున నీళ్లకు సంకెళ్లు వేయకండి అంటూ రాజకీయ నాయకులకు హితవు చెబుతాడు కవి. "నీళ్లకు సంకెళ్ళు వేసి నిత్య దరిద్రుల్ని/ చేయొద్దని, హామీలతో కాలం వృధా చేయవద్దని" హెచ్చరిస్తాడు. చివరిగా.. జలం అవసరాన్ని, ప్రాధాన్యతనీ నొక్కి చెబుతూ ఈ దీర్ఘకావ్యాన్ని ముగిస్తాడు కవి ఎక్కలూరు శ్రీరాములు.

**"జలం/ ప్రపంచ ప్రజల ప్రాణ ప్రద ఇంధనం/ జలం/ ప్రత్యామ్నాయం లేని జీవన పరమౌషధం/ జలం/ సమస్త జీవరాసుల దాహార్తిని తీర్చే ఏకైక ద్రవం .." పుట..50**

... ఇలా ఈ దీర్ఘకావ్యమంతా రాయలసీమ జనజీవన సంక్షోభాన్ని, సాగునీరు తాగునీరు లేని సీమబతుకుల్లో కరువు విశ్వరూపాన్ని చక్కగా ఆవిష్కరించారు. ఈ దీర్ఘ కావ్యమంతా ఏక వస్తువుతో, ఏక సూత్రతతో రిథమాటిక్‌గా సాగుతుంది. అనంత రైతుల జీవన విధ్వంసాలకు కారణమైన దుర్భిక్షాన్ని కళ్ళ ముందు నిలిపిన కావ్యం ఇది. జలగండం తర్వాత కవి ఎక్కలూరు మరింతగా విస్తృతంగా రాశారు, రాస్తూనే ఉన్నారు. కథ, నవల, నాటికలు వంటి ప్రక్రియల్లో కూడా తనదైన ప్రతిభను, శైలిని చాటుకుంటున్నాడు ఈ కవి.

**అనంత ఆర్తికి ప్రతిధ్వని 'జలస్వప్నం'**

మరో సీనియర్ కవి, అనంత కవి మల్లెల నరసింహ మూర్తి గారిని కూడా ప్రత్యేకంగా చెప్పుకోక పోతే సీమ కవిత్వం అసంపూర్ణ చిత్రంలా మనకు కనిపిస్తుంది. అక్షర క్రమంలోనే కాదు, శతాబ్దాల కరువుకు పుట్టిల్లైన అనంతపురం జిల్లాలో పుట్టి పెరిగిన కవి ఈయన. కవిగా సున్నిత మనష్కుడు. భావోద్వేగం కంటే భావుకత్వం గల కవి. ప్రముఖ కవి శేషేంద్ర గారికి ఇష్టమైన కవి. వారి కవిత్వ ఛత్రఛాయలో సేదదీరిన కవి గనుకే 'మల్లెల కవీంద్రుడు' అనగలిగారు. జలస్వప్నం కవిత్వాన్ని 'తేనెలో ముంచిన వజ్రాయుధం'గా అభివర్ణించారు ఆయన. మరొక ప్రముఖ కథా రచయిత బండి నారాయణ స్వామి మిత్రవాక్యం రాస్తూ.. అద్భుతమైన కవితా దృశ్యాలకు రంగులద్ది చూపించడం మల్లెల ప్రత్యేకత అంటారు. ప్రముఖ సాహితీ వేత్త సింగమనేని నారాయణ గారు మల్లెలను అనంత జిల్లా ప్రతిధ్వనిగా, అనంత ప్రజల బాధని అక్షరాయుధంగా మల్చుకుని, నిశ్శబ్ద సమరగానం చేసే కవిగా మనకు పరిచయం చేస్తారు. 2004లో వెలువడిన ఈ కవితాసంపుటికి కాల ప్రమాణంలో 17 ఏళ్లు దాటినప్పటికీ ఇప్పటికీ ప్రామాణికత ఏమాత్రం కోల్పోలేదు. ఇక్కడ జలం ప్రాణికోటి ప్రాణాధారమైతే,

స్వప్నం ఒక అనుభూతి, అనుభూతిలోనే కవి అనుభవాలు చేసిన గాయాలు, ఆ గాయాల తాలూకు సలపరం మనకు కన్పడుతుంది, విన్పడుతుంది. ఈ కవిత్వంనిండా రాయలసీమ, అందులో కరువుసీమకు సాక్షీభూతమైన అనంతపురం జీవితముంది. సాగునీటికైనా, తాగునీటికైనా నోచుకోని అనంత ప్రజల బతుకు పోరాటం ఉంది. ఈ సంపుటి మొదట్లో కవితల విషయ సూచిక ఇవ్వలేదు గానీ అత్యధిక కవితల్లో సీమ జీవన సంఘర్షణే చిత్రితమైంది. తన కలం సీమగుండెకు గొంతుకనీ, రాళ్లసీమ మౌనాగ్ని జ్వాలలకు అనువాదమే నా కవిత్వం అని కవే స్వయంగా చెప్పుకున్నాడు. తొలి కవితలోనే కవి తన మట్టి మూలాల్ని, పల్లె సీమతో తనకున్న అనుబంధాన్ని అమ్మశ్వాసతో పోల్చడంతో కవిత్వం మొదలౌతుంది. తన బతుక్కి అమ్మే ఒక శ్వాసగా, భవిష్యదాశగా, నిత్యం కళ్ళ ముందు కన్పించే కల్పవృక్షంగా ప్రేమగా, భక్తిగా కళ్లకద్దుకుంటాడు కవి. అక్షరాలు రాని అమ్మ జీవన వేదం వల్లించే శ్రమజీవన సౌందర్య మూర్తిగా అభివర్ణిస్తాడు.

**"బడిలో అక్షరాలు దిద్దని మా అమ్మ/ మడిలో బీజాక్షరాలు చల్లి పండించేది/ బతుకునేలలో అక్షరాలు ఏరుకోవడం కన్నా పొలంలో విత్తనాలు చల్లి జీవన వేదం/ వల్లించేది మౌనంగా.." పుట..19**

జలస్వప్నం టైటిల్ కవిత వీరి కవిత్వాన్ని ప్రాణవంతంగా, తేజవంతంగా జేస్తుంది. ఒకనాటి రాజులేలిన సీమ రాళ్ళసీమగా మారిన దైన్య స్థితినీ సింధువంతటి చరిత్రలో తాగునీరైనా లేని విషాదాన్ని వివరిస్తూ.. నీళ్లతో వరిమళ్ళు పండక పోయినా రాజకీయ వడగళ్లు మాత్రం సమృద్ధిగా పడతాయని అవకాశవాద సీమ రాజకీయాల్ని వ్యంగ్యంగా చమత్కరిస్తాడు. నేలను నమ్ముకున్న రైతు ఏ నాయకునికీ తలవంచకూడదని హితవు పలుకుతాడు. శ్రామికుణ్ణి గౌరవించకపోతే ఏ ఉగాదీ నీ సొంతం కాదంటాడు. **"నదులు మా సీమలో నెమళ్ళై/ నాట్యం చేసేంతవరకు/ పంటలు భూముల్లో/ పచ్చటి ప్రాణమై ఎదిగేంత వరకు/ నిత్య సంక్రాంతి పాటలు పల్లవించే వరకు మాకు ఉగాదులు లేవు/ ఉషస్సులు రావు/ మా రాళ్ళసీమ నీళ్ళ సీమ కావాలి/ ఇక్కడ జీవలం ప్రవహించాలి" పుట.22**

ఇవాళ వస్తు వ్యామోహంలో మనిషి చిక్కుబడి పోయాడనీ, వస్తు ప్రపంచంలో మనిషి రూపాలు, రంగులు మార్చుకున్నాడనీ ఇప్పుడు ప్రపంచమంతా మా ఊర్లోనే ఉందనీ మా ఊరే ఒక ప్రపంచమైందని... బాధపడతాడు. రాజకీయం ఒక నెత్తుటి మడుగనీ, కావాలంటే అందులో దాహం తీర్చుకునే ప్రతి పులిని అడగమంటాడు. **"నెత్తుటి సీమలోంచీ వసంతం పక్షి/ ఎక్కడికో వలస పోయింది/ అందుకే కోయిల ఊసు లేదు/ అమ్మ చేతి స్పర్శ లేని/ పసిపాప ఊయల మా సీమ" పుట..29.** కరువు సీమలో చినుకే బంగారమనీ, మెతుకే వైభోగమని అంటాడు. దాహంతో తపించే జనావళికి ప్రతి వాన చినుకూ అమృత బిందువుతో సమానమంటాడు. ఆకలి తీరక సైబీరియన్ పక్షుల్లా వలస పోవడం పరిష్కారం కాదంటాడు. కరువు శత్రువును సంహరించడానికి జలఖడ్గమే మన ఆయుధమంటాడు. కవి అన్నవాడు నిత్యం జనం బాధను అనువదిస్తూ ఉండాలంటాడు. బాధ కవిత్వానికి పర్యాయ పదమంటాడు. పాటంటే ఇష్టపడతాడు. అది ఉద్యమానికి ఊపిరిగా, జనం గుండె చప్పుడుగా భావిస్తాడు. అనంత ప్రజల మట్టి జీవనంలో వానంటే ఓ జీవన స్పర్శ అంటాడు. **"చినుకు చినుకు కోసం/ చివరి శ్వాస వరకూ/ కనురెప్పలను వాళ్ళనివ్వను/ కంటి ముంగిట ఆశల తోరణాలు వాడనివ్వను/ నేను నీటికలలో మొగ్గ తొడిగిన/ చినుకు ఆశను/ ఆశతో బతికే వాళ్ళం ఆకలి ఏం చేస్తుంది?/ మొండి జీవనం బండరాళ్ళం/ చావంటే భయం లేని వాళ్ళం/ సీమ బతుకుల్లో/ వాన ఎప్పుడూ శేషప్రశ్నే" పుట.. 58**

బాల్యాన్ని ఒక తీయటి కలలా, తీరం దాటిన అలగా, మనం చూస్తుండగానే చేతి వేళ్ళ సందుల్లోంచి జారిపోయిన జలంగా తల్చుకుంటాడు. నలుపు వర్ణనీయ వస్తువు కావాలని, ఎర్రకోటపై నల్ల సూర్యుడు ఉదయించిన రోజే ఈ దేశపు జెండా గుండె చప్పుడు తనకు వినిపిస్తుందనీ కలలు కంటాడు. **"ఎర్రకోటపై నల్లసూర్యుడు/ ఉదయించిన రోజు/ నిజంగా స్వర్ణ భారతం/ మట్టి పరిమళించిన రోజు/ నల్ల గనుల్లో మేలిమి వజ్రం/ ప్రపంచ శిఖరంపై కాంతి జ్వాలాగా/ ఎగిసిన రోజు/ నలుపు సౌందర్య వర్ణమై/ అగ్రతాంబూలం అందుకున్న రోజు/ నలుపు వర్ణనీయ వస్తువుగా రూపొందిన రోజు" పుట..88**

తెరచాప దీపం అనే కవితలో ఈయన అనుభూతులు ఎలా ఉంటాయంటే .. అనంత కవుల్లోనే వీరి శైలే ఓ ప్రత్యేకం.

నదిలో నీటి రైలు కదిలింది/ దూరంగా పడవ ప్రమిదలో/ తెర చాపదీపం.. అంటూ నీటి అలల మీద తేలియాడే పడవ ప్రయాణాన్ని అద్భుతంగా వర్ణించడం చెల్లు. అంతే కాదు; నిశ్శబ్దం మలచిన అడవిలో/ కొమ్మ విరిగిన శబ్దాన్ని వింటాడు కవి. పరిమళం ప్రాణంపోసి పెంచిన తోటలో పువ్వు రాలిన ధ్వనిని కూడా వింటూ పక్షి గుండె గూటిలో కదిలిన/ ప్రాచీన కలల ప్రపంచాన్ని/ మల్లెల మాత్రమే దర్శించడనిపిస్తోంది నాకు.

ఈ అనుభూతుల వీర విహారం ఎలా ఉందంటే... **"నేను మాటలాడ లేదు అంటే నాలో కోయిలలు కోటి రాగాల కోవెలలు కడుతున్నాయని అర్థం/ చీకటి చిరునామాల్లోని శిథిల జీవితాల్ని వెదకి వెదకి ఎదలోకి దాచుకునే ఒక మహోదయాన్ని నేను/ మనసుల గాయాలకు పాటల చలువను పూసే వెన్నెల వేణువున్నేను/ పువ్వుల పుటల్లో కవితా పరిమళాల్ని**

**నింపి కోయిల గానంతో/ అడవి పుస్తకాన్ని ఆవిష్కరించే/ ఆమని సౌందర్య రుషిన్నేను/ నిత్య సమర జీవాగ్ని స్పర్శలో/ వికసించిన వజ్ర పుష్పం నా హృదయం" పుట..80. "సౌందర్యం కురులు విప్పి పరిమళిస్తే నది పాయలై హృదయపు టేదారిలో ప్రవహిస్తే కళ్ళు నెమళ్ళై నర్తిస్తాయి/ నిర్మలమైన తీర్పునిస్తాయి"** అంటాడు కవి.

చివరిగా జలనృత్యంతో జలస్వప్నాన్ని ముగిస్తాడు కవి మల్లెల. ఈ సంపుటిలో మొత్తం 30 కవితలుంటే అందులో సీమ జనజీవన సంఘర్షణకు సంబంధించి ఆరు కవితలే ఉన్నాయ్. విభిన్న కవితా వస్తువులతో 24 కవితలున్నాయ్. ఈ ఆరు కవితలూ ముఖ్యంగా మట్టి మీద మమకారంతో కరువును సహిస్తూ, ఆకలిని భరిస్తూ, బతుకును కొనసాగిస్తున్న అనంత ప్రజల జీవనాన్ని చాలా హృద్యంగా చెప్పడం కవి మల్లెలకే సాధ్యం అనిపించింది నాకు. ఎంతటి సీరియస్ నెస్ విషయమైనా, సంయమనం కోల్పోకుండా తన భావాలను సూటిగా, స్పష్టంగా హృదయాలకు హత్తుకునేలా కవిత్వీకరించడం కవి మల్లెల ప్రత్యేకత. వీరు కవిత్వంలో ఎప్పుడు ప్రవేశం పొందారో గానీ, జలస్వప్నాన్ని మొదటి సంపుటిగా చాలా ఆలస్యంగా 2004లో తెచ్చారు. ఇంత పరిణతి చెందిన కవిత్వాన్ని ఇంత ఆలస్యంగా ప్రకటించడం నాకు ఆశ్చర్యం కల్గించింది. పోనీ ఆగిపోయారంటే అదీ లేదు. నిరంతర అధ్యయనం లోనే ఉన్నారు. కవి సమ్మేళనాల్లో, కావ్యచర్చల్లో, సామాజిక ప్రజా ఉద్యమల్లోనూ పాల్గొంటూనే ఉన్నారు. 2004 తర్వాత 17 ఏళ్ళు గడిచినా మళ్ళీ వీరినుంచి మరో పుస్తకం రాకపోవడం మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. కారణాలు ఏవైనా కావచ్చు, ప్రతిభావంతుడైన కవి ఆగిపోకూడదు. అవిశ్రాంతంగా రాస్తూనే ఉండాలి. ప్రజా కవులు మౌనం వహిస్తే సమాజానికి నష్టమే జరుగుతుంది. సమాజమే వారి కవిత్వం కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. వారినుంచి త్వరలోనే రాయలసీమ జీవనం గురించి మరో కావ్యం రావాలని, వస్తుందని ఆశిద్దాం. సీమ కవిత్వ చైతన్యమే జలగండం, జలస్వప్నంగా భావిస్తూ ఈ కవులిద్దరికీ మనసారా అభినందనలు. ■

# *ఓ నా పెనిమిటీ...*

***- గవిడి శ్రీనివాస్***

***7019278368, 9966550601***



**నా** *మనసుకి నచ్చేటోడివనీ*
*మనువాడినందుకు ముచ్చటపడ్డాను*
*మూడు ముడుల బంధానికి*
*కానుకగా పిల్లలు వరమనుకున్నాను*
*రోజులు*
*అనురాగాల తీగలు అల్లుకున్నపుడు*
*సంబరపడ్డాను*
*ఆరబోసిన వెన్నెలనంతా*
*వొడిలో ఒంపుకున్నాము*
*ఇంకేం కావాలీ*
*దీపాల్లా వెలిగే పిల్లలు*
*కాగడాలని వెలిగించే పెనిమిటి*
*అంతా సంతోషాల కడలిలో తేలియాడాం*
*రుతువులు మారినట్లు కాసింత కాలం నడిచాక*
*ఆయన కాలం చేసాడు*
*ఊపిరి సలపని క్రిమి దాడికి రాలిపోయాడు!*

*ఆయన్ని తలచినపుడల్లా*
*కళ్ళల్లో కన్నీటి వాగులు ఆగనంటాయి*
*పిల్లలు బిక్కుబిక్కుమంటూ*
*తిరిగిరాని నాన్న కోసం ఎదురు చూస్తుంటారు*
*మా ఇంటి దీపం ఆరిపోయింది*
*ఉన్న ధైర్యం పిల్లలకి నేననీ తెలిసాక*
*రాలే కన్నీటి చినుకుల్లో తడిసినా*
*దు:ఖపు తెరల్ని తెంపుకుంటుంటూ*
*చిన్నపాటి పనులవెంట*
*జీవితాన్ని లాగటం దినచర్యవుతుంది*
*కాలాన్ని వెనక్కి తిప్పలేక*
*అడుగుల్ని జరపటం పరిపాటయింది.*

*ప్రతి పనిలోనూ*
*పెనిమిటి తోడున్నట్లే అనుకోవటం*
*బాధయినా కసాయి కాలానికి*
*ఎదురెళ్లటం అలవాటైంది*

*ఓ నా పెనిమిటి*
*ఇప్పుడు బతుకు యుద్ధం అనివార్యమైంది!* ■



చెళ్ళపిళ్ళ శ్యామల
99498 31146

# మూట

**ఒ**కప్పుడు పూలచెట్టులా కళకళలాడేది ఆ గ్రామం. ప్రపంచీకరణ పులివాత పడి చిన్న వ్యాపారాలన్నీ దెబ్బతిన్న పక్షిలా కూలబడ్డాయి. పంట పొలాలన్నీ ధరల రెక్కలు కట్టుకొని రైతుల చేతుల నుంచి బడా బిల్డర్ల చేతిలో వాలాయి. ఇపుడా ఊరు ఒట్టి పోయిన ఆవులా మిగిలి పోయింది. ఆ గ్రామంలో ఎన్నో వలస కథల్ని నానమ్మలు తాతయ్యలు రోజూ నెమరేసు కుంటూనే ఉన్నారు. అలాంటి కథే సత్యం కుటుంబానిదీను.

సత్యం తన రెండెకరాలతో బతుకు బండిని బాగానే లాగాడు. కొడుకు బంగార్రాజు తోడయ్యాక, పొలం బాగానే కలిసొచ్చింది. కొన్నాళ్ళు కాలం వారితో స్నేహం చేసింది. ఎక్కువ కాలం, కాలమెవరితోనూ నేస్తం కట్టలేదేమో! కూతురు మంగ పెళ్లి ఖర్చులు, వరుసగా మూడేళ్లు పంట పోవడం, భార్య అనారోగ్యంతో, సత్యం కాస్త చతికిల పడ్డాడు. కొంత పొలం అమ్మి అవసరాలు తీర్చగలిగాడు కానీ ఉన్న అరెకరం, అతని కుటుంబం కడుపునింప లేకపోయింది.

ఎదిగిన కొడుక్కి ఏమీ మిగల్చలేక పోయానన్న బాధ సత్యం కళ్లలో నిత్యం తడిగా తిరిగేది. బంగార్రాజుకో తోడుని తేగల్గాడు. కోడలు రమణి, మనుమరాలు నందిని మరో ఇద్దరు తోడయ్యారు. ఆకలి చుట్టమై, వారింట ఆర్నెల్లయినా కదలక పోయేసరికి, వలసే వారికో మార్గం చూపింది. ఆరేళ్ళు గా వలస మంట వారి నట్టింట వాడగాడ్పై వీస్తూనే ఉంది. దోమై వలస వారిని కొడుతూనే ఉంది.

"అందరం కలిసే ఏడకన్నా పోదాం రా కొడకా" అంటే, "ముసలోడివి నువ్వేటి కష్టపడతావు. యిక్కడే ఉండి, పొలం తాకట్టెట్టగా వచ్చిన దాంతో సరిపెట్టుకో" అనేవోడు. "మూటల్లా మమ్మల్ని ఒగ్గీకురా! నీ కోసం ఎదురు సూసీ, సూసీ, మాయిడి పల్లలా మగ్గిపోతాం రా కొడకా" అనేది లచ్చిమి.

"ఈ సారి కొడుకొస్తే ఎలాగైనా డబ్బు మూట ఆడి సేతిలో పెట్టి, వలసెల్లకూరా కొడకా" అనాలి అంటూ కలవరిస్తున్నాడు సత్యం. సత్యం మాటలు నిజం చేయడానికి ఓ పథకం ఆలోచించింది లక్ష్మి.

ఇంటెనకాల నేలంతా నాల్రోజుల్లో చదును చేసింది. కూరగాయల విత్తనాలు జల్లింది. పసిపాపలా పంటని ఇద్దరూ కాపాడారు. పంట నోరు తడిపేందుకు వాళ్ళ నోళ్లెన్నో రోజులు ఎండగట్టుకున్నారు. దండిగా పండిన కూరగాయలు వారి కష్టాన్ని మరిపించాయి. పైసా పైసా పోగేసి, కొడుకు రాకకై ఎదురు చూస్తున్న తరుణంలో ముసలోడు జబ్బు పడ్డాడు. తన మందు బిళ్లకైనా అందులోంచి రూపాయి కూడా తీయొద్దని గట్టిగా చెప్పాడు భార్యతో. కొడుకు రావడానికి ఓ పున్నం ఓ ఆమాస ఉన్నాయి. అంతే! పున్నం దాటింది. ఆమాస దాటలేదు ముసలోడుకి.

ఆ రోజు రానే వచ్చింది. ఆనందం రెక్కలు కట్టుకు వాలిన బంగార్రాజు గంపెడాశతో గబగబా ఇంటి కేసి అడుగేసాడు. "అమ్మా! అయ్యా! నేనొచ్చేసానే! ఈ పాలి మరెల్లనే! మీ కాడే నానూ..." అతని మాట పూర్తి కానేలేదు. దండేసున్న తండ్రి ఫోటో, పక్కనే మూలుగుతున్న తల్లినీ చూసి బావురుమన్నాడు. కొడుకుని చూసిన ఆనందంతో ఆమె కళ్ళు మెరిసాయి. కొడుకుని తనివి తీరా తడిమాక "నాయినా! యిలారా! మా యిద్దరి పేవంతా యిందులో మూట గట్టాం. ఈ మూట తీసుకో" అంటూ తల కింద దాచిన మూట తీసి కొడుక్కిచ్చింది. మనవణ్ణి దగ్గరికి తీసుకుని మురిపెంగా చూస్తూ కళ్ల నిండా నీళ్ల తో.. "మనవడా! మీ అయ్య మమ్మల్ని ఒగ్గేసినట్టు, నువ్వెప్పుడూ మీ అయ్య నొగ్గీకు రా! మాలాంటి రాయి బతుకు ఆడు బతక నేడు. ఆడసలికే అమాయకుడు.. నా మాటింతావు గదూ!" అంటున్న తల్లి ప్రేమకు తల్లడిల్లి పోయిందతని మనసు.

తల్లిని తన ఒళ్ళోకి తీసుకుని తనివితీరా ఏడ్చాడు. తల్లిచ్చిన మూటలోంచి చిల్లర అతని ఒళ్ళో రాలింది. మూట విప్పిన బంగార్రాజు యింత డబ్బు వీళ్లకెలా వచ్చింది అనుకున్నాడు. యింతలో అతని దృష్టి పెరట్లో కూరగాయలపై పడింది. తండ్రి ఆ మొక్కల్లో తిరుగాడుతున్నట్టే అనిపించింది.

తల్లీ ఓ నాల్రోజులుండి తండ్రి దగ్గర కెళ్ళింది. వాళ్ళిచ్చిన మూట మాత్రం అతని చేతిలో మిగిలిపోయింది. ధనమేరా అన్నిటికీ మూలం ఎక్కణ్ణుంచో లీలగా వినిపిస్తోంది. ఈ మూట సొచ్చిగా మిమ్మల్నెప్పుడు ఒగ్గేల్లను అంటూ ఏపుగా పెరిగిన కూరగాయల మొక్కల దగ్గర కెళ్ళి, అక్కడే చతికిలబడ్డాడు బంగార్రాజు.

■



# అదృష్టదీపక్ చిరస్మరణీయుడు

- రేగుళ్ళ మల్లికార్జునరావు,
సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్,
94916 59899

**"అక్షరాలీవేళ అగ్ని విరజిమ్మాలి
కవిత ఖడ్గమై కథనమొనరించాలి'**

**ఈ** కవిత 1982లో నేను డిగ్రీ చదువుతున్న రోజుల్లో చదివాను. నేను, కొంతమంది స్నేహితులం కలిసి రామచంద్రపురం (తూర్పు గోదావరి జిల్లా)లోని విఎస్ఎం కళాశాలలో యువ కళాజ్యోతి అనే సాంస్కృతిక సంస్థగా ఏర్పడి, అందులో సభ్యులను చేర్పించి, గానం, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, స్వీయ పఠనంతో పాటు ఒక లిఖిత పత్రికను కూడా విజయవంతంగా నిర్వహించే వాళ్ళం. విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న చైతన్యాన్ని వెలికితీసే ప్రయత్నంలో భాగంగా ఈ సంస్థ ద్వారా ఒక వేదిక ఏర్పరిచాం. అదే సంవత్సరం ఒక వచన కవితా సంపుటిని తీసుకువచ్చాం. దానిలో అదృష్టదీపక్ గారు రాసిన 'అక్షరాలీ వేళ అగ్ని విరజిమ్మాలి' కవిత వేశాం. అదే ఆ తరువాత నవోదయం సినిమాకు పాటగా మారింది. అదృష్టదీపక్ గారు మా సంస్థకు సలహా దారుడిగా ఉన్నారు. మాసపత్రికకు కథలను, కవితలను ఎన్నిక చేయడం, సరిదిద్దడం, సూచనలివ్వడం ఆ లిఖిత మాసపత్రికకు వెనుక అట్టమీద అయన స్వదస్తూరితో రాయడం, (ఆయన దస్తూరి ముత్యాల్లా ఉంటాయి) దానికి నేను బమ్మలు వేయడం కొనసాగింది. చిన్న పెద్ద అనే బేషజాలు దరిచేరని మనస్తత్వం ఆయనిది. అందువల్లే ఆయన లెక్చరర్గా పనిచేస్తున్నా, విద్యార్థులమైన మమ్మల్ని గైడ్ చేయడం, అప్పట్లో ఆయన పనిచేస్తున్న ద్రాక్షారామ పీవీఆర్ కళాశాల లోగోను కుడా నా చేత వేయించడమనేది ఆయన గొప్ప మనసుకు నిదర్శనం.


అదృష్ట దీపక్ గారు 1950 జనవరి 18న సూరమ్మ, బంగారయ్య దంపతులకు రావులపాలెంలో జన్మించారు. ఎనిమిదో తరగతి దాకా రావులపాలెంలో, ఎంఏ వరకు రామచంద్రపురంలో చదివారు. 1979 నుంచి 2008 వరకు ద్రాక్షారామ పీవీఆర్ జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పనిచేశారు. దీపక్కు చిన్నతనం నుంచే నాటకాలపై మక్కువ. 12 ఏళ్ల వయసులోనే కవిత్వం రాయడం మొదలు పెట్టారు. వీరి భార్య స్వరాజ్యం. ఈ దంపతులకు కుమారుడు చక్రవర్తి, కుమార్తె కిరణ్మయి.

అదృష్ట దీపక్ గారి కుటుంబానికి, మా కుటుంబానికి ఎంతో అనుబంధం ఉంది. మాది సోమేశ్వరం. వారి అమ్మగారు ఆ ఊర్లోనే ఉండేవారు. మా ఊరికి ఒక కిలోమీటరు దూరంలోనే మాచవరం. అక్కడ వారి మేనమామ తేతల అమ్మిరెడ్డి గారు ఉండేవారు. వారికి మెడికల్ షాపు ఉండేది. మా నాన్న రేగుళ్ళ మల్లయ్య గారు మిలటరీలో ఉండేవారు. పూర్వాశ్రమంలో చేసిన అనుభవంతో వైద్య వృత్తిలో ప్రజలందరికీ ఉచిత వైద్యం చేసేవారు. ఆ వైద్యానికి అవసరమైన మందులను అమ్మిరెడ్డి గారి షాపు నుంచి తెచ్చేవారు. మంచి స్నేహితులైన వారిద్దరూ అలా ప్రజాసేవ చేసేవారు. ఆ విధంగా అదృష్టదీపక్ గారు మా కుటుంబానికి పరిచయం. కాలేజీ చదివే రోజుల్లో కళాజ్యోతి సంస్థ ద్వారా మంచి మిత్రులుగా,

సలహాదారులుగా ఏర్పడిన పరిచయం ఇప్పటికీ సాగుతూనే ఉంది.

గత నెల 16న ఆయన ఫోన్ చేసి మీ గీతాంజలి బొమ్మలు చూశాను, దానికి త్వరలోనే అభిప్రాయం రాసి పంపుతానని హార్డ్ కాపీ ఒకటి పోస్టులో పంపించమని అడిగారు. “కరోనా కదండీ! దాని హడావిడి తగ్గాక పంపుతాన”ని నేను అనడం, ఈలోపే ఆయన కరోనా మహమ్మారికి బలైపోవడం బాధాకరం. అదృష్టదీపక్ రావులపాలెం సిఆర్‌సి, రాయవరం మల్లారెడ్డి నాటకరంగం, నాటక పరిషత్తులు మొదలైన ఎన్నో పరిషత్తులకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఆయన స్వతహాగా నటుడు. వారి మేనమామ వారి ఊరిలోని నాటక నాటక బృందానికి క్రియాశీల సభ్యుడు. ఆయన బుర్రకథలు చెప్పేవారు. నాజర్ గారిలాగా ప్రజాకళాకారులతో మంచి సంబంధాలు ఉండేవి. ఆ ప్రోత్సాహంతోనే దీపక్ గారికి బాల నటుడిగా రంగస్థలం మీద అనుభవాన్ని సంపాదించిపెట్టింది. ఎన్నో నాటక కళాపరిషత్తులలో ఉత్తమ నటుడిగా, హాస్యనటుడిగా, ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా అవార్డులు, పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఆంధ్రదేశంలో నాటకం బతికి ఉందంటే పరిషత్తులే కారణం అని నమ్మిన వ్యక్తి ఆయన. వీటి ద్వారానే నాటకం బతుకుందని విశ్వసించే వారు. ఏ రంగమైనా ప్రయోగాల వల్లే ముందుకు పోతుంది, కానీ ఆ ప్రయోగం ప్రయోజనం కలిగించేలా ఉండాలని భావించేవారు. గాయకునిగా, నటునిగా సాహిత్యాభిలాషిగా అందరి దృష్టిని ఆకర్షించిన దీపక్ ‘ఎర్రజెండాయే నా అజెండా’ అని అభ్యుదయ కవిగా ముద్ర వేసుకున్నారు. అరసం, ప్రజా నాట్యమండలి సంస్థలలో నిబద్ధత గల కార్యకర్తగా తన పాత్ర నిర్వర్తించారు. వృత్తిపరంగా జూనియర్ కాలేజీలో చరిత్ర బోధన చేస్తున్నా, ప్రవృత్తిగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నాటక పోటీల్లో జడ్జిగా వెళ్లి నిష్పక్షపాతంగా తీర్పులు ఇచ్చేవారు. తనికెళ్ళ భరణి గారు అన్నట్టు “నాటకం చూస్తున్నప్పుడు అతనో విలన్. పోటీల రిజల్ట్ చెప్పేటప్పుడు అతనో జెంటిల్మన్, బహుమతి ప్రదానం అయిపోయాక అతను ఓ హీరో!”. మనసా– అతను ఏది చేసినా ఇష్టంగానే చేస్తాడు, వాచా– అతను నమ్మిన విషయాన్నే చెప్తాడు, కర్మణా– కొంపలు మునిగిపోతున్నా తాను నమ్మినదాన్నే ఆచరిస్తాడు, అసలైన వ్యక్తిత్వం అంటే అదే మరి!

దీపక్ బహుముఖ ప్రజ్ఞాశాలి. సినీ గేయరచయితగా 40 పాటలే రాసిన అన్ని చైతన్య ప్రతీకలు, అభ్యుదయ భావాల మేళవింపు. 1980లో మాదాల రంగారావు తన “యువతరం కదిలింది” చిత్రం ద్వారా సినీ రంగానికి పరిచయం చేశారు. సినిమా మాధ్యమం అంతిమ లక్ష్యాన్ని అంగీకరిస్తూనే విలువలకి



కట్టుబడిన నిబద్ధత కలిగిన కవి. ఎక్కువగా అభ్యుదయ గీతాలు రాయడానికి కారణం వామపక్ష ఉద్యమాల్లో చురుకుగా పాల్గనే మేనమామ పెంపకంలో పెరగడం. ఆయన కూడా అవే భావాలతో మమేకమై సాగడం.

ప్రజారంగాల్లో దీపక్‌కు పరిచయమైన అట్టడుగు ప్రజల జీవితానుభవం ఆయన రచనల్లో సహకరించింది. పరిశీలనా తత్వంతో నిండిన వ్యాసకర్తగా పరిణమించటానికి ఈ జీవితానుభవమే తోడ్పడింది. అనేక రచనలు చేశారు. 1972లో కోకిలమ్మ పదాలు, 1974లో అగ్ని, 1977లో సమర శంఖం, 1978లో ప్రాణం, 2008లో అడవి, దీపకరాగం, 2010లో ఆశయాల పందిరిలో, శ్రీశ్రీ ఒక తీరని దాహం పుస్తకాలను వెలువరించారు. ఇంకా అనేక ప్రసిద్ధ సంకలనాల్లో తన రచనలు చోటుచేసుకున్నాయి. బెర్టోల్డ్ బ్రెష్ట్, పాబ్లో నెరూడాల కవితలు కొన్నింటిని తెలుగులోకి అనువదించారు. ‘ఉదయం’ దినపత్రికలో ఒక సంవత్సరం ప్రతి ఆదివారం ‘పదసంపద’ శీర్షిక నిర్వహించారు. ‘చినుకు’ మాసపత్రికలో మూడేళ్ళపాటు ‘దీపకరాగం’ శీర్షిక నిర్వహించారు. ‘సాక్షి’ దినపత్రిక ఆదివారం అనుబంధం ప్రారంభ సంచికనుంచీ ‘పదశోధన’ శీర్షిక నిర్వహిస్తున్నారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ఆయన కథలు, కవితలు, కార్యక్రమాలు ఎన్నోసార్లు ప్రసారమయ్యాయి. సినీ, సాహిత్య, అధ్యాపక రంగాల్లో నిబద్ధతతో నిర్వహించిన ఆయన కృషికి అనేక అవార్డులు లభించాయి. ఆయన అవార్డులూ రివార్డుల వెంట ఎప్పుడూ నడవలేదు. అవే ఆయన్ని వెన్నంటి వచ్చాయి. దేనిని నమ్మాడో దానినే జీవితాంతం ఆచరించాడు. విలువలు పుష్కలంగా కలిగిన మానవీయుడు, మంచి మనిషి. ఇంత త్వరగా వెళ్లిపోవటం బాధాకరం. సాహిత్యరంగానికి లోటు. ■

## కవిత



# సంధ్యాపరిమళం

- అవ్వారు శ్రీధర్ బాబు
85001 30770

మధ్యాహ్నం అంతా ఎడారిని ప్రసాదించిన రవి
చేసిన పనికి సిగ్గుపడి బుగ్గల కెంపుని పూసుకొని
చాటుకెళ్ళే వేళల్లో ...

మధ్యాహ్నపు ఎండతో
ఒట్టిపోయిన గొడ్డులాంటి గ్రౌండ్‌లో
ఇపుడు  చల్లగాలి చందనపు లేపనం
కల్మషం లేని పిల్లల మదిలా గాలి

అనేక అడుగులు ఇక్కడ నవ్వుతూ నవ్విస్తూ ...
రాజకీయ విశ్లేషణా పనస తొడిమెలను
విరుస్తూ చమట పుష్పాలు వికసింపజేస్తుంటాయి
కొన్ని ఆఫీసుకు లేటయిన గుమాస్తాలా ఒగరుస్తున్నా
బాంధవ్యాలు పెంచుతూ పోతుంటాయ్!

ఇంకాస్త దూరం వెళ్తే...
గిలకబావిలోంచి నీళ్లు చేదుతున్నట్లు
వంగి వంగి మట్టికి సలాములర్పిస్తున్నట్లు
తలపైకెత్తి, నక్షత్రాలను ఆహ్వానిస్తున్నట్లు
రకరకాల భంగిమలు
సినీ వాల్ పోస్టర్లై పళ్ళు ఇకిలిస్తాయి

మరో పక్క గెలుపు గర్వం ప్రతి కళ్ళల్లోనూ పలికిస్తూ
ఫుట్ బాల్ అటు ఇటు
కాళ్ళను కదిలిస్తూ ఉంటుంది
ఓ మూల కాంతి తోడుంచుకొని
షటిల్ కాక్ గింగిరాలుగా తనకలాడుతుంది
అయినా నలుగురినీ కలుపుతుందేమో!
తోకచుక్కలా మెరుస్తుంది

ఈ సాయంత్రపు దేహంలో గాలి తర్వాత
పిల్లలే ఇక్కడ సంతోషపు చిగురులవుతారు
చిరునవ్వులు.... దివిటీలై వెలుగుతుంటాయి
కార్పొరేట్  కొండచిలువ నుంచి తప్పించుకున్న
ఆ పాదాల్లో ఇపుడు కెరటాల వేగం
వారి వెనకాల పరిగెత్తలేక ఒగరుస్తూ... వారిస్తూ
ఆదుర్దాగా అరుస్తూ..
ముసి ముసిగా మురుస్తూ...
తూరుపు కొండల వెలుగు అమ్మల్లో....
చెట్ల ఆకులు పకపకమని త్రుళ్ళుతుంటాయి
ఇపుడు గ్రౌండ్ అంతా.. ఫలహారాల బుట్ట
కాసేపాగితే.. చీకటి భయంతో
పిల్లవాని ఏడుపవుతుంది!



# మీడియా రాజద్రోహం సుప్రీంకోర్టు బాధ్యత

- తె.ర

**మీ**డియాలో వార్తలు, వ్యాఖ్యల ద్వారా తమ వృత్తిధర్మం నిర్వహించే పాత్రికేయులకు రక్షణ వుండాలని సీనియర్ జర్నలిస్టు వినోద్ దువా కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అందరూ ఆహ్వానించారు. మీడియా ప్రసారాలు, ప్రచురణలపై 124 (ఎ) రాజద్రోహం కేసులు మోపడం సరికాదని పేర్కొంది. పౌరులకు కూడా ప్రభుత్వాల లోపాలను, వైఫల్యాలను, సమస్యలను విమ ర్శించే హక్కు వుంటుందని కూడా ఆ తీర్పులో అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. పుల్వామాలో ఉగ్రవాదుల వేటుకు, బాలకోట్ వైమానిక దాడికి ఇచ్చిన ఉద్వేగ ప్రచారం ఇప్పుడు కరోనా కట్టడిలో వైఫల్యం వంటివాటిని సూటిగా విమర్శించి నందుకే వినోద్ దువాపై ఈ సెక్షన్ బనాయించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత అయిన వినోద్ యూ ట్యూబ్ చానల్‌లో చేసిన వ్యాఖ్యలపై శ్యాం అనే బిజెపి నాయకుడు సిమ్లా జిల్లాలో కేసు పెట్టారు. అసత్య సమాచారం, ప్రజలలో అశాంతిని వ్యాపింప చేయడం, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యల ప్రచురణ తదితర ఫిర్యాదులను దానికి జతచేశారు. ఇటీవలి కాలంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమతో ఏకీభవించిన జర్నలిస్టుల పైన మీడియా ప్రసారాల పైన కేసులు పెట్టి వేధించడం పరిపాటి అయిందని వినోద్ దువా సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసును విచారించిన జస్టిస్ యు.యు. లలిత్ ధర్మాసనం జర్నలిస్టుల స్వేచ్ఛకు రక్షణ ఉంటుందని ప్రకటించింది. కేవలం వారి వ్యాఖ్య లు, కథనాలు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వున్నంత మాత్రాన కేసులు రాజద్రోహం కిందకు రావని స్పష్టం చేసింది. కేవలం హింసను ప్రేరేపించడం ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని పడగొట్టాలని ప్రయత్నించడం మాత్రమే రాజద్రోహమని 1962లో 'కేదార్‌నాథ్ సింగ్ వర్సెస్ పంజాబ్' కేసులో సుప్రీం కోర్టు చెప్పిన తీర్పు ప్రకారం పాత్రికేయులందరికీ రక్షణ వుండాల్సిందేనని ప్రకటించింది. 2020 మార్చి నాటి పరిస్థితుల్లో వలస కార్మికుల దుస్థితి వాస్తవమనీ వాటి పట్ల వ్యాకులతతో ప్రభుత్వాల విధానా లను విమర్శిస్తూ పరిష్కార చర్యలు తీసుకోవాలని వినోద్ దువా కోరడం ఏ విధంగానూ తప్పు కాదని కోర్టు స్పష్టం చేసింది. వినోద్‌దువాపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను సుప్రీం కోర్టు కొట్టి వేసింది.

**తెలుగు ఛానళ్ల కేసులోనూ...**

అంతకు కొద్దిరోజుల ముందే తెలుగు ఛానళ్లు ఎబిఎన్ ఆంధ్రజ్యోతి, టీవీ 5 ఛానళ్లు దాఖలు చేసిన పిటిషన్‌లోనూ సుప్రీం కోర్టు ఇదే విధమైన అభిప్రాయం వెలిబుచ్చింది. 124 (ఎ)ను మరోసారి సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం వుందని తెల్పింది. దీంతోపాటే భారత శిక్షాస్మృతి (ఐపిసి) సెక్షన్ 153(ఎ) వివిధ తరగతుల ప్రజల మధ్య వైషమ్య వ్యాప్తి, 505 ప్రజా జీవితంలో కల్లోల సృష్టి అనే నిబంధనలను కూడా మీడియా కోణంలో మళ్లీ పరిశీలించాల్సి వుందని చెప్పింది. ఈ ఏడాది ఏప్రిల్ 30న న్యాయస్థానం ఇచ్చిన ఒక తీర్పులో కరోనా నేపథ్యంలో కోవిడ్ కట్టడికి సంబంధించి ప్రభుత్వ వైఫల్యాలను మీడియాలో నివేదించినందుకు, విమర్శించి నందుకు కేసులు బనాయించడం సరికాదని కోర్టు చెప్పిన దాన్ని పైఛానళ్లు తమ పిటిషన్‌లో పొందుపర్చాయి. ఈ ఛానళ్లను ఎం.పి రఘురామ కృష్ణంరాజుతో పాటు 124(ఎ) కింద ఎ2, ఎ3 లుగా కేసులు నమోదు చేయడం తెలిసిన విషయమే.

ఐపిసి 124(ఎ)లో ఏం వుంది? ఎవరైనా సరే తమ మాటల ద్వారా గాని మౌఖికంగా లేదా లిఖిత పూర్వకంగా సంజ్ఞలు లేదా ప్రత్యక్ష వ్యక్తీకరణల ద్వారా గాని మరో విధంగా గాని

విద్వేషం లేదా ధిక్కారం వ్యాప్తి చేసేట్టయితే భారత దేశంలో చట్టం ద్వారా స్థాపితమైన ప్రభుత్వం పట్ల అయిష్టతను, విముఖతను రెచ్చగొట్టేట్టయితే ప్రేరేపించేట్టయితే వారికి కారాగార శిక్షకు పాత్రులగుదురు. ఈ కారాగార శిక్ష మూడేళ్ల నుంచి యావజ్జీవం వరకూ వుండొచ్చు. రెండూ కలిసి కూడా ఉండొచ్చు. ఇందులో అయిష్టత వైముఖ్యం అన్నదాంట్లో విశ్వాస రాహిత్యం, శత్రుభావన కూడా కలిసి వున్నాయనీ, ప్రభుత్వ విధానాలను చట్టం ద్వారా మార్చడానికి ప్రయత్నిస్తే అది రాజద్రోహం కాదు. ద్వేషం, ధిక్కారం ప్రేరేపించే వ్యాఖ్యలు కూడా రాజద్రోహం కాదని వివరణలు చెబుతున్నాయి. కాని ఆచరణలో మాత్రం దీన్ని విచక్షణా రహితంగా ప్రయోగిస్తూనే ఉన్నారు. ఉదాహరణకు, కేరళకు చెందిన జర్నలిస్టు సిద్దిక్ కప్పన్ యుపిలోని హత్రాస్‌లో దళిత బాలిక అత్యాచారానికి గురైన దారుణ ఘటనకు సంబంధిం చి వివరాల సేకరణ కోసం వెళ్లాడు. ఆఖరుకు కర్ణాటకలోని ఒక విద్యాలయంలో సిఎఎకు వ్యతిరేకంగా నాటకం వేసిన తల్లి దండ్రుల పైన కూడా ఈ రాజద్రోహం కేసులే బనాయించారు. రైతుల ఆందోళనను బలపర్చినందుకు గాను బెంగళూరులో దిశా రవి అనే పర్యావరణ కార్యకర్త పైన 124 (ఎ) మోపారు. ఇదే ఆందోళనకు సంబంధించి రిపబ్లిక్ దినోత్సవం నాడు జరిగిన ఘటనల వెనక వాస్తవాలు వెల్లడించినందుకు గాను రాజ్‌దీప్ సర్దేశాయి, వినోద్ జోషి, జఫర్ ఆఘా, పరేశ్‌నాథ్, అనంతనాథ్ తదితరులపై రాజద్రోహం కేసులే పెట్టారు. సుప్రీం కోర్టు వారిని అరెస్టు చేయకుండా స్టే ఇచ్చింది.

**లా కమిషన్ సిఫార్సు చేసినా..**

నరేంద్రమోడీ ప్రభుత్వ హయాంలో ఈ తరహా కేసులు బాగా పెరిగిపోయాయి. 2014లో 47, 2015లో 30, 2016లో 35, 2015లో 51, 2018లో 70, 2019లో 93 రాజద్రోహం కేసులు నమోదవడం గమనిస్తే ఈ సంఖ్య పెరుగుతూనే వుందని అర్థమవుతుంది. వీటి కారణంగా సంబంధిత వ్యక్తులు విచారణ లేకుండా ఖైదులో మగ్గిపోవడం, వేధింపులకు గురవడం జరుగు తున్నది. కాని వీటిని అడ్డగోలుగా బనాయిస్తున్నారు గనక అంతిమంగా శిక్షలు పడే శాతం చాలా నామమాత్రం, 2016-17లలో ఒక్కొక్కరికి, 2018లో ఇద్దరికి, 2019లో ముగ్గురికి మాత్రమే విచారణలో నేర నిర్ధారణ జరిగింది. అదైనా ఏ మేరకు ఏ పద్ధతిలో జరిగిందనేది పరిశీలించవలసిందే. ఒక్క యు.పి లోనే హత్రాస్ ఘటన తర్వాత సిద్దిక్ కప్పన్‌తో పాటు మొత్తం 22 మందిపై 124(ఎ) కింద కేసులు పెట్టారు. దీంతోపాటే మణిపూర్ వంటి చోట్ల



జాతీయ భద్రతా చట్టం (నాసా)ను కూడా ప్రయోగించారు. వాస్తవానికి ప్రభుత్వ వైఖరితో విభేదించినంత మాత్రాన రాజద్రోహం అనడం సరికాదని 2018లో లా కమిషన్ స్వయంగా వ్యాఖ్యానించింది. అయినా ప్రభుత్వాల వైఖరిలో మార్పు రాలేదు. ఎ.పిలో ప్రస్తుత కేసునే తీసుకుంటే రఘురామ కృష్ణంరాజు మాట్లాడింది సరికాదని ఆయనకు కొన్ని మీడియా సంస్థలు విచక్షణా రహితంగా అధిక సమయం ఇచ్చి అదేపనిగా ప్రసారాలు సాగించడం కూడా అనుచితమని భావించినా రాజద్రోహం, కుట్ర వంటి కేసులను బనాయించడం సరికాదు. ఇందుకు సంబంధించి పలు ఇతర నిబంధనలు, చట్టాలు వున్నాయి. అవైనా నిర్బంధం, వేధింపులతో కాక కోర్టు ద్వారా చేయదగినవే, కాకుంటే ఎ.పి లో జరిగినదాన్ని విమర్శించే చాలా మంది కేంద్రంలోనూ, బిజెపి పాలిత రాష్ట్రాలలోనూ సాగుతున్న విచ్చలవిడి ప్రయోగాన్ని ప్రశ్నించరు.

ప్రపంచ వ్యాపితంగా అత్యధిక దేశాలు ఈ రాజద్రోహం వంటి నిబంధనలకు స్వస్తి చెప్పేశాయి. మారిన పరిస్థితులలో తమ కోణంలో దేశభద్రత టెర్రరిజం నిరోధం వంటి చట్టాలు చేసు కున్నాయి. మన దేశంలో నాసా, ఉపా వంటి చట్టాలు ఆ విధంగా చేసినవే అయినా వాటినీ విపరీతంగా దుర్వినియోగపరుస్తున్నారు. ఈ సమయంలో భీమ కోరెగావ్ కుట్ర పేరిట వయోవృద్ధులైన వరవరరావు, స్టాన్‌స్వామి, వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబ, పలువురు మహిళా కార్యకర్తలు కూడా ఖైదులో మగ్గిపోతున్నారు. జెఎన్‌యు విద్యార్థుల పైన కూడా ఇలాంటి విద్రోహం కుట్ర ఆరోపణలే మోపడంతో పాటు స్వయానా అప్పటి బిజెపి అధ్యక్షుడు అమిత్ షా దారుణమైన నిందలు వేయడం గుర్తుండే వుంటుంది. సిఎఎకు వినాశకరమైన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగే ఆందోళనలకు సంఘీభావం తెల్పినందుకు ఎంతోమంది సామా జిక కార్యకర్తలు జైళ్లలో మగ్గిపోతున్నారు. ఎ.పి ఎం.పి కి బెయిలు ఇవ్వడం తప్పుగాకున్నా అదే ఉన్నత న్యాయస్థానాలు కరోనా సోకినా స్టాన్‌స్వామికి గాని సిద్దిక్ కప్పన్‌కు గాని ఉపశమనం కలిగించింది లేదు. పౌరులకు రాజకీయ పక్షాలకు ప్రజా సంఘాలకు ప్రభుత్వాల తప్పిదాలపై పోరాడే హక్కు వుందంటూనే కర్కశ చట్టాలతో కటకటాలపాలు చేయడం అత్యంత అప్రజాస్వామికం.

## 124(ఎ) ఎత్తివేయాల్సిందే

మళ్లీ ఇప్పుడు రాజద్రోహం, మీడియా స్వేచ్ఛ అనే అంశానికి వస్తే తెలుగు చానళ్ల కేసులో గాని వినోద్ దువా విషయంలో గాని సుప్రీం కోర్టు పాక్షికంగానే రక్షణనిచ్చింది. వీరిని అరెస్టు చేయరాదని (బలప్రయోగం వద్దని) చెప్పడం రాజద్రోహం 124 (ఎ) సెక్షన్‌ను లోతుగా పరిశీలించి సమీక్షించాలని చెప్పడం మినహా మొత్తంగా ఎత్తివేయాలని నిర్దేశించలేదు. పైగా వారిపై ఎఫ్ఐఆర్ నమోదును కూడా ఖండించలేదు. ఒకసారి ఈ సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదైనాక కింద పోలీసులు ఏం చేస్తారనేది చెప్పడానికి లేదు. అందరూ సుప్రీం కోర్టుకు రాలేరు. వచ్చినా అందరి కేసులూ ఒకేలా విచారణకు నోచుకోకపోవచ్చు. గతంలో ఆర్నబ్ గోస్వామి, సిద్దిక్ కప్పన్ కేసులు ఒకేసారి వచ్చినా ఒకరికే ఉపశమనం దక్కింది. చీఫ్ జస్టిస్ ఎన్.వి రమణ హయాంలో ప్రాథమిక హక్కులకు సంబంధించిన అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత లభిస్తున్నట్టు చెబుతున్నారు గనక మౌలికంగానే మార్పుల అవసరాన్ని గుర్తించడం అవసరం. పదేళ్ల పైబడిన సీనియారిటీ వున్న జర్నలిస్టులకు సంబంధించిన కేసులలో ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి తోకూడిన కమిటీ ముందు తగు సమీక్ష తర్వాతనే ఎఫ్ఐఆర్ లు నమోదు కావాలని వినోద్ దువా కోరారు. అయితే అందుకు అంగీకరించలేమని, అది చట్టసభల పరిధిలో అంశమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. 124(ఎ) పునర్దర్శనం, పున:పరిశీలన వంటి మాటలు ఏం చెప్పినా అవి వెంటనే అమలుకు వచ్చేవి కావు. ఐపిసి ని పార్లమెంటు సవరించే వరకూ అలాగే వుంటాయి. 1890 నాటి రాజద్రోహ చట్టం, 1910లో బ్రిటిష్ పత్రికా చట్టం, 1917లో రౌలత్ చట్టం... ఇవన్నీ పరాయి ప్రభుత్వం దేశ ప్రజల స్వాతంత్రోద్యమాన్ని అణచివేయడానికి తెచ్చినవే. ఐపిసి 124(ఎ) ఆ అంశాలకే ప్రతిరూపం. వాటిని ఇంకా కొనసాగిస్తూ ఇప్పుడు సోషల్ మీడియా పైనా అదే దాడి చూస్తున్నాం. మీడియాలో పొరబాటు ధోరణులను సవరించుకోవలసిందే గాని తమకు వంత పాడలేదని పాలకులు వాటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాల రాచివేయడం సరి కాదు. పాత్రికేయులను, మీడియాను లోబర్చు కోవాలని చూడటం అనుమతించరానిది. ఇందుకోసం ఎలాంటి ప్రత్యక్ష పరోక్ష ఒత్తిళ్లు, వేధింపులు, నిర్బంధాలు సహించరానివి. సుప్రీం కోర్టు వ్యాఖ్యలు సరైన దిశలో వున్నా రాజ్యాంగం 19వ అధికరణం లోని ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే నిబంధనలు తొలగించబడితేనే ఈ ప్రక్రియ పూర్తవుతుంది. లేకపోతే సూక్తులతో ఆగిపోతుంది. ■



## ఆచార్య కేతు విశ్వనాథరెడ్డికి విమలాశాంతి సాహిత్య 'జీవిత సాఫల్య పురస్కారం


ప్రసిద్ధ అభ్యుదయ కథారచయిత ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డికి విమలాశాంతి జీవిత సాహిత్య సాఫల్య పురస్కారం ఇవ్వ నున్నట్లు డా. శాంతి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినారాయణ శ్రీమతి విమల ఇటీవలే అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె స్మృతి చిహ్నంగా ఈ జీవిత సాఫల్య పురస్కారం ఏడాదికొక్క సీనియర్ కథా, నవలా రచయితకివ్వాలని సంకల్పించి, తొలి పురస్కారం కేతు విశ్వనాథరెడ్డికి ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పురస్కార గ్రహీతను ఎన్నిక చేయడంలో జూరీ సభ్యులుగా ఆచార్య మేడిపల్లి రవికుమార్, డా. కె.పి.అశోక్ కుమార్, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి వ్యవహరించినట్లు తెలిపారు.

ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి కడప జిల్లా రంగశాయిపురానికి చెందినవారు. ఆయన జప్తు, ఇచ్ఛాగ్ని, కేతు విశ్వనాథరెడ్డి కథలు వంటి సంపుటాల్లో ఎనభై కథలు రచించారు. బోధి, వేర్లు అనే నవలికలు రాశారు. "కడప ఊర్లపేర్లు" అనే అంశం మీద పరిశోధించి, తెలుగు పరిశోధనలో కొత్త గవాక్షం తెరిచారు. కొడవటిగంటి కుటుంబరావు సాహిత్య సర్వస్వాన్ని ఆరు సంపుటాలుగా సంకలనం చేసి విలువైన ముందుమాటలు రాసి ఒక చరిత్ర సృష్టించారు. సామాజిక శాస్త్రాల వెలుగులో సాహిత్య అధ్యయనం చెయ్యవలసిన అవసరాన్ని సూచిస్తూ దృష్టి అనే విమర్శ వ్యాసం సంపుటాన్ని ప్రచురించారు. అనేక గ్రంథా లను సమీక్షిం చారు. తెలుగుసాహిత్యం గురించి ఇంగ్లీషులోను విమర్శ రాశారు. ప్రభుత్వ కళాశాలల్లోనూ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోనూ, డా.బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం లోను తెలుగు అధ్యాపకులుగా పనిచేశారు. ఆయనది సాహిత్యంలో మార్క్సీయ మార్గం, వాస్తవికతా వాదం. సామాజిక పరివర్తన ఆయన సాహిత్య లక్ష్యం. అభ్యుదయ రచయితల సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఇప్పుడు కడపలో నివాసం ఉంటున్నారు. ఈ పురస్కారం కింద ఆయన్ను రూ.50 వేల నగదుతోపాటు సత్కారం చేయనున్నట్టు శాంతినారాయణ తెలిపారు.

# కవితలు

## డిజిటల్ లాకర్

- మల్లేశ్వరరావు ఆకుల
79818 72655



**నో**ట్బుక్ చివరి పేజి
నా మొదటి వీలునామా
వ్యక్తిగత చిరునామా
నోట్‌బుక్ నేలమాళిగలో
దాచిపెట్టిన నా బంగారు నిధి

రాతకోతలు, కొట్టివేతల మధ్య
మారువేషంలో నా వ్యక్తిగత రహస్యాల అర
ఆ చివరి పేజీ
రాజుగారి రహస్యపు గది ఆ పేజీ
ఎవరూ నేర్పకనే
అదేమిటో తెలియకనే నాకు తెలిసిన క్రిప్టోగ్రఫీ
నేను మాత్రమే డెసిఫర్ చేయగల సంకేత భాష
నా ఉద్వేగాల రహస్య ప్రేమల మగ్రి తొగ్ర

ఇల్లైనా, క్లాస్ అయినా నటించడానికి
నాకు మాస్క్ లాంటిది నా నోట్‌బుక్ లాస్ట్ పేజీ
నా సోలో ఆటల మైదానం ఆ లాస్ట్ పేజీ
బాత్రూం సింగర్ అన్నట్లు నేను లాస్ట్ పేజ్
పెయింటర్‌గా
నా ఆబ్‌స్ట్రాక్ట్ ఆలోచనలకు అది కాన్వాస్
ఫోన్ అయితే ఇవ్వగలరు కానీ
పాస్వర్డ్ చెప్పగలరా?
నేను మాత్రం నా నోట్‌బుక్‌ని ఎవరికైనా ఇవ్వగలను

నా థాట్ రీడింగ్ వేరెవరూ చేయలేరు అన్న
ధీమా గల మేధావిని మరి
ఫొటో ఆల్బమ్‌కి ఇది కాలం కాకపోయినా
నా మ్యూజింగ్స్ గ్రంథం ఆ ఒక్క ఆఖరి పేజీ
అల్పాక్షరాల అనల్పార్థ కావ్య సంగ్రహం ఆ చివరి పేజీ
నా మొఖం నా శాశ్వత చిరునామా కాదు
ఎప్పటికీ నా నోట్బుక్ చివరి పేజీనే నా థంబ్ ప్రింట్
ఆ చివరి పేజీ ఇప్పటి భాషలో నా డిజి లాకర్ ■



## మొసలి కన్నీరు కార్చకు

**మా** ప్రాణాలు గాల్లో దీపాలైన
దేశంనిండా పార్థివ దేహాలు
నిత్య అగ్నిగుండాలై మండుతున్నా
పదవులకోసం పాకులాడిన మీరు
అయ్యో పాపమని పశ్చాత్తాపం ప్రకటించి
మొసలి కన్నీరు కార్చకండి పాలకా...

వైద్యానికే కాదు
ఖననానికి సైతం వసతులు లేనపుడు
విలాసమైన 'విస్టా'కోసం ఆలోచించిన మీరు
ప్రజలను చూస్తే బాధవుతుందని
మొసలి కన్నీరు కార్చకండి పాలకా ...

రాజకీయ వైకుంఠపాళీలో
నిచ్చెన మెట్లుగా వాడుకుని పైకెగబాకి
మమ్మల్ని కరోనా పాముకాటుకి బలిచేసి
ఏ మొహం పెట్టుకుని కన్నీరు కారుస్తారు
మొసలి కన్నీరు కార్చకు పాలకా ...

ఆత్మీయుల తీసివేతల్లో మేమున్నపుడు
పడిపోతున్న మీ ప్రతిష్ఠ కూడికల కోసం
మీరెన్ని తప్పుడు లెక్కలు చూపించిన
కాలుతున్న శవాలు
లెక్కలు తప్పవని మరిచిపోకండి

- దిలీప్.వి
84640 30808

**కవిత**



## వెతుకులాట

- ఏటూరి నాగేంద్రరావు
74166 65323

**ను**వ్వెతుకుతున్నది
నీలోనే వుంది
అదెక్కడో మూలన
పడుంటుంది చూడు
ఎంతసేపూ వెతికిన దగ్గర్నే వెతుకుతావు
దగ్గరిగా వుందో
అసలు వుందో లేదో!
దొరకాల్సిందేదో నీలోనే వుంది
ఎక్కడో ఒక చోట
నువ్వెతుకుతున్నది
నీ దగ్గరకు రావడానికి
పెనుగులాడుతూనే వుంటుంది
దాన్ని నువ్వు తడమకు!
గాయం చెయ్యకు
నవ్వుకుంటూ సారాయి తాగటానికి పో!

ఏ అనుభూతి నిన్నంటుకోదు
నువ్వు రేపో మాపో మరణిస్తావ్!
వచ్చిపోయే వాళ్ళ రద్దీతో నీకేం పని?

ఈ ప్రపంచంలో ప్రయత్నాలు విఫలమై
ఎవరో ఒకరు తిరిగొస్తుంటారు
దిమ్మరులూ, తిరస్కృతులే కాదు
నటనలు, ముసుగేసుకొన్నవాళ్లు
వెల్లకిలా పడుకొని ప్రయాణం చేస్తారు
నిశ్చింతగా!

నువ్వు దాచుకున్న ముఖం
నీకే కనపడుతుంది వికృతంగా
దేన్నని వెతుకుతావ్!
నీ అంతర్మథనం
నీ చుట్టే తేలుతూ ఉంటుంది
కాగితపు పడవను నెట్టాల్సిందే తప్ప
ఏ మాటలూ, శ్వాసలూ నిన్ను తాకవు

నువ్వు అదృశ్యమై డొల్లగా మిగిలాక
వెతికి కనపడిన దాన్ని ఏం చేసుకొంటావ్?
నువ్వెక్కడున్నావిప్పుడు?
నాలోనా! నీలోనా!
దేశదిమ్మరి నీడగానా!
నువ్వేమీ వెతక్కు
నేను నీనుంచి ఇంకా విడిపోలేదు!

# 'తపాలా బంట్రోతు' కవిత పుట్టిందిలా ...



## తిలక్‌గారితో నా అనుబంధం

- ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు

99454 22742

**ఏపుగా పెరిగిన చెట్టుమీద**
**ఎఱ్ఱని పువ్వొకటి విరిసి**
**ఎండలో మెరుస్తూ**
**'ఇది నిజం! ఇదే నిజం!' అని నవ్వుతూ**
**అంతలో రాలిపోయింది...!**
**వింతగా స్మృతిపథంలో మాత్రం మిగిలింది!!**

1966 జూన్ 30వ తేది రాత్రి 45 సంవత్సరాలు కూడా నిండకుండా తిలగ్‌గారు అకాల మరణం చెందగానే నేను దిగ్భ్రాంతుడనయ్యాను. ఆయన చనిపోవడానికి సరిగ్గా ఒక్క సంవత్సరం ముందు 1965 ఏప్రిల్ నెల 'భారతి'లో "కిటికీ" అనే కవిత ముద్రితమయింది. అందులోని పై పాదాలు నాకు జ్ఞప్తికి వచ్చాయి.

**నా పరిచయం**

"శ్రీశ్రీ – తిలక్ – శేషేంద్ర" – ఈ ముగ్గురూ "నవ్యాధునిక కవిత్రయం" అంటాడు మిత్రుడు డా॥ శ్రీ పాద కృష్ణమూర్తి. నేను శ్రీశ్రీకి ఏకలవ్య శిష్యుణ్ణి; తిలక్‌కి ప్రత్యక్ష శిష్యుణ్ణి; శేషేంద్రకు ఆత్మీయ మిత్రుణ్ణి! 1955 నుండి 1961 వరకూ ఆరు సంవత్సరాలు తిలక్‌గారిని గాఢమైన భక్తితో ఆరాధిస్తూ సేవించాను. నాదీ, తిలక్‌గారిదీ తణుకే అయినా 1955 వరకూ వారితో నాకు పరిచయం ఏర్పడలేదు. 1955 జూన్ నెల 'భారతి'లో మొట్టమొదటి పుటలో "ఆర్తగీతం" అనే కవిత ప్రకటింపబడింది. దాని క్రింద "బాలగంగాధర తిలక్" అని ఉంది. కొటేషన్స్ ఉండడంవల్ల అది 'పెన్‌నేమ్' అనుకున్నాను. అప్పుడు నేను భీమవరం కళాశాలలో తెలుగు బి.ఏ. చదువుతున్నాను. ఆర్తగీతం కవిత నన్ను అమితంగా ఆకర్షించింది. దానిని కంఠస్థం చేసి, కనపడిన మిత్రులందరి దగ్గరా బిగ్గరగా చదివేవాడిని. ఇంతలో దసరా సెలవులు వచ్చాయి. తణుకు వెళ్ళాను. శ్రీపాద కృష్ణమూర్తి అనే మిత్రుడు (తణుకువాడు) "తిలక్ మన ఊరివాడే. టౌన్ హాల్ ప్రక్కన యిల్లు. రా! నిన్ను పరిచయం చేస్తాను" అన్నాడు. అలాగ 1955 సెప్టెంబరు నెలలో దసరా పండుగ దినాల్లో తిలక్‌గారితో నాకు పరిచయం ప్రారంభమయింది. 1961లో జూన్ నెలలో నేను ఎం.ఏ. చదవడానికి తిరుపతి వెళ్ళేవరకూ మా గురు–శిష్య సంబంధం గాఢంగా కొనసాగుతూ వచ్చింది.

**నన్ను దృష్టిలో పెట్టుకొని చేసిన కొన్ని రచనలు**

నేను దిగువ మధ్యతరగతి పేదబ్రాహ్మణ కుటుంబానికి చెందినవాణ్ణి. బి.ఏ. చదివి నెలకి 110 రూ.లు సంపాదించే చిన్న గుమాస్తా ఉద్యోగం (తంతి–తపాలా శాఖలో). పెళ్ళాం – ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు. ఇంకా చదువుకొని జీవితంలో ఉన్నత స్థితికి రావాలని ఏవేవో కలలు–కోరికలు. "నా ఆర్థిక పరిస్థితి బాగుంటే నిన్ను ఎంఏ చదివించేవాడిని!" అనేవారు తిలక్ అప్పుడప్పుడు. ఇటువంటి పేద యువకుడనైన నన్ను దృష్టిలో పెట్టుకొని, నా పేరుతోనే చేసిన రచనలు మూడు : (1) 1957లో రచించిన "విచిత్ర ప్రణయం'' నాటిక. దీంట్లో ''సుచిత్ర–సుబ్బారావు'' నాయికానాయకులు. (నేను సిగ్గుపడి నా పేరును "శేఖర్"గా మార్చివేశాను.), (2) "సుందరీ – సుబ్బారావు" కథ. (ఇది 1958లో ఆంధ్రప్రభ వారపత్రికలో వచ్చింది.) సుబ్బారావు అనే పేద యువకుడు సుందరి అనే ధనికుల అమ్మాయిని ఏక త్రైవానురాగంగా– ముళ్ళపూడివారి మాటల్లో చెప్పాలంటే 'ఏకలవ్యునిగా' లేదా One way traffic గా ప్రేమించి

విఫలుడు కావడం దీనిలోని ఇతివృత్తం. (3) "తపాలా బం(ట్రోతు" అనే వచన కవిత. (ఇది ఆ రోజుల్లో గోరాశాస్త్రిగారి సంపాదకత్వంలో హైదరాబాదునుంచి వెలువడుతున్న "ఆంధ్రజనత" అనే దినపత్రిక - 1959 దీపావళి ప్రత్యేక సంచికలో ముద్రితమయింది.) ఈ మూడూ హాస్యరస ప్రధానమైనవే.

**'తపాలా బంట్రోతు' కవిత పుట్టుక**

1959లో ఆగస్టు నెలలో పశ్చిమ గోదావరి జిల్లా తంతి–తపాలా శాఖవారి వార్షికోత్సవాలు భీమవరంలో జరుగబోతున్నాయని నాకు నెలరోజులు ముందుగానే తెలిసింది. నేను ఆ రోజుల్లో తణుకు పోస్టాఫీసులో గుమాస్తాగా వుండేవాడిని. కవిగా నటునిగా నాకు డిపార్టుమెంటులో కొంచెం పేరుండేది. కొందరు గుమాస్తా మిత్రులు నన్ను ఆ వార్షికోత్సవానికి పద్యాలు రాయమన్నారు. నేను : "ఈ వూళ్ళో నా కన్నా గొప్పవారు, మా గురువుగారు అయిన దేవరకొండ బాలగంగాధర తిలక్‌గారున్నారు. ఆయన చేత ఒక మంచి కవిత రాయించి తీసికొనివచ్చి చదువుతాను. పద్యాలకన్నా వచనకవిత అయితే అందరికీ అర్థమవుతుంది" అన్నాను. వెంటనే ఆరోజే తిలక్‌గారింటికి వెళ్ళి "పోస్టుమేన్ మీద అద్భుతంగా ఒక గేయం వ్రాసిపెట్టండి. భీమవరంలో జరిగే మా వార్షికోత్సవాలలో చదువుతాను" అని అన్నాను. తిలక్‌గారు చిరునవ్వు నవ్వి "సరే! చూద్దాంలే!" అన్నారు. మరిచిపోతారేమోనని వారికి ఇంచుమించు ప్రతిరోజూ జ్ఞాపకం చేసేవాడిని. ఇలా నెలరోజులపాటు ప్రాధేయపడ్డాను. ఎప్పుడడిగినా "చూద్దాంలే! చూద్దాంలే!" అంటూనే వచ్చారు కాని కవిత మాత్రం రాయలేదు. ప్రముఖ తమిళ రాజకీయవేత్త కామరాజ్ నాడార్ ఎవరైనా వచ్చి ఏదైనా పనిచేసిపెట్టమంటే "పార్కలాం" (=చూద్దాంలే) అనేవాడట! అలా చేశారు తిలక్! ఈలోగా జిల్లా తంతి– తపాలాశాఖ వార్షికోత్సవం వచ్చేసింది. చేసేదేమీ లేక నేను భీమవరం వెళ్ళి ఆ వార్షికోత్సవసభలో నాకు మిక్కిలి ఇష్టమైన తిలక్‌గారి 'ఆర్తగీతం' చదివి వచ్చేశాను.

తర్వాత రెండు మూడు నెలలు గడిచిపోయాయి. ఒక రోజు సాయంకాలం "చాలా అర్జంటు పని వుంది; వెంటనే యింటికి రా!" అని నాకు కబురు చేశారు. ఏమిటో అనుకుని పరుగెత్తుకొని వెళ్ళాను. "నీకో మంచి గేయం చదివి వినిపిస్తాను, కూచో!" అని చెప్పి–

**"మైడియర్ సుబ్బారావ్!**
**కనిపించడం మానేశావ్!**
**ఏంవిటీ? పోస్టుమేన్ మీద గేయం వ్రాయాలా?**
**అందమైన అమ్మాయి మీదకాని**
**చందమామ మీదకాని**
**వంద్యుడైన భగవంతుడి మీద కాని, అ**
**వంద్యుడైన ధీరనాయకుడి మీదకాని**
**పద్యాలల్లమని మన పూర్వులు శాసిస్తే**
**ఎక్కడి పోస్టుమానో యీ గోల! ఈ**
**చక్కని సాయంత్రం వేళ!!"** – అంటూ "తపాలా బంట్రోతు" కవిత అంతా చదివి వినిపించారు. నేను బ్రహ్మానందభరితుడనై పోయాను! వెంటనే ఏదో జ్ఞాపకం వచ్చి గతుక్కుమన్నాను. "అరెరే! ఇంతమంచి గేయం జరిగిపోయిన మా వార్షికోత్సవ సభల్లో చదివి వుంటే ఎంత బాగుండేది! మీరు నాకు టైంలో రాసియివ్వలేదు!" అని తిలక్‌గారి మీద నిష్ఠురోక్తులాడాను. ఆయన చిరునవ్వు నవ్వుతూ "నువ్వు రాయమన్నప్పుడు రాసివుంటే ఏడిసినట్టు వచ్చేది. గతమూడు నెలలపాటు నా మనసులో నానింది కాబట్టే యింత బాగా వచ్చింది!" అన్నారు. అయినా సరే "ఇంతమంచి గేయం వ్యర్థమై పోయిందే!" అని తరచుగా ఆయన దగ్గర బాధపడసాగాను. కాని దీనిని రాసిన కొద్ది రోజులకే హైదరాబాదునుండి గోరాశాస్త్రిగారు తిలక్‌గారికి ఒక లేఖ రాశారు. తమ "ఆంధ్రజనత" దీపావళి సంచికకు తిలక్ రచన ఒకటి తప్పక పంపవలసిందని కోరుతూ ఆ లేఖలో రాశారు. వెంటనే ఈ "తపాలా బంట్రోతు" కవిత పంపించారు తిలక్. తరువాత నేను కనపడినప్పుడు: "సుబ్బారావ్! బాధపడకు. నీ గేయం 'ఆంధ్రజనత'కు పంపించానులే!" అన్నారు నవ్వుతూ. ఆ గేయం మొదటిపాదంలో ఉన్న "మైడియర్! సుబ్బారావ్" అని నన్ను చేసిన సంబోధన దగ్గర చిన్న Foot Note ఇచ్చి– పుట కిందిభాగంలో "సుబ్బారావు అనే మిత్రుడు జిల్లా తపాలాశాఖ జరుపుకునే వార్షికోత్సవానికి పోస్టుమేన్ మీద వ్రాయమని కోరినప్పుడు వ్రాసి యిచ్చిన గేయం" అని రాశారు. నిజానికిది అప్పుడు రాసింది కాదు, మూడు నెలల తర్వాత రాసినది.

"ఊరిచివరి యిల్లు" మా యింటి పరిసరాలను దృష్టిలో పెట్టుకొని రాసిన కథ. మా యిల్లు ఊరికి దూరంగా, రైల్వే స్టేషన్‌కు దగ్గరగా, పంట పొలాల మధ్య ఉన్న తాటాకు ఇల్లు. మా యింటికి సమీపంలో చెదురు మదురుగా మరికొన్ని తాటాకు ఇళ్ళు ఉండేవి. వాటిలో కొన్ని ఇళ్ళల్లో కొందరు వ్యభిచారిణులు (వేశ్యలు) ఉండేవారు. తిలక్‌గారు నాకోసం అప్పుడప్పుడు రిక్షాలో మా యింటికి వచ్చినప్పుడు ఆ పరిసరాలను బాగా గమనించారు. ఆ నేపథ్యంలో ఊహించి ఒక పతిత యువతిని గురించి రాసిన కథ "ఊరి చివరి యిల్లు". ■



## మిత్రుల కోసం...

- ఈతకోట సుబ్బారావు
94405 29785

ఎంత దూరం వెళ్ళగలరు మీరు
జ్ఞాపకాల నా అముద్రిత గ్రంథాల నుంచి
ఒక్కో పేజీ తిరగేసినప్పుడల్లా
ఏ లోకంలో ఉన్నా
నా కంటిపాప ముంగిట్లో వాలి పోవాల్సిందే!

మీరెన్ని పాలపుంతల కవతల ఉన్నా
నా మనసు తెరమీద ప్రతిబింబించాల్సిందే
చిన్నప్పుడు చేతిలో చెయ్యేసి నడిచిన
చేతినే వీడ్కోలు గీతంగా ఊపుకుంటూ

నన్ను ఒంటరిని చేసి వెళ్లిపోయారు

కలిసి ఈదిన బాల్యం నదిని మరిచి
పంచుకున్న వసంతాల పాటల్ని మరచి
ఎదుర్కొన్న ఎడారి మరీచికల్ని విడిచి
మృత్యువు చిటికెన వేలు పట్టుకొని
కాలానికి అందనంత దూరం వెళ్లిపోయారు

మనల్ని శాసించిన కాలాన్ని జయించి
పంచభూతాల జమా ఖర్చులు చెల్లించినా
నా జ్ఞాపకాల జైల్లో మీరు ఖైదీలే
నా అనుభవాల తోటలో
వాడని పారిజాతాలే!

మీ మాట నాకిప్పుడు వినిపించకపోతేనేం
నా గొంతులో కవితలై మీరు పాడుతుంటారు
పారిపోయిన మిత్రులారా!
కాచుకోండి ...
ఇవాళ కాకపోయినా రేపైనా
మీరెళ్ళిన దారిలో మాకెదురు పడాల్సిందే!

**(కోవిడ్ కాటుకు కనుమరుగవుతున్న
ఎందరో సహా పాత్రికేయులు, కవుల కోసం)**

## జాలి చూపులు

రక్తపు మరకల మధ్య
చిత్రంగా అతడు
రోడ్డు చివర మలుపులో
నాకెప్పుడూ కనబడుతూనే ఉంటాడు
వయస్సుకు నాకంటే చిన్నోడే అయినా
ఉత్సాహం కరువై
అసంతృప్తికి లోనైనట్టు
కర్కశంగా నరుకుతూ
వికారాల మధ్య
నాకు వికృతంగా కనిపిస్తాడు
నన్ను కూడా వాడు
చూసీ చూడనట్టు
చూసినట్టే ఉన్నాడు
నా జాలి చూపుల్ని
పసిగట్టినట్టే ఉన్నాడు
అందుకే కాబోలు
చిరునవ్వుతోనే జవాబిచ్చాడు
వృత్తి పట్ల తనకున్న అంకితభావాన్ని
అవలీలగా చెప్పేసాడు
నా మనసుకు పడ్డ మరకల్ని
ఆసాంతం తుడిసేసాడు
మాంసపు ముక్కల్ని
కళాత్మకంగా నరుకుతూ
తన పనిలో తాను నిమగ్నమైపోయాడు...



- సునీత పేరిచర్ల
83094 20900






# మనసులను కుదిపే 'మూడో కన్నీటి చుక్క'

**జోస్యుల దీక్ష**
89855 70753

**చ**దువరి మనసులో దీపం వెలిగించడమే కవిత్వం చేసే పని అంటారు ఇస్మాయిల్. శతాబ్దాలుగా కవిత్వ ప్రయోజనం విషయంలో ఉపదేశమా? ఆనందమా? అంటూ ఆలంకారికుల మధ్య వివాదాలు చెలరేగుతూనే ఉన్నాయి. నాకెందుకో ఈ విషయంలో ఇస్మాయిల్ గారి నిర్వచనమే బాగా నచ్చింది. ఆనంద ఉపదేశాల సమ్మేళనం నాకిందులో కనిపించింది. ఇప్పుడు ఈ నిర్వచనానికి అక్షరాలా బొల్లోజు బాబా గారి 'మూడో కన్నీటిచుక్క' కవితా సంపుటి నాకు లక్ష్య గ్రంథంగా అనిపించింది.

ఇటీవల వివిధ జర్నల్స్‌లో వస్తున్న కవిత్వాన్ని పరిశీలిస్తే కొన్ని చదవగానే ఇట్టే అర్థమైపోతున్నాయి. కాని అవి పేలవంగా ఉండి వచనాన్ని విడగొట్టి ముక్కలు చేసి రాసినట్లుగా అనిపిస్తున్నాయి. వాటిలో పెద్దగా కవిత్వంగాని, కవితాశిల్పం గాని కనిపించటం లేదు. మరికొన్ని కవితలు మొదటి నుండి చివరిదాకా ఎన్నిసార్లు చదివినా కనీసం అందులోని వస్తువుని కూడా పట్టుకోలేకపోతున్నాం. అలా రాయటం ఒక ఫేషన్ అనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ రెండు లోపాలను అధిగమిస్తూ వచ్చిన కవితా సంపుటే బాబా గారి ఈ మూడో కన్నీటిచుక్క అని నాకనిపించింది.

నాకు కవితా సంకలనాలు చదివే అలవాటు కొంచెం తక్కువే. ఒక నవలో, ఒక కథో మనల్ని కూడా తీసుకు వెళ్ళినట్లు ఈ కవితా సంపుటులు తీసుకువెళ్ళవు అని నా ఉద్దేశం. నా ఆలోచన పొరపాటు కావొచ్చు. కొన్నిసార్లు చదవటానికి ప్రయత్నించినా ఎక్కడో ఒకచోట అవి నన్ను ఆపేసేవి. అలాంటిది బాబా గారి ఈ 'మూడో కన్నీటి చుక్క' మొదలుపెట్టాక అది నన్ను కడకంటా లాక్కొనిపోయింది.

ఒక నవలను ఒక పేజీ తరువాత మరొక పేజీ తిప్పుకుంటూ ఎలా చదువుకొంటూ పోతామో ఈ కవితా సంపుటి కూడా అలాగే మనల్ని తీసుకుపోతుంది. ఒక కవిత తరువాత ఇంకోటి, అందులో ఏం చెప్పేరు? ఎలా చెప్పేరు? అన్న ఉత్సుకత పుస్తకం పూర్తయ్యేదాకా మనల్ని ఆగనివ్వదు. కొన్ని కవితలు కథలు చెప్తున్నట్లు, కొన్ని మనతో మాట్లాడుతున్నట్లు, కొన్ని ప్రశ్నిస్తున్నట్లు ... ఇలా వివిధ ఎమోషన్స్‌ని మన చేత మోయిస్తాయి.

ఒక రైతు ఆత్మహత్య చేసుకోవడానికి ముందు అతని చుట్టూ జరిగే సాధారణ సన్నివేశాల్ని **'ఒక దు:ఖానికి కొంచెం ముందు'** అనే కవితలో గుండెలను పిండేటట్లు చాలా ఆర్ద్రంగా ఇలా చిత్రిస్తారు బాబా.

**"చేను గట్టుపై కూర్చొని/ ఎండిన పంటను/ ఓదారుస్తున్నాడు, ఇసుక నిండిన హృదయంతో/ అప్పటికింకా అతని భార్యలో సగభాగం ఖననం చేయబడలేదు".**

అతను ఆత్మహత్య నిర్ణయం తీసుకోవడానికి ముందు వున్న పరిస్థితులను అన్నింటినీ వర్ణించారు. అతని భార్యలో *సగభాగం ఖననం చేయబడలేదు* ... ఈ పదాలు ఆ బంధం యొక్క బరువును పాఠకుడికి చాలా సులువుగా అర్థమయ్యేట్లు అమర్చారు కదా! కవి యొక్క ఆలోచనల లోతు పాఠకుడికి తెలిసేలా రాయటం

చిన్న విషయం కాదు. ఇందులో భార్య కదా అందరికన్నా నష్టపోయేది అని అర్థమౌవుతుంది.

**"అప్పటికింకా ఆ చెట్టుకొమ్మ**

**ఉరికంబం పాత్రను ధరించలేదు"...** అనటంలో సమస్తమైన సృష్టికి ప్రాణం పోసే చెట్టు కూడా ఆరోజు ఉరికంబం పాత్రను పోషించింది అనటం ఒక వైవిధ్యం.

**"ఒక కవిని కలిసాను"** అనే కవిత సమాజంలో కవియొక్క స్థానాన్ని చెప్పక చెపుతుంది.

**"రేపతను తన ఇంటిలో ఉండకపోవచ్చు**

**రేపతను తన దేహంలో ఉండకపోవచ్చు**

**రేపతను తన ఆత్మలో ఉండకపోవచ్చు**

**కాని తన పేరులో సజీవంగా ఉంటారు"** అనటంలో ఒక కవి మాత్రం సంజీవిని వేసుకున్నట్టు సజీవంగా అతని పేరులో, అతని రచనలలో నిలిచి వుంటాడని సాధారణమైన పదాల కూర్పుతో చెపుతారు కవి. **'వేడుక'** కవిత ఒక సరికొత్త అనుభూతిని కలిగించింది. ఇందులోని పసివాడు బాబాయేనేమో అనిపించింది.

**"పాపం పసివాడు/ లోకం ఎదురు పడ్డప్పుడల్లా**

**శోకంతో కన్నీరు మున్నీరయ్యేవాడు**

**వాడి బాధ చూడలేక/ఓ దేవత వాడి నేత్రాలపై/ బీజాక్షరాలను లిఖించి/ కన్నీటి బిందువులను కవిత్వంగా మార్చే వరమిచ్చింది"**

మనల్ని బాధపెట్టే ఘటనలు చాలా తారసపడతాయి మనకి. ఆ బాధని కవిత్వంగా మార్చే వరం వున్న వాళ్ళకి మరిన్ని ఎక్కువ దృశ్యాలు హృదయాన్ని తాకుతాయి. అస్తమించే వరకూ ఆ దృశ్యాలకు, ఆ కవిత్వధారకు విశ్రాంతి ఉండదు.

**'పిట్టగోడపై వాలిన పిచ్చుక' ...**

**"పిచ్చుకా !**

**నిన్నటి దాకా నీవు ప్రయాణించిన మార్గాన్నీ**

**పడిలేచిన నీ ఆత్మనీ చూడాలని అనిపిస్తోంది"**

ఈ కవితలోని ఈ వాక్యాలను చదవగానే నాకు బాల్యపు తీపి గుర్తులను, బాల్యపు సంతోషాలను పోగొట్టుకున్న బాధ కలిగింది. మధుర జ్ఞాపకాలు అంతరించి పోయాయని మనసు చలించింది. గ్లోబలైజేషన్, నాగరికత, టెక్నాలజి అనే ఆయుధాలతో మనమే వాటిని హత్య చేసేము అనిపిస్తుంది. 'నిన్నటిదాకా' అనటంలో ఈరోజు ఆ పిచ్చుక లేదన్న భావం స్ఫురిస్తుంది.

**"నాలుగు స్తంభాలు"** ... ఇది చదివితే మనిషి కాళ్ళు,కళ్ళు, మనసు అన్నింటిని ఐరన్‌లెగ్ అనాలేమో అనిపించింది. ఎక్కడ కాలు పెడితే, దేని మీద దృష్టి పెడితే అది నశించిపోతుంది. ప్రకృతిని మాయం చేసేస్తాడని సాగే ఈ కవిత మొత్తం ఒక కథా కవిత కింద అనిపించింది అంత ఉత్కంఠంగా సాగింది. **'నాన్నతనం'** ... అసలు నాన్న గురించి ఎంత బరువైన మాటల్లో ఎన్ని పేజీలు, పుస్తకాలు రాస్తే పూర్తవుతుంది. ఎన్ని రాసినా ఇంకేదో మిగిలిపోతుంది అనిపిస్తుంది. కానీ 'నాన్నతనం' కవితలో మనం రోజూ నడిరోడ్డు మీద చూసే ప్రతి సంఘటనలో ప్రతి మనిషిలో నాన్న ఉన్నాడని చెప్పేరు. ఇకనుంచి నాకు బాధ్యతగా పనిచేసుకున్న ప్రతి మనిషిలో ఒక తండ్రి కనబడతాడు. నాకే కాదు, ఈ కవిత చదివిన ప్రతి ఒక్కరికీ కనబడతారు.

**'చక్కగా ప్రేమించుకోక'** ... ఇది కూడా బాబా గారి నిశిత పరిశీలనకి ఒక చక్కటి ఉదాహరణ. ఈ విషయం గురించి కూడా రాయవచ్చా? ఇందులో ఇంత మంచి ఆలోచన తీసుకోవచ్చా? అనిపిస్తుంది.

**"ఒక్కసారిగా అనిపించింది**

**తిరస్కరించిన తరువాత/ ద్వేషించనక్కరలేదని**

**చక్కగా ప్రేమించుకోవచ్చనీ! "**

తల్లిని వదిలి చిన్న పాపాయి మన దగ్గరకు రావడానికి ఇష్ట పడదు. వచ్చిన తర్వాత ఏడుస్తుంది. అమ్మ దగ్గరకి వెళ్ళగానే మనల్ని నవ్వుతూ పలకరిస్తుంది. దాని గురించే చెప్పేరు. మనం ఎవరినైన తిరస్కరించినా ద్వేషించనవసరం లేదని కొత్త సందేశం మనకి చెప్పేరు. **'ఆ మూడు రోజులు'** ... నేటి సమాజంలో అవగాహనతో ఉండాల్సిన ఒక సమస్య. స్త్రీలలో ఋతుక్రమాన్ని ఒక దోషాచారంగా చూడాల్సిన సమయం కాదిది. దాన్ని రహస్యంగా చూడాల్సిన అవసరం లేదు. అది మన బాడీ నేచురల్ సైన్స్. ఈ కవిత ద్వారా ఆడవారికే కాదు, మగవారికి కూడా స్త్రీల సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో, ఎలా ఆలోచించాలో అవగాహన కలిగించేలా రాసారు. ఇలాంటి సున్నితమైన విషయాన్ని ఎంచుకొని, గుంభనమైన పదాలతో కవిత నడిపించిన తీరు చాలా ప్రశంసనీయం.

**"ఏక వస్త్ర,త్రిరాత్ర అంటూ/ సౌందర్యాత్మక భాషలో కప్పెట్టిన**

**కొన్ని దైహిక రహస్యాల పట్ల/**

**అసున్నితత్వం పొందాల్సిన సమయం వచ్చింది"**

ఎంత సున్నితమైన విషయాన్నైనా సరే వినసొంపైన పదాల అమరికతో ఎదుటి వారికి సందేశాత్మకంగా ఇలా చెప్పొచ్చని నాకు తెలిసింది. **"పరిమళించిన ప్రేమ"** ... ఈ కవిత ఆహ్లాదాన్ని

కలిగించింది చదువుతున్నంత సేపు. ఇంత చక్కని ఆలోచనను ఎక్కడ నుండి తీసుకున్నారో.

**"ఒకరోజు**
**తనకు బిగుతైన గౌనుల్ని బ్యాగులో పెట్టుకొని**
**స్కూలుకు తీసుకెళ్ళింది ఏదో చారిటీ ప్రోగ్రాం అంటూ**
**మర్నాడు ఉదయం ఒక గులాబీ**
**నవ్వుతూ ప్రత్యక్షమైంది ఆ మొక్కకు**
**చప్పట్లు కొడుతూ ఆనందిస్తోంది మా అమ్మాయి**
**ఆ దృశ్యాన్ని/ బహుశా ఎక్కడో ఎవరో ఓ పాప**
**తనకు సరిగ్గా సరిపోయిన గౌనును చూసుకొని**
**మురిసిపోయినట్టి ఆనందం కావచ్చు/ ఆ గులాబీ"**

**"జీవించటమే"** ... ఒకరోజు హఠాత్తుగా ఒకదారి తన గమ్యాన్ని మరిచిపోయింది. ఇది కూడా ఒక కథలా ఉత్కంఠగా చెప్పేరు. ముగింపు ఏం ఇస్తారో అని ఉత్సుకత రేకెత్తింది. ఎక్కడో ఏదో వుంది అని అది మన దగ్గర వున్న దానికన్నా గొప్పదని భ్రమపడి వెతుక్కుంటూ కాలం వృధా చెయ్యటం కంటే మనలో ఏముంది, మనం ఏం చెయ్యగలం అని ఆలోచించాలి అని.

**కుంటుకొంటూ పడమరవైపు వెళుతోన్న అతన్ని**
**చూస్తుంటే అర్థమైంది/ గమ్యం అంటే ఏమిటో**
**ఇంకెప్పుడూ అది గమ్యం కొరకు అన్వేషించలేదు**

**"అయితే ఏంటటా"**... కొందరు మోసం చేస్తూ అడుక్కుంటున్నారు వాళ్ళని నమ్మి డబ్బులు వెయ్యకూడదు అని మనలో చాలామంది అనుకుంటాం. ఆ విషయాన్ని గురించే చెప్పిన కవిత ఇది. అసలు సిసలుగా జనాన్ని మోసం చేసే వాళ్ళని మనం మళ్ళీ మళ్ళీ నమ్ముతాం అని చెప్పేరు.

**జనాల్ని ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తుంది... తప్పే!**
**పాయింటు బ్లాంకులో/ నీ సంతకాలు పెట్టించుకొందా లేక**
**ఉపాధి కల్పన పేరుతో నీ భూములు లాక్కొందా?**
**నీకులాంటి జరుగుబాటు లేనివాళ్ళు/ చచ్చిపోవాలా ఏమిటి?**

ఇది చదివితే ఆ బిచ్చమెత్తుకునే వాళ్ళు మీద జాలి వేసింది. నిజంగా మోసం చేస్తున్న వాళ్ళని మన తరతరాల సంపదను దోచుకుంటున్న వాళ్ళని తలచుకొంటే మన మీద జాలిపడాలి మనం. **"Alone but together"** ... ఇది చాలా భావోద్వేగమైన కవిత. మనకు దగ్గరైన మనిషి కాలం చేస్తే ఆ మనిషి తాలూకు జ్ఞాపకాలు అన్నీ మనకు గుర్తుకొస్తాయి. ఆ మనిషితో పెనవేసుకున్న అన్ని బంధాలు, బంధుత్వాలు మన కళ్ళముందు మెదులుతాయి. అదే మన కళ్ళకు కట్టినట్టు చెప్పేరు ఈ కవితలో. **"ఒక చావు వంద చావుల్ని బతికిస్తుంది"** అనటంలో ఆత్మీయులు ఒక్కరెవరైనా మరణిస్తే వారితో అనుబంధమున్న వారంతా ఒక్కొక్కరు వరుసగా ఎలా గుర్తు కొస్తారో ఈ కవితలో చెప్తారు బాబా. ఈ కవిత చదవగానే బంధాలు చాలా విలువైనవి... బతికి ఉన్నప్పుడే వాటిని కాపాడుకోవాలి అనిపిస్తుంది. **"ఏం పని ఉంటుంది నీకూ...?"** కవితలో ఇంట్లో వుండే ఆడవాళ్ళని పనిలేకుండా ఉంటారని చులకనగా చూస్తారు. కాని కవి ఈ కవితలో ఆమె పనితనాన్ని, ఆమె కష్టాన్ని వ్యంగ్యధోరణిలో వివరిస్తారు. ఆమె గనుక ఒక్కరోజు ఇంటిని పట్టించుకోకపోతే ఇల్లు ఇల్లులా ఉండదనే విషయాన్ని కళ్ళకు కట్టినట్లు వివరిస్తారు.

**'అస్తిత్వం'** ఈ ప్రపంచం ఏది నీలో వుండకూడదు అని అనుకుంటుందో అదే నువ్వు. అదే నీ వ్యక్తిత్వం దాన్ని వదులుకోకు దాన్నే ప్రేమించు అని ఎంత తేలికైన పదునైన మాటలతో చెప్పారో నిన్ను ఎలా చూడాలని ప్రపంచం అనుకుంటుందో అలా వేషం కట్టి మారిపోకు అని

**"ఈ ప్రపంచం/ ఏవి నీకు ఉండకూడదని ఆశిస్తుందో**
**అదే నీ అస్తిత్వం వాటిని కోల్పోకు**
**కర్ణుడి కవచకుండలాలని కోల్పోయినట్లు**
**ఇంకొకరి అభిప్రాయంగా ఉండేకన్నా**
**నువ్వే ఓ సిద్ధాంతంలా మారు" ...** అంటారు


ఈ కవిత.. అణిచివేయాలని చూసే సమాజానికి ఎదురు తిరగాలి అనే స్ఫూర్తిని కలిగిస్తుంది. ఇలా ఇందులో వున్న కవితలన్నీ కూడా దు:ఖాన్ని, ఆనందాన్ని కలిగించాయి. కొన్ని ప్రశ్నించాయి. కొన్ని బాధ్యతని గుర్తు చేసాయి. కొన్ని కొత్త భావాలకు అక్షర రూపాన్ని ఎలా ఇవ్వాలో నేర్పాయి.

బాబా ఈ సంపుటి చివర కొన్ని మెరుపుల్లాంటి ఫ్రాగ్మెంట్స్‌ని ఇచ్చారు. మూడో కన్నీటిచుక్క అంటే ఏంటో చివ్వరి ఫ్రాగ్మెంట్స్‌లో ఇలా చెబుతారు.

**"ఏ రెండు / కన్నీటి చుక్కలు ఒకేలా ఉండవు**
**వాటిని చూసినపుడు/ జారిన మూడో కన్నీటి చుక్క కవిత్వం"**

ఈ సంపుటిలో మేధావి ప్రదర్శన ఎక్కడా కనబడలేదు. సృజన కనబడింది. కొన్ని కొత్త విషయాలు తెలిసాయి. ముఖ్యంగా చేరాల్సిన కవితా వస్తువులు అన్నీ పాఠకుడికి చేరాయి. అవును అలా చేరటమే కవిత్వం యొక్క పరమావధి. కవి యొక్క సాఫల్యత. ■

## సమీక్ష






# బాల్య స్మృతుల గుచ్ఛం సల్లో సల్ల


- కవితశ్రీ
94946 96990


**బా**ల్యం చాలా బలమైంది. ఉద్విగ్నపూరితమైంది. దానికి నెమ్మది అన్నది ఉండదు. అలసట ఉండదు. కల్మషం ఉండదు. మురిపిస్తూనో వెరపిస్తూనో బాల్యం మనిషిని జీవిత పర్యంతం వెంటాడుతుంది. ఆ వెంటాడ్డం కలల్లో ఎక్కువ జరుగుతుంది. ఆ మురిపించడం వెరపించడాలు కొందరిలో తక్కువగా ఉండవచ్చు. కొందరిలో మోతాదు మించవచ్చు. మొత్తం మీద బాల్యం మనిషిపై బలమైన ముద్ర వేస్తుంది. మనిషి తీసుకునే నిర్ణయాల్లోనూ అది కనబడుతుంటుంది. రచయితల రచనలపై బాల్య ప్రభావం తప్పకుండా పడుతుంది. చిత్తూరు జిల్లా రచయిత ఆర్.సి.కఅష్ణస్వామి రాజు 'సల్లో సల్ల' కథల సంపుటి నిండా బాల్యం, బాల్యంతో ముడివేసుకున్న అనుభవాల స్మృతులే దర్శమిస్తాయి.

ఏ అరమరలూ పక్షపాతాలూ లేని బాల్యం విలువకట్టడంలో తూనికరాయి లాంటిది. చిన్నపిల్లల్ని 'అరే నువ్వు పెద్దయ్యాక ఏమవుతావురా?' అని అడిగితే ప్రతి పిల్లాడు తడుముకోకుండా బస్ డ్రైవర్ని అవుతానంటాడు. కాకుంటే ట్రాక్టరు డ్రైవర్ని అవుతానంటాడు. అదీ కాకుంటే ట్రైన్ డ్రైవర్ని అవుతాననో, విమానం డ్రైవర్ని అవుతాననో అంటాడు. అంతకంటే హుందా ఐన వృత్తి మరొకటి ఉండదని వాడి అభిప్రాయం. పదిమంది ప్రయాణికుల ప్రాణాలు డ్రైవరు చేతిలో ఉంటాయని, అందువల్ల అతని బాధ్యత గొప్పదని, అలాంటి బాధ్యత తాను తీసుకోవాలని వాడు ఉవ్విళ్ళూరుతాడు. అది వాడి మానవ విలువ. అది నిజం, యథార్థం ఐన విలువ. ఒకవేళ ఎవడైనా ఈ వృత్తుల్ని కాదని వేరేవి చెప్పాడు అంటే అప్పటికే వాడు పెద్దవాడు అయ్యాడనీ, సమాజం వాడిని ఖరాబు చేసేసిందని నిర్ణయానికి రావచ్చు. వయసు పెరుగుతున్నా మనసు ఖరాబు కాకుండా ఉండాలంటే ఆ మనిషి చాలా అమాయకుడు, మంచివాడు అయ్యుండాలి. అలాంటి కల్మషం లేని మంచితనం, మనిషితనం మనం కృష్ణస్వామి గారిలో, వారి కథల్లో, కథల్లోని పాత్రల్లో చూడొచ్చు.

కృష్ణస్వామి కథల్లో ఎక్కువగా చిన్న పిల్లకాయలు, అందునా అమ్మ కూచులే కనబడతారు. ఆయన బడి ఈడు పిల్లలు, కాలేజీ విద్యార్థులు, పెళ్లికొడుకుల్లాంటి పెద్ద పిల్లకాయల కథలు రాసినా వాళ్లు కూడా తల్లిచాటు బిడ్డలుగానే ఒదిగి ఉంటారు. అమ్మా ఆకలే కథలో బాలడు (తల్లి అచ్చెమ్మ), కర్షక మిత్రలో పేరిశాస్త్రి (తల్లి వైదేహి), సల్లో సల్లలో సెంగలబ్బ (తల్లి అమ్మన్నెమ్మ), పెద్దమ్మ పెరుగులో శీనడు (తల్లి లక్ష్మమ్మ), అమ్మా నారాయణమ్మలో కిష్టడు (తల్లి నారాయణమ్మ) చెట్టులాంటోడు మేనమామలో మురుగడు (తల్లి రామలక్ష్మి), సిలబస్‌లో చేరని పాఠంలో అబ్బ (తల్లి అరుంధతమ్మ) అమ్మకూచులైన బడిపిల్లలు లేదా కాలేజి పిల్లకాయలే. బంగారు సంబంధంలో ప్రదీప్ (తల్లి కౌసల్య), విశాల హృదయంలో శరత్ (తల్లి అరుణ) పెళ్లికొడుకులైనా అమ్మ మాట బుద్ధిగా వినే తల్లిచాటు బిడ్డలే.

సల్లో సల్ల కథల్లో ఈడిపస్ కాంప్లెక్స్ స్పష్టంగా కనబడుతుంది. ఈ కథల నిండా బిడ్డల్ని అక్కున చేర్చుకునే అమ్మలు, మగతోడు పోగొట్టుకుని, లేదంటే భర్త ప్రవాసంలో ఉండగా

బిడ్డల్ని కళ్ళల్లో వత్తులు వేసుకుని పెంచుకునే ఒంటరి తల్లులే కనబడతారు. అమ్మతో కొడుక్కీ, కొడుకుతో అమ్మకీ, లేదంటే అత్తతో పెద్దమ్మతో పెనవేసుకున్న స్నేహాలే కనబడాతాయి. తండ్రితో బంధం ముడిపడ్డ పిల్లలు కనబడరు. స్నేహాలు సాన్నిహిత్యాలూ ఆప్యాయతలూ తల్లీ కొడుకుల మధ్య మాత్రమే కనబడుతుంటాయి. అమ్మ సినిమాకి వెళ్ళాలంటోంది కథలో ఇది స్పష్టంగా కనబడుతుంది. బాల్యానికి ప్రకృతితో, పశువులు పెంపుడు జంతువులతో, పేదవాళ్ళతో సాన్నిహిత్యం ఎక్కువ. ఈ కథల్లో ఓ పక్కగా జంతువులు అరుస్తుంటాయి. పక్షులు కూస్తుంటాయి. ఆపక్కనే పేదలు బతుకులీడుస్తుంటారు.

విశాల హృదయం కథలో పెద్ద కారులో వచ్చిన రఘురాం దారిలో కనబడ్డ ట్రాక్టరులో నుండి చెరుకుగడ లాక్కుంటాడు. అప్పుడు రచయిత "సాదాసీదా జనం పెరుక్కొంటే రచ్చ చేసే మనిషి ఎక్కడ లేని ప్రేమ కురిపిస్తూ వంకరిది కాకపోతే మంచిది విరుచుకోకూడదా?" అని ట్రాక్టర్ డ్రైవర్ అన్నాడని అంటాడు. ఇలా కృష్ణస్వామి గారి కథల్లో సామాజిక కోణం చాలా బక్కపలచగా మాత్రమే కనబడుతున్నది. కర్షకమిత్ర లాంటి కథల్లో వర్గదృష్టికి పుష్కలమైన అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రయత్నం జరగలేదు. ఆ విధంగా వస్తువు యొక్క సైద్ధాంతిక ప్రాతిపదిక వృథా అయింది. మనిషి ఆవేదనల నుంచి ఉపశమనం పొందే సాధనం, బతుకులో భాగం పాట అన్న విషయాన్ని రాజు గారు బాగా పట్టుకున్నారు. సందర్భాల్ని సారవంతం చెయ్యడానికి పాటని బాగా వాడుకున్నారు.

సల్లో సల్ల కథల సంపుటిలో రాయలచెరువు రోడ్డు కథలో తల్లి వైద్యం కోసం పరుగుపందెం గెలిచిన కమల ఒక్కతే ప్రాధాన్యత ఉన్న ఆడపిల్ల పాత్ర. ఐనా ఆడబిడ్డల పట్ల రచయితకు ప్రత్యేకమైన మొగ్గుదల ఉంది. అమ్మా నీకు దండమే కథలో సరోజక్క ముద్దు కిష్టడిని ఆడపిల్లలా సింగారించి మురిసిపోతుంది. వాడి అత్త మునిలక్ష్మి వాణ్ని 'కిట్టమ్మా' అని పిలుస్తుంది. సరోజక్క పుట్టిన పదిరోజులకే చనిపోయిన కూతురి గుర్తుగా తన పురుటిబట్టలు దాచుకుని రోజూ పడుకోబోయే ముందు వాటిని తాకి, ముద్దు పెట్టుకుని ఏడ్చి నిద్రపోతుంది. ఆడపిల్లల్ని అభిమానంగా చూసుకోవాలని కిష్టడికి నూరి పోస్తుంది.

భాష విషయానికి వస్తే నెల్లూరు జిల్లా, తమిళనాడు సరిహద్దుల్లోని చిత్తూరు మాండలికాన్ని రచయిత పాఠకుల పెదాలకు పైపైన పూశారు. ఆయనకు తెలిసిన ఆ భాషలో ఆయన రెండు మూడు శాతానికి మించి రాయలేదు. ఆ ప్రాంత భాషకు దాని సొబగులు దానికున్నాయి. ప్రపంచీకరణ ఫలితంగా చదువు సంధ్యలు పెరగడం వల్లా, మాధ్యమాల ప్రభావం వల్లా భాష యాసల్ని కోల్పోతూ ప్రామాణీకరణం చెందుతోంది. ఒకప్పుడు తెలుగుభాష సంస్కృత శిశువని వాదించే స్థాయికి పోయింది. ఇప్పటి తెలుగు టింగ్లిష్‌గా వేగంగా మారిపోతోంది. తెలుగును తెలుగ్గా పలుకుతూ భాషలో ప్రాంతీయ వాసనలు నిలుపుకున్న తరానికి వయసైపోతున్నది. తెలుగును తెలుగూ అనీ టెల్గు, టెల్గూ అనీ పలుకుతున్న టింగ్లిష్ తరం వేగంగా రూపొందుతోంది. అందువల్ల రచయితలు ఎలాంటి సంకోచాలూ పెట్టుకోకుండా తెలంగాణా రచయితలంతా తెగువతోటి తమ తమ మాండలికాల్ని పూర్తిస్థాయిలో రికార్డు చేయాల్సిన అవసరం చాలా ఉంది. అందుకు రచయితలు పాత్రల సంభాషణలతో బాటు కథనం కూడా ప్రాంతీయ యాసల్లో చెయ్యాల్సి ఉంది.

బాల్యంలో ఎలా భావజాలాలు, దృక్పథాలు ఉండవో సల్లోసల్ల కథల్లో కూడా ఉండవు. అది మంచి గుణమే అని సమీక్షకులు జోకొడతారు. ఐతే సమీక్షకూ విమర్శకూ కొద్దిపాటి తేడా ఉంటుంది. సమీక్షకుడికి రచయితతో సాన్నిహిత్యం ఉంటుంది. రచయిత నన్ను గౌరవించి సమీక్ష చెయ్యమన్నారు కదా అన్న కృతజ్ఞత, ఒకానొక మోమాటమూ ఉంటాయి. విమర్శకుడిలో వాటికి స్థానం ఉండదు. ఉండాల్సిన అవసరమూ లేదు. ఒకవేళ సమీక్షకుడు రచనని వేలెత్తి చూపాల్సి వచ్చినా ఇబ్బంది పెట్టకుండా తలనిమిరి బుజ్జగించినట్లు చెబుతాడు. అది రచయిత అర్థం చేసుకోవచ్చు. చేసుకోలేకపోవచ్చు. కానీ విమర్శకుడు కుండబద్దలు కొడతాడు. సల్లో సల్ల కథలకి ముందుమాట రాసిన ఏమ్వీ రామిరెడ్డి గారు తన సమీక్షలో విమర్శా సిద్ధాంతాల జోలికి పోవడం లేదని సెలవిచ్చారు. ఆ మాటల ఆంతర్యం ఏమిటో వివరించి రచయితని గాయపరచడం భావ్యం కాదు. కానీ మర్మంగానే ఒక్కమాట చెప్పవచ్చు. తన రచనల్ని సిద్ధాంతాల తక్కెళ్ళలో తూచి వెలకట్టగల స్థాయికి రచయిత ఎదగాలని రామిరెడ్డి గారి ఆకాంక్ష అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ■

# ఆకలి బండి

- ఈ.రాఘవేంద్ర
94940 74022



వైరస్ నిశబ్దపు రెక్కల చప్పుళ్లకు
పట్టణం భయం దుప్పటి కప్పుకొని ఒణుకుతోంది
ప్రధాన కూడలి
తనువునంతా విదిలించుకుని
మోడైన చెట్టులాగుంది
తోపుడు బండిలో
బ్రెడ్ పొట్లాలు కొబ్బరి బోండాలతో
ఎండుటాకు లాంటి
ఆరు పదుల ముసలావిడ
ఆస్పత్రి రోడ్డులో నిలువుకాళ్లను నాటుకొని
నేలపై నిస్సత్తువగానే వేలాడుతోంది

అన్ని రుతువులలో
అక్కడే కష్టం బొక్కెన వేసి
జీవన గమనాన్ని తోడుకొనే ఆశల ఆకాశం
అనేక ఉదయస్తమయాల్ని
అనేకానేక రంగుల్లో దర్శించి
కాలాన్నంతా మధనం చేసిందిక్కడే

ఎవరికి వాళ్ళు ఇంటికి పరిమితమై
మనోవ్యాకులతతో చిరిగిపోతున్న వేళ
కొంగు గుడ్డనే ముక్కుకు అడ్డుపెట్టుకొని
వినియోగదారుని రాకకై ఎదురుచూస్తున్న
పేగుగాయం ఎక్కిళ్ళ పాట తను

కొక్కేనికి తగిలించిన సెలైన్ బాటిల్లాంటి తను
కుటుంబం మొత్తానికి
బెత్తెడు కడుపులు నింపే
బతుకు తెరచాపకు చుక్కాని
తన పంటి కింద నలిపిన వక్కాకు ఉమ్మిలా
కారుణ్య రహిత క్రిమి
గజగజ వణుకును ఊదేసినట్లుంది
రెండు వేళ్ల మధ్యనుంచి
తరగని బండిలో వస్తువుల్ని చూస్తూ
దిగులు పడిన నదిలా రోడ్డుకు చుట్టుకుని
సుడులు తిరుగుతోంది

నేనన్నాను ఇంతటి విపత్కాలం
ఇంట్లో ఉండొచ్చు కదా అని..?
దానికి ఆవిడ సమాధానం
రోగాని కి మందులున్నాయి
ఆకలికి వాక్సిన్ లేదు కదా సారూ అని..!

# హైకూలు



వాకిలిలో
ముగ్గు పెడుతూ
తలెత్తిన చంద్రబింబం

తలుపు సందు నుంచి
ఓరగా చూస్తున్న
నెలవంక

సహస్ర కన్నులతో
ప్రేమ కురిపిస్తూ
పురివిప్పిన నెమలి

నిండు జాబిల్లి
వెన్నెల మైదానంలో
ఒంటరి కుందేలులా

ఊరంతటికి
ఒకే దీపం
పౌర్ణమి రాత్రి

పురాణా పూల్
భాగమతి మువ్వల సవ్వడి
వేసిన వారథి

పూరేకుపై
మంచుబిందువులా
బుగ్గపై బాష్పం

- దామరకుంట శంకరయ్య
94408 76788



పాత పుస్తకాన్ని
తిరగేస్తుంటే
నెమలికన్ను జారింది!

నీరెండిన నూతిలోంచి
రెండు కప్పలు
పైకి చూస్తున్నాయి

తలపై ముల్లుంచుకొని
పాటను వినిపిస్తున్న
గ్రామఫోన్ రికార్డు

వంతెన్ని దాటుతూ
స్వరం మార్చిన
రైలు బండి

అరచేతిలో
తిరిగిన బొంగరం
బాల్యాన్నిచ్చింది

తల్లీ బిడ్డల
ముచ్చట్లతో నిండిన
పిల్లల వార్డు

తీపి గులాబీని
తయారుచేస్తున్న
పీచు మిఠాయి తాత

చిరుగాలొచ్చి
ఒంటరితనాన్ని
పలకరించింది!

- బి.గోవర్ధనరావు
94419 68930



# సాహితీ స్రవంతి ఆధ్వర్యాన చలం జయంతి, జనకవనం

ప్రముఖ రచయత గుడిపాటి వెంకటాచలం 127వ జయంతి వేడుకలు సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో మే 19న అంతర్జాల వేదికగా ఘనంగా జరిగింది. ఈ వేదికకు సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు శాంతిశ్రీ, డా.ఎం ప్రగతి, కెంగార మోహన్ అధ్యక్షత వహించారు. ఈ సభలో ప్రముఖ రచయిత ఓల్గా ప్రసంగిస్తూ... చలం గొప్ప తాత్వికుడని, తాత్విక దృష్టితో ప్రపంచాన్ని గమనించాడని, తాత్వికుడి లక్షణం ప్రశ్నించడం అన్వేషించడమని అన్నారు. సత్యం గూర్చి అసమానతల గూర్చి అన్వేషించాడని, తాత్విక లక్షణం ఉన్న వ్యక్తే గాని తాత్విక దృక్పథం ఇలాగే ఉండాలన్ని ప్రతిపాదనేది తను చేయలేదన్నారు. తను అన్వేషిస్తున్న సందర్భంలో ఎదురయ్యే సమస్యలకు, ఉత్పన్నమయ్యే ప్రశ్నలకు పరిష్కారాలు చెప్పడం తన పనిగా పెట్టుకోలేదన్నారు. స్త్రీ స్వేచ్ఛంటే విశృంఖలత్వం కాదని, స్వేచ్ఛంటే ఒక బాధ్యతని, ఇదే చలం కోరుకున్నా డన్నారు. భార్యని బానిసగా చూడటమే ఈ వివాహబంధం అని చలం గుర్తించాడన్నారు. 1940 దశకంలో రాసిన మైదానం నవల ఇప్పుడు వెలువడిఉంటే పరిస్థితి ఎలా ఉ ండేదో అంచనా వేయొచ్చుని అన్నారు. చలం కులాలపై మతాలపై తిరుగుబాటును ప్రకటించాడన్నారు. అసలు చలం ఈనాటి సమాజంలో ఉండి రాసి ఉంటే అతన్ని ఇవాళ బతకనిచ్చేవారా అనే సందేహం కలుగుతుందన్నారు. స్త్రీలు తమ హక్కులను సాధించుకోవాలనుకుంటే చలాన్ని చదవాలన్నారు. తన జీవితంలో డబ్బుని, వ్యక్తి గత ఆస్తిని ద్వేషించాడని, ఆస్తికి ప్రాధాన్యత నివ్వకుండా జీవించాడని అయన విశ్వజనీనమైన ఆలోచనలతో బతికారన్నారు. చలం అంటే సత్యమని, చలం అంటే సౌందర్యమని, చలం అంటే స్వేచ్ఛ అని స్వేచ్ఛగా జీవించాలనుకుంటే సత్యాన్ని ఆశ్రయించాలని అప్పుడే సౌందర్యవంతమైన జీవితం అలవరచుకుంటామన్నారు. కొత్తతరం చలం గూర్చి స్వయంగా తెలుసుకోవాలని అన్నారు. కవి కెంగార మోహన్ తన సందేశమిస్తూ సిగ్మండ్ ఫ్రాయిడ్ భావాలతో ప్రభావితమైన రచయిత చలం అని అన్నారు. భారతీయ సాహిత్యంలో సంచలనమైన రచయితగా, సంశయవాదిగా కనిపించినప్పటికీ చలం సమాజాన్ని చాలా దగ్గరగా చూశారన్నారు. కులానికి, వివాహవ్యవస్థకు కాలదోషం పట్టిందని చలం అంటాడన్నారు.

అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పాల్గొన్న కవులతో జనకవనం జరిగింది. చిలుకూరి దీవెన, కోడె యామినీ దేవి, గోవిందరాజు సుభద్రాదేవి, కల్యాణదుర్గం స్వర్ణలత, డా.పాతూరి అన్నపూర్ణ, డా.మల్లెపోగు వెంకటలక్ష్మమ్మ, డాక్టర్ కాళ్లకూరి శైలజ, సిహెచ్‌వి లక్ష్మీ, బిబిటి సుందరతేజ, ఓలేటి దుర్గామహాలక్ష్మి,పద్మావతి రాంభక్త, రోహిణి బొమ్మన, లావణ్య సైదీశ్వర్, సాదుం శ్రీకాంత్, వై.కె.సంధ్యాశర్మ, రజిత కొండసాని, శ్రీశ్రేయ కూరెళ్ళ, ఎన్‌వి పద్మావతి, వెంకట సాయి ప్రసాద్, నాగాస్త్ర తదితరులు తమ కవితలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమాన్ని చీకటి దివాకర్ సమన్వయం చేశారు. సమావేశంలో సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యరంజన్, రాష్ట్ర నాయకులు వొరప్రసాద్, జంధ్యాల రఘుబాబు, సత్యాజీ తదితరులు పాల్గొన్నారు. **– మోహన్** ■

డైరీ



# నేడు వీరేశలింగం అవసరం ఎక్కువగా ఉంది

## కందుకూరి వర్ధంతి సభలో విజయ బక్ష్

**నే**డున్న వివక్షలు, మూఢనమ్మకాల కారణంగా వీరేశలింగం అవసరం ఇప్పుడే ఎక్కువగా ఉందని సాహితీ స్రవంతి 27.05. 2021 నిర్వహించిన వీరేశలింగం 102వ వర్ధంతి సభలో ముఖ్య వక్త శ్రీమతి విజయబక్ష్ పేర్కొన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు గనారా, జంధ్యాల రఘుబాబు అధ్యక్షత వహించిన ఈ వెబ్ సమావేశంలో ఒక మనిషి ఇన్ని పనులు చేయగలడా అనిపించేలా పది మంది పనులు వీరేశలింగం ఒక్కరే చేశారని అన్నారు. ఆయన వ్యక్తి కాదు ఓ సంస్థ అని కొనియాడారు. ఆరుద్ర అన్నట్టు శారీరకంగా దుర్బలులైనా జాతిని బలిష్టం చేసి దేశాభివృద్ధిని, భాషాభివృద్ధిని సాధించిన మనోబల భీములలో పంతులుగారు ప్రథములని అన్నారు. ఆయన ఏదో రాసేసి తన పని అయిపోయిందనే రకం కాదని, వాటిని బోధకుడుగా ఆచరణశీలిగా చేసి చూపించిన వీరేశలింగ ఆధునిక సాహిత్యానికి ఒక వేగుచుక్క అని అన్నారు. పంతులు గారు ఆస్తికుడైనా హేతువాది అని, అమావాస్య రోజునే ఉద్యోగంలో చేరి మూఢ నమ్మకాలపై తిరుగుబాటు జెండా ఎగురవేశారని చెప్పారు. అందుకే దక్షిణ భారతదేశంలో ఆధునికుడుగా, శత్రుభయంకరుడిగా వీరేశలింగాన్ని కట్టమంచి వారు కీర్తించారని చెప్పారు. రఘుపతి వెంకటరత్నం నాయుడి బోధలు, పిఠాపురం మహారాజు గారి ఆర్థిక సహాయ సహకారాలు పంతులు గారు చేసిన అభ్యుదయకర కార్యాలకు ప్రేరణగా, బాసటగా ఉన్నాయని ఆమె అన్నారు. ప్రార్థనా సమాజాలు స్థాపించడం, అందులో స్త్రీలకు ప్రత్యేకమైన తర్ఫీదు లివ్వడం చేశారని, అందుకోసం తన జీవిత భాగస్వామి రాజ్యలక్ష్మిని ఎప్పుడూ తనతో తీసుకెళ్లేవారని, ఆ కాలానికే స్త్రీలను ఉద్యమాల్లోకి తీసుకొచ్చిన ఘనత వీరేశలింగానికే దక్కుతుందని అన్నారు. వితంతువులకు చదువు చెప్పించడం, వారికి పునర్వివాహాలు చేయడం ఆయన నిస్వార్థ సేవలకు అద్దం పడుతుందని చెప్పారు. అన్ని కులాల వారికి విద్య అవసరమని చెప్పిన వీరేశలింగం తను స్థాపించిన సమాజాల్లో అన్ని కులాలవారికి ప్రాతినిధ్యం ఇచ్చారన్నారు. టౌన్ హాలులో కూడా అన్ని కులాలవారిని సభ్యులుగా చేశారన్నారు. ఆ కాలంలోనే అమ్మాయిలు, అబ్బాయిలు ఒకేచోట చదువుకునేలా కో ఎడ్యుకేషన్‌ను ప్రోత్సహించారన్నారు. తమ ప్రహసనాల్లో మూఢ నమ్మకాలను చీల్చి చెండాడారని అన్నారు. అప్పుడున్న సమాజంలో తన ఆధునిక భావాలను వెంటనే హర్షించరన్న ఉద్దేశంతో తన రచనల్లో, ఉపన్యాసాల్లో ఉపనిషత్తులు ఇతర ఆధ్యాత్మిక అంశాలను జోడించి చెప్పేవారని, అవి ఆయన బోధనలను, అభ్యుదయవాదాన్ని ముందుకు తీసుకుపోయాయని చెప్పారు. తన వివేకవర్ధని పత్రికకు సొంతంగా ముద్రణా యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవడం ఆయన పట్టుదలను దీక్షను చూపుతుందన్నారు. రాజశేఖర చరిత్రము నవల రాయడానికి గోల్డ్‌స్మిత్ నవల 'ది వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్'ను అనుసరించారని కొందరు విమర్శకులు చెప్పినా, పాత్రలు వాటి స్వభావాలు వేరుగా ఉన్నాయని, అందులో రుక్మిణి మగవేషం వేసుకొని తన సమస్యను తానే పరిష్కరించుకోవడం ఆయనకు స్త్రీలపై ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తుందన్నారు.

అధ్యక్షత వహించిన గనారా మాట్లాడుతూ నేడు ఆధునికులమని చెప్పుకునే ఈ సమాజంలో నేడు దుర్భల పరిస్థితులు ఉన్నాయని, వాటిని వీరేశలింగం గారి స్ఫూర్తితో మనం పనిచేయవలసి ఉందన్నారు. జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ వీరేశలింగం గారి వ్యాసాలు కూడా ఎంతో విలువైనవని, స్త్రీల చదువు ఎంతో ముఖ్యమని చెప్పడమే కాకుండా చేసి చూపారన్నారు. ఆనాటికే పరిశోధనాత్మక జర్నలిజాన్ని ఆయన చూపాడని, హాస్య సంజీవనిలోని ప్రహసనాలు ఒక్కో బాణంలా మూఢనమ్మకాలపై ఆయన సంధించిన అస్త్రాలుగా పేర్కొన్నారు. ఈ వర్చువల్ సభలో సాహితీ స్రవంతి నాయకులు చీకటి దివాకర్, సత్యరంజన్, లక్మయ్య, వొరప్రసాద్, కెంగార మోహన్, డా.ప్రగతి, కుమారస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన జనకవనంలో కవులు అవ్వారు శ్రీధర్ బాబు, చందలూరి నారాయణరావు, మొయిద శ్రీనివాస్, ఎన్.నాగమణి, ఆది ఆంధ్ర తిప్పేస్వామి, కోసూరి రవికుమార్, సిద్ధార్థ కట్టా, లక్ష్మినారాయణ కొల్లి, పెంకి విజయకుమార్, ఇందిరా శర్వాణి, దాదా ఖలందర్, ఇందిర నిట్టల తమ కవితలు వినిపించారు. **– జంధ్యాల రఘుబాబు**

## కవి, జర్నలిస్టు కోప్రా మృతి



**దా**దాపు 50 ఏళ్ల క్రితం  నెల్లూరు జిల్లాలో మారుమూల గ్రామంలో పుట్టి తీవ్రవాద వామపక్ష ఉద్యమాల వైపు ఆకర్షితుడైన కోలపూడి ప్రసాద్ (కోప్రా) 7.6.2021 ఆదివారం నాడు మృతి చెందారు. మెదడు రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టి హైదారాబాద్‌లోని ప్రయివేట్ ఆసుపత్రిలో చనిపోయాడు. ఆయనకు భార్య నిర్మల, ఒక పాప ఉన్నారు. అతడు కొన్నేళ్ల క్రితం మావోయిస్ట్ దారిని వదిలి జర్నలిజం వైపు వచ్చాడు. ఉదయం, వార్త, ఆంధ్రజ్యోతి, నవ తెలంగాణా, సూర్య, మన పత్రిక, బీసీ టైమ్స్ తదితర సంస్థల్లో జర్నలిస్టుగా చేశాడు. అక్షరం మీద పట్టు కుదిరింది కాబట్టి నిప్పుల కక్కే వాఖ్యాలను రాశాడు. వ్యాసాలు, కవితలు, పాటలు, వేలాది బీసీ ఉద్యమ కరపత్రాలు రాశాడు. తను నమ్మిన ఎంబిసి  సిద్ధాంతంపై దాదాపు పది పుస్తకాలు రాశాడు. తన పేరుతో ఏది రాసిన రాసిన దానికి కట్టుబడి ఉన్నాడు. మారోజు వీరన్న, కలేకూరి ప్రసాద్, అంబటి సురేంద్ర రాజు, నిజం శ్రీరామమూర్తి, ఆర్.కృష్ణయ్య, చింతా మోహన్, ఎరుకల ప్రభాకర్, సబ్బండ వెంకన్న  తదితరులకు సన్నిహితంగా ఉన్నాడు.



మహేశ్వరయ్య



వంశీ

## మహేశ్వరయ్య, వంశీలకు నివాళి

**క**ర్నూలు జిల్లా సాహితీస్రవంతిలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ కవిత్వం, కథలతో సాహిత్యరంగాన్ని సుసంపన్నం చేసిన యువకవి యస్.మహేశ్వరయ్య (39) కరోనాతో అస్తమించారు.  కరోనాకు బలైన సాహితీ స్రవంతి జిల్లా సహాయ కార్యదర్శి యస్.మహేశ్వరయ్య గా విశిష్ట సేవలందిస్తూ సాహితీ స్రవంతిలో ముఖ్య భూమిక పోషించేవారు. కర్నూలు జిల్లాలో పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించేవారు. కవిగా, కథకుడుగా, వక్తగా రాణించారు. ఇటీవల వచ్చిన దళిత కథల సంకలనం నిప్పుల వానలో చూపుడువేలు అనే కథను అందించారు.

దాదాపు 700 కవితలు, 20 కథలు, 2 బుర్రకథలు, 2 నాటికలు 10 పుస్తకాలు రచించిన కవి కలుగొట్ల వంశీ (41)ని కరోనా బలితీసుకున్నది. బెంగుళూరులో చికిత్సపొందుతున్న వంశీ మృతిచెందారు. కర్నూలు జిల్లా గని గ్రామానికి చెందిన వంశీ సుప్రసిద్ధ పద్యకవి కలుగొట్ల విజయాత్రేయ–విజయలక్ష్మీ దంపతులకు 5 ఫిబ్రవరి 1980న జన్మించారు. కరోనాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. కరోనా సంక్షోభంలో 100 కూలీలకు 15 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. కరోనా రాకుండా ఉచిత హెూమియో మందులను పంపిణీ చేశారు. 100 యాచకులకు గ్రామంలో భోజనాలు అందించారు. సినిమాల్లోనూ సుకవి ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఐదు లఘుచిత్రాలను నిర్మించి 2018 తెలంగాణ ఫిల్మోత్సవ్‌లో ‘ఇక్కడి చెట్లగాలి’ లఘుచిత్రానికి స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకున్నారు. 2017లో లండన్‌లో ఉగాది పురస్కారం అందుకున్నారు.

# ఆరుద్ర

31.08.1925–04.06.1998





సుప్రసిద్ధ అభ్యుదయ కవి, రచయిత, పరిశోధకుడు, విమర్శకుడు త్వమేవాహంతో తెలుగు కవిత్వంలో కొత్త ప్రయోగశైలి ప్రారంభించారు. అనేక కావ్యాలు, పరిశోధనా గ్రంథాలు రాశారు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం 13 సంపుటాలు ఒక చేతి మీదుగా రచించి తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు.

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 2 ▪ SANCHIKA - 9 ▪ KRISHNA ▪ June 2021
RNI NO.APTEL/2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication : 27.5.2021



# సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రచురణలు

రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రధానంగా వ్యవసాయ రంగంలో, ఆర్థిక, సామాజిక రంగాలలో మార్పులు గురించి నిపుణులతో సర్వే చేయించి ప్రచురించిన గ్రంథాలు.



పేజీలు : 272 వెల : 150/-



పేజీలు : 384 వెల : 200/-



పేజీలు : 304 వెల : 150/-



పేజీలు : 248 వెల : 100/-


పేజీలు : 80 వెల : 40/-


పేజీలు : 134 వెల : 40/-


పేజీలు : 84 వెల : 30/-


పేజీలు : 200 వెల : 150/-


పేజీలు : 240 వెల : 100/-



పేజీలు : 64 వెల : 30/-


పేజీలు : 32 వెల : 15/-


పేజీలు : 36 వెల : 15/-


పేజీలు : 32 వెల : 15/-


పేజీలు : 40 వెల : 20/-


పేజీలు : 172 వెల : 100/-

ఎంపిక చేసిన 15 పుస్తకాలు. అన్ని పుస్తకాల విలువ రూ. 1205/-.

ఇప్పుడు 600/- చెల్లిస్తే రిజిస్టర్ పోస్టులో పంపుతాం.

ప్రజాశక్తి బుక్‌హౌస్, గూగుల్ పే, ఫోన్‌పే నెం : 9291603475

## ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533

బ్రాంచీలు : విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ, ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం


If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 94900 99057